## అట్టహాసంగా గద్దర్
# ఫిల్మ్ అవార్డులు



**ఉగాది రోజు సిఎం రేవంత్ చేతుల మీదుగా ప్రదానం**

**తారల రాకతో పులకించిన చిత్రసీమ**

ఉగాది సందర్భంగా గద్దర్ తెలంగాణ సినీ అవార్డుల వేడుక అంగరంగ వైభవంగా సాగింది. చిత్రసీమ మొత్తం తరలి రావడంతో సంబరాలు అంబరాన్ని అంటాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సినీ పురస్కారాల్ని ఏర్పాటు చేసి రెండేళ్లుగా ఘనంగా ప్రదానం చేస్తోంది. 12లో

TARAJYOTHI TELUGU DAILY

# తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

శనివారం, మార్చి 21, 2026 | సంపుటి - 20 | సంచిక 189 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## సెట్టింగ్ పూజలు జగన్‌కు అలవాటు

**డిక్లరేషన్ ఇవ్వని నైజం జగన్‌ది**

**మండిపడ్డ మంత్రి పార్థసారధి**

అమరావతి : జగన్ ఆలయాలకు వెళ్లకుండా ఇంట్లోనే సెట్టింగ్‌లు వేసి పూజలు చేస్తున్నట్లు నటించడం అలవాటుగా మారిందని మంత్రి పార్థసారధి విమర్శించారు. అబ్దుల్ కలాం వంటి మహానుభావులు 2లో





## అకాల వర్షంతో
# అన్నదాతల కుదేలు

### దెబ్బతిన్న పలు రకాల పంటలు

**భారీగా నష్టపోయామని ఆందోళన**

**రైతులను ఆదుకుంటామన్న మంత్రి అచ్చన్నాయుడు**

అమరావతి : అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతుకూ సాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. అకాల వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే 3-4 రోజులు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతుల్ని అప్రమత్తం చేయాలని అచ్చెన్నాడు చెప్పారు. దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలని అన్నారు. అధికారులు నష్టం వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలని సూచించారు. ఇకపోతే వరుసగా రెండో రోజూ అకాల వర్షాలు కురవడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 2లో


## జాబ్ ఫస్ట్ అనేది
# కూటమి లక్ష్యం

**20లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం**

**ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీ**

**మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్లు**

**ఉగాది ఉత్సవాల్లో సిఎం చంద్రబాబు వెల్లడి**



అమరావతి : ఏటా ఉగాది రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేరుస్తామని అన్నారు. ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీచేసేందుకు ఈసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు. మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలు భర్తీచేస్తామని వివరించారు. ఉగాది పచ్చడి జీవితాలను ప్రతిబింబిస్తుందని, షడ్రుచుల తరహాలో జీవితంలోనూ కష్టసుఖాలు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 నాటికి తెలుగుజాతిని అగ్రస్థానంలో నిలిపేలా సంకల్పం తీసుకుని ముందడుగు వేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. యువతకు ఉద్యోగ కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఇప్పటివరకు 30,607 మందికి ప్రభుత్వోద్యోగాలు ఇచ్చాం. ప్రైవేటురంగంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం' అని సీఎం వివరించారు. జాబ్ ఫస్ట్ అనేది కూటమి ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనికి ఉగాది కానుకగా విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను జత చేశారు. 'శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా వివిధ ప్రభుత్వశాఖల్లో 10,060 ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం. మే 15 నుంచి అక్టోబరు 15 వరకు వీటి నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. ఉద్యోగార్థులు సన్నద్ధత, ప్రతిభతో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరుతున్నాను' అని అందులో పేర్కొన్నారు. 2లో

## వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి
# పెద్దపీట



## రూ.3,24,234 కోట్లతో తెలంగాణ రాష్ట్ర బడ్జెట్

**రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు**

**మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లు**

**ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు**

- 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా
- జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయింపు
- విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయింపు
- వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు
- విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు
- పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు
- పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు
- విద్యా శాఖకు రూ.26,674 కోట్లు
- వైద్య శాఖకు రూ.13,679 కోట్లు
- కార్మిక శాఖకు రూ.998 కోట్లు
- మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు
- ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు,
- ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు
- బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు
- మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు
- ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు
- యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు
- మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు
- ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు,
- రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు

అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశ పెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 తెలంగాణ బ్జడెట్‌లో 'ప్రజా క్షేమం సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌళిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు. రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2లో



## ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే
# ముందుకు

**హరీస్ రావుకు ట్యాపింగ్‌లో ఊరట అబద్ధం**

**పదో తరగతి పరక్షలు లేకుండా 12 తరగతులు**

- తెలంగాణ విద్యారంగంలో కీలక మార్పులకు కసరత్తులు
- కమిటీ అధ్యయనం తరవాత విస్తృతస్థాయిలో ప్రజాభిప్రాయం
- మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం
- రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం అప్పులకు చెల్లించాం
- కెసిఆర్‌ను గృహనిర్బంధం చేసిన క ఎటిఆర్, హరీష్ రావు
- హిల్టు టీడీఆర్ భూ బదలాయింపులపై ఎలాంటి విచారణకైనా సిద్ధం
- డ్రగ్స్‌పై నోరుమెదపని బిజెపి, బిఆర్‌ఎస్ నేతలు
- మీడియతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

2లో

## బడ్జెట్ కేటాయింపులు
# అధ్వాన్నం



**ఆరు గ్యారెంటీలకు సమాధి కట్టారు**

**మహిళల పెన్షన్‌పై మాట్లాడని బడ్జెట్**

**పేదలపట్ల చిత్తశుద్ధి లేని బడ్జెట్ ఇది**

**భట్టి కేటాయింపులపై హరీష్‌రావు పెదవివిరుపు**

**బడ్జెట్ ప్రతులను చించేసిన బిఆర్ఎస్**

**ఆరు గ్యారెంటీలపై సభలో నినాదాలు**

**బడ్జెట్ బహిష్కరిస్తూ వాకౌట్**

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీలో ఇవాళ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా మోసమని ప్రతిపక్ష బీఆర్ ఎస్ పార్టీ మండిపడింది. బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు ప్రతులను చింపిపారేశారు. తెలంగాణ బడ్జెట్‌పై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు పెదవిరిచారు. 2లో



## అంతర్జాతీయ ప్రమాణాలతో విపత్తుల శిక్షణా కేంద్రం

**డిజాస్టర్ మేనేజిమెంట్‌పై మంత్రి పొంగులేటి సమీక్ష**

హైదరాబాద్ :అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శిక్షణా కేంద్రాన్నిఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. 2

## బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు.. ప్రగల్భాలు



**అప్పులకోసం చేసే ప్రయత్నాలే ఎక్కువ**

**బడ్జెట్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు**

హైదరాబాద్ : అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. 2

## ఎరువుల ఉత్పత్తికి ఇంధన పోటు



**ఎరువుల సరఫరాను నిలిపివేయనున్న చైనా**

భారత్ తదితర దేశాలకు రవాణ ఆపే చర్యలు

పలుదేశాల వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం

2

# బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం

ఇదొక ఝూటా బ్జడెట్ అని, బోగస్ బడ్జెట్ అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను, ఆర్టీసీ కార్మికుల సమస్యలను, నిరుద్యోగుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన పింఛన్ పెంపు హామీలను కూడా సర్కార్ మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇందులో సకలజనుల దక్కింది గుండు సున్నా తప్ప ఏమీ లేదని హరీష్‌రావు విమర్శించారు. అంకెలగారడీ, మాటల గారడీ తప్ప ప్రభుత్వానికి పేదలపట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనే విషయం ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు అభయహస్తమని హామీ ఇచ్చారని, ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా రిక్తహస్తమే మిగిల్చారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్ళ కాలేదుగానీ మూడున్నర లక్షల కోట్లు అప్పులు చేసిందని, తెచ్చిన ఆ అప్పుతో ఏం చేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడితే.. కాంగ్రెస్ తన రెండున్నరేళ్ల పాలనలో వెనుకపడేసిందని హరీష్‌రావు విమర్శించారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా భట్టి అంబేద్కర్ సూక్తులు, రాజ్యాంగ విలువలను వల్లెవేశారని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెనుక కూసోబెట్టుకుని రాజ్యాంగ విలువల గురించి ఆయన మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలకు మూడో బడ్జెట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క గోరీ కట్టారని దెప్పిపొడిచారు. ఈ బడ్జెట్‌ను చూస్తే ఎన్నికల హామీలపై కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమైందని అన్నారు. గతం కంటే 20పేజీలు పెంచారు తప్ప.. హామీలకు కేటాయింపులు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారని ధ్వజమెత్తారు. సీఎం ప్రజలకే కాదని.. ఎమ్మెల్యేలకు సైతం అందుబాటులో ఉండటం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 3లక్షల పింఛన్లు కట్ చేసి.. 2లక్షల కొత్త పెన్షన్లు ఇస్తామంటున్నారని అన్నారు. కోటీశ్వరులను సంగతి అటుంచి.. మొదట మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్, ఇందిరమ్మ పేర్లతో అమలవుతోన్న స్కీంలకు సైతం కేటాయింపులు ఎందుకు లేవని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్‌ది.. అభయ హస్తం కాదని.. రిక్త హస్తమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది మూడు ముక్కలాట తప్ప.. విజన్ లేదని దెప్పిపొడిచారు. బడ్జెట్‌లో అన్నివర్గాలకు మొండి చెయ్యి చూపారని ఆగ్రహించారు. మూడున్నర లక్షల కోట్ల అప్పులు తెచ్చి.. రేవంత్ చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో సచివాలయం, కాళేశ్వరం, చెక్ డ్యాంలు కట్టామని ప్రస్తావించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను వెనుక కూర్చోబెట్టుకుని భట్టి.. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహించారు. కాంగ్రెస్ హయాంలో స్కాంలు తప్ప.. స్కీంలు లేవని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో స్కాం జరిగిందని మంత్రి బిడ్డ స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. గురుకుల పిల్లలకు కడుపు నిండా అన్నం పెట్టలేని సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడేమో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంటున్నారని దెప్పిపొడిచారు. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వానిది కట్టుకథలని విమర్శించారు. అక్రమ సంపాదన దాచుకోవడానికే ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టినందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పాలన గాడి తప్పడం వలనే తలసరి ఆదాయం తగ్గిందని విమర్శించారు. పారిశ్రామికవేత్తలకు తుపాకులు పెట్టి మామూళ్లు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి యాదాద్రిని మూసేస్తామంటే.. భట్టి ఏమో యాదాద్రి తెలంగాణకు గర్వకారణమని అంటున్నారని అన్నారు. సింగరేణి గురించి కాంగ్రెస్‌కు మాట్లాడే హక్కు లేదన్నారు. సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారని హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు.. ప్రగల్భాలు

ఆదాయాన్ని పండబెట్టి.. అప్పుల కోసం అర్రులు చాచే బ్జడెట్ ఇది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బండి సంజయ్ కుమార్ స్పందిస్తూ తీవ్రంగా విమర్శించారు.'మోసం.. దగా.. ప్రజా వంచన బ్జడెట్ ఇది' అంటూ వ్యాఖ్యలు చేశారు.మరో రూ.లక్ష కోట్ల అదనపు అప్పు భారం ప్రజలపై మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గు చేటని అన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించడంలో కాంగ్రెస్ హ్యాట్రిక్ కొట్టిందని అన్నారు. కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకేమీ చేయలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రైతు భరోసా నిధులు రెండు విడతలు ఎగ్గొట్టినట్లేనా అని కేంద్రమంత్రి ప్రశ్నించారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారని ఆరోపించారు. 'మహిళలను మళ్లీ వంచించారు... తులం బంగారం తుస్.. రూ.2,500లు నిల్' అని అన్నారు. అవ్వాతాతల నోట్లో మట్టి కొట్టారని.. రూ.4 వేల పెన్షన్ పెంపు గురించి ఊసే లేదని విమర్శించారు. నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని.. బ్జడెట్‌లో నిరుద్యోగ భృతి అంశమే లేదని ఆయన అన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు అంటూ ప్రకటించినా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. ఆరు గ్యారంటీలకు పాడె కట్టే బ్జడెట్ ఇదని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీకి కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ ప్రతిపాదించినా 8 శాతానికే పరిమితం చేశారని బండి సంజయ్ విమర్శించారు. దేవాదాయ శాఖకు గత బ్జడెట్‌లో రూ.190 కోట్లు కేటాయించినా ఈసారి ప్రస్తావనే లేదని అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటి తుడుపు కేటాయింపులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. 56 శాతం బీసీ జనాభాకు కేవలం 4 శాతం మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా బ్జడెట్‌లో అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. మైనారిటీలకు గతేడాది కంటే ఎక్కువ నిధులు కేటాయించడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ఆర్థిక మంత్రి చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో వచ్చిన పెట్టుబడుల వివరాలు వెల్లడించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని.. ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తున్నారని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ చేసిన అప్పుల భాగోతంపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

# జాబ్ ఫస్ట్ అనేది కూటమి లక్ష్యం

మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పంచాగశ్రవణం చేశారు. సంగీత, సాహిత్య, కళారంగాల్లో విశేషకృషి చేసిన 38 మందికి కళారత్న, 112 మందికి ఉగాది పురస్కారాలు సీఎం అందించారు. వ్యవసాయ, ఉద్యాన, తితిదే పంచాంగాలు, సాంస్కృతికశాఖ, శిల్పారామం వార్షిక కార్యక్రమాల క్యాలెండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. 'మన పండగలు, ఆచారాల్లోనే సైన్స్ ఉంది. వాస్తు, సూర్య నమస్కారాలు ఇలాంటివే. యోగా, నేచురోపతి కూడా ప్రకృతి నుంచి వచ్చినవే. విలువలతో జీవనం గడిపేవారికి ఉన్న ఆనందం మరెవరికీ ఉండదు. మనకంటే విదేశాల్లోని ప్రవాసాంధ్రులు మన సంస్కృతీ సంప్రదాయాలు పాటించి బ్రాండ్ అంబాసిడర్లుగా మారారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తికీ ఆర్థిక, సామాజిక, ఆరోగ్యభద్రత అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. దివ్యాంగ శక్తి, స్త్రీశక్తి పథకాలతో దివ్యాంగులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. సంపన్నులైన 10శాతం మంది సమాజంలో అట్టడుగున ఉన్న 20శాతం మందిని ఆదుకునేలా పీ4 కార్యక్రమాన్ని చేపట్టాం. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి జాతికి అంకితమిస్తాం. దీనివల్ల కృష్ణా డెల్టాకు, విశాఖకు గ్రావిటీతో నీళ్లు వెళతాయి. తాగు, సాగునీటికి, పరిశ్రమలకు అవసరమైన నీటిని సరఫరా చేసేలా నీటి యాజమాన్య చర్యలు చేపడుతున్నాం. వేసవికి ముందే రాష్ట్రంలోని జలాశయాల్లో 65శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయి. 2024కు ముందు ఐదేళ్లూ ఎవరూ సంతోషంగా పండగలు చేసుకునే పరిస్థితి లేదు. ఎక్కడ చూసినా భయం, విధ్వంసం, దారుణాలు జరిగాయి. ఇప్పటికీ కుట్రలు చేస్తున్న అలాంటి దుష్టుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

## వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం,

# సామాజిక న్యాయానికి పెద్దపీట

బడ్జెట్ అంటే అంకెల చుట్టూ తరిగడం కాదని, అభివృద్ధి సంఖ్యలను ఆవిష్కరించ డమని భట్టి విక్రమార్క అన్నారు.తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము చేస్తున్న కృషికి బడ్జెట్ తార్కాణమని, గత రెండేళ్ల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు. మొత్తం బడ్జెట్.. రూ.3,24,234 కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లుగా చూపారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే.. 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటాయించారు. బడ్జెట్ లో 5 కీలక రంగాలకు భట్టి ప్రాధాన్యతనిచ్చారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రూ. 23,179 కోట్లు కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కారు విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల పాఠశాలల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు భారీగా నిధులు కేటాయించారు. ప్రజా పాలన – ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారెంటీల అమలుకు అవసర మైన నిధులను పుష్కలంగా కేటాయించారు.. మౌలిక సదుపాయాలకు గాను మూలధన వ్యయం రూ. 47,267 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలనలో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. సామాజిక భద్రత లోబీమా పథకాలను చేర్చారు. ప్రతి పేద కుటుంబానికి ధీమా కల్పించేందుకు 'ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం' కింద రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఈ బడ్జెట్‌లో ఒక కీలక అడుగుగాభావించాలి. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందచేస్తారు. ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం ఇస్తారు. రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన చేపట్టారు.. కేటాయింపులను పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు, విద్యా శాఖకు రూ.26,674 కోట్లు, వైద్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు, మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు, పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు, ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు, బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు, మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు, కల్యాణ లక్ష్మి పథకం.. రూ.3,683 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు, యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీ కి రూ.వెయ్యి కోట్లు, మెట్రో రైలు ఫేజ్–2.. రూ.600 కోట్లు, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ పథకం.. రూ.723 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ.. రూ.1143 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్.. రూ.3500 కోట్లు, మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు, ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటయిస్తున్నట్లు భట్టి ప్రకటించారు.

# ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే ముందుకు

హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ విషయంలో చట్టప్రకారమే ముందుకు వెళ్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో దర్యాప్తు 20 నెలలు ఆలస్యమైందన్నారు. ఇందులో అరెస్టులు తప్పవని కూడా అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ దొరికినా.. భాజపా నేతలు మాట్లాడటం లేదని, బీఆర్ఎస్, భాజపా కలిసి ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమని చెప్పారు. ఇకపోతే పదో తరగతి పరీక్షలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఇకపై పదో తరగతి పరీక్షలు లేనట్లే'నని చెప్పారు. ప్రస్తుతం.. దేశమంతా ప్లస్ 2 విధానం అమల్లో ఉందని ప్రస్తావించారు. తమది వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఫార్ములా ఈ–కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో చట్టప్రకారమే ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము తొందరపడితే టెక్నికల్ రీజన్స్‌తో కోర్టు తిరస్కరించే ప్రమాదముందని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో న్యాయస్థానంలో ఊరట లభించలేదన్నారు. చక్రధర్ గౌడ్.. హరీశ్‌రావుపై పెట్టిన ఫోన్ ట్యాపింగ్, వేధింపుల కేసులో ఆయనకు రిలీఫ్ లభించిందని ప్రస్తావించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో తనను విచారణకు రమ్మని నోటీసులిస్తే హాజరవుతానని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో విచారణ పూర్తి కాకుండా చర్యలు తీసుకోలేమని అన్నారు. కేసీఆర్ బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారని ఆరోపించారు. అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారు. అందుకే ఆయన అసెంబ్లీకి రావడంలేదన్నారు. తెలంగాణ జాతిపిత ఎవరో ప్రజలు డిసైడ్ చేయాలన్నారు. ఏ గ్యారంటీ ఎప్పుడు అమలు చేయాలో తమ దగ్గర ప్రణాళిక ఉందని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. బిఆర్ఎస్ నేతలు చెబితే చేయాలని లేదన్నారు. అందుకే వారు అక్కడ ఉన్నారు..మేము ఇక్కడ ఉన్నామని అన్నారు. కేసీఆర్ హయాంలో అప్పులు, తప్పులు కప్పిపుచ్చి పాలన చేశారని ఎద్దేవా చేశారు. ఆ తప్పులు తాము చేయలేమన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.3.47లక్షల కోట్ల అప్పులు చేశామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులను తీర్చేందుకే తామీ అప్పులు చేయాల్సి వచ్చిందని ప్రస్తావించారు. ఈ 26 నెలల్లో రూ.3.3 లక్షల కోట్లు కేసీఆర్ హయాంలో చేసిన అప్పుల్నే తమ ప్రభుత్వం తీర్చిందని చెప్పుకొచ్చారు. మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం. రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకు చెల్లించాం. మేం తెచ్చిన అప్పుల్లో కేవలం రూ.17వేల కోట్లు మాత్రమే వాడుకున్నాం. జాతీయ జీడీపీ కంటే తెలంగాణ జీఎస్‌డీపీ మెరుగ్గా ఉంది. జీఎస్టీ వసూళ్లు గడిచిన 2 నెలల్లో రూ.4 వేల కోట్లు దాటాయి' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్క ఎకరాకు నీరు ఇవ్వకపోయినా రూ.44 వేల కోట్ల కాళేశ్వరంపై అప్పు తీర్చామన్నారు. హిల్టు టీడీఆర్ భూ బదలాయింపుల పై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఏ విచారణ కోరినా చేపట్టేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇండస్ట్రీకు చెందిన మొత్తం భూములు అమ్మినా లక్ష కోట్ల రూపాయలు రావని ముఖ్యమంత్రి తెలిపారు. హిల్టులో ఐదు లక్షల కోట్ల రూపాయల అవినీతి ఎలా జరిగిందని ప్రశ్నించారు. మంత్రి అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీ కోసం సుప్రీంకోర్టు సూచన మేరకు తెలంగాణ గవర్నర్‌ను సంప్రదిస్తామని తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను తొలగించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని అన్నారు. ఇప్పుడున్న జిల్లాలు మండలాల్లో ప్రస్తుతం ఎలాంటి మార్పులూ ఉండవని ఆయన స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ఇచ్చిన రిపోర్టును కేకే కమిటీకి రిఫర్ చేశామని పేర్కొన్నారు. భూముల అమ్మకానికి కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని సీఎం స్పష్టం చేశారు. భూములు అమ్మితే వచ్చిన డబ్బులను సొంతానికి వాడుకోవడానికి తాము వ్యతిరేకమన్నారు. మూసీ విషయంలో ఆగేది లేదన్నారు. నష్టపోయిన వారిని ఎలా ఆదుకోవాలో ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకుంటామని తెలిపారు. ఢిల్లీకి ఎన్నిసార్లు వెళ్లానో లెక్కపెట్టిన వాళ్లు తాను ఎన్ని నిధులు తెచ్చానో కూడా లెక్కపెట్టాలని హితవు పలికారు. గాంధీ మనుమడు కూడా ఒక పౌరుడేనని.. ప్రస్తుతం ఆయనా బీఆర్ఎస్ ట్రాప్‌లో పడ్డారని అన్నారు. గాంధీ విగ్రహం పెట్టొద్దని అనడం సరికాదని, గాంధీ దేశానికి ఆదర్శపురుషుడని అన్నారు. డ్రగ్స్ అంశంలో ఇంత జరుగుతుంటే.. బీజేపీ నేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలను తిడితే బీజేపీ ఎందుకు మాట్లాడుతోందని నిలదీశారు. ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారని అన్నారు. తనను సీఎంగా అంగీకరిస్తున్న మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. జీవన్ రెడ్డి అంశాన్ని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చూసుకుంటారన్నారు. ఆపరేషన్ కగార్ కేంద్ర ప్రభుత్వానిది.. తమది కాదని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిపై కమిటీ అధ్యయనం చేస్తోందన్నారు. మార్పులపై కమిటీ నివేదికే ఫైనల్ కాదన్నారు. జాతీయస్థాయి అధ్యయనం తర్వాత మార్పులు తీసుకురాబోతున్నట్లు చెప్పారు.

# ఎరువుల ఉత్పత్తికి ఇంధన పోటు

న్యూఢిల్లీ : ముడి చమురు సరఫరాలో అవాంతరాలతో ఇక్కట్ల పాలవుతున్న ప్రపంచదేశాలకు కొత్త సమస్య వచ్చి పడేటట్టు ఉందన్న భయాలు నెలకొన్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రపంచంలోని అతిపెద్ద ఎరువుల ఎగుమతిదారుల్లో ఒకటిగా ఉన్న చైనా యుద్ధ ప్రభావం వల్ల.. జెట్ ఇంధనం, డీజిల్, ఎరువుల ఎగుమతులపై పలు నిబంధనలు విధించడానికి చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది.ఎరువుల ఎగుమతుల్లో ప్రపంచంలో నెం.2గా ఉన్న చైనా వీటి ఎగుమతులపై ఆంక్షలకు సిద్ధమైంది. ఎగుమతుల్లో కోత పెట్టాలని చైనా ఆర్థిక ప్రణాళిక సంస్థ ఎన్‌డీఆర్‌సీ దేశీయ సంస్థలకు సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో జెట్ ఫ్యుయెల్, డీజిల్, కిరోసిన్‌ల ఎగుమతులను తగ్గించాలని గత నెలలో ఎన్‌డీఆర్‌సీ సూచించింది. దేశీయ ఇంధన, ఆహార అవసరాల కోసం చైనా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. చైనా ఎరువులు ఆస్ట్రేలియా, వియత్నాం వంటి దేశాలతో పాటు భారత్‌కూ ఎగుమతి అవుతుంటాయి. కొన్ని దేశాలకు ఎగుమతులను నిలిపివేయాలని తమకు ఆదేశాలు అందాయని షాండాంగ్ ప్రావిన్స్‌లోని ఒక ఫర్టిలైజర్ సంస్థ అధికారి పేర్కొన్నారు. అయితే, ఈ ఆంక్షల విషయమై చైనా ఇంకా అధికారికంగా స్పందించలేదు. ఎగుమతులకు బ్రేకులు తప్పవని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడు తున్నాయి. దేశీయ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు చైనా అన్ని చర్యలు తీసుకుంటుందని అంటున్నాయి. ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ డేటా ప్రకారం, ఎరువుల ఎగుమతుల్లో రష్యా నెం.1 కాగా రెండో స్థానంలో చైనా ఉంది. జెట్ ఫ్యుయెల్ ఎగుమతి చేసే దేశాల్లో చైనా ఆరవ స్థానంలో ఉంది. అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం డేటా ప్రకారం.. జెట్ ఇంధనం, డీజిల్, కిరోసిన్‌ల విదేశీ రవాణాను నిలిపివేయాలని చైనా జాతీయ అభివృద్ధి, సంస్కరణల కమిషన్ అక్కడి పరిశ్రమ వర్గాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి మధ్య నుంచే నైట్రోజన్, పొటాషియం ఎరువుల మిశ్రమాలపై నిబంధనలు విధించింది. ఇప్పటికే యూరియా ఎగుమతిని బ్యాన్ చేసిన బీజింగ్.. అమ్మోనియా సల్ఫేట్ ఎగుమతికి మాత్రం అనుమతినిచ్చింది. ఇంధన, ఆహార నిల్వలు పరిరక్షించుకోవడానికి, దేశీయ మార్కెట్‌ను కాపాడుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అయితే భారత్‌కు ఎరువుల ఎగుమతిని నిలిపివేయాలని చైనాలోని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఓ ఎరువుల తయారీ సంస్థకు ప్రభుత్వ ఆదేశాలు వచ్చినట్లు అక్కడి ఉద్యోగులు వెల్లడించారు. బీజింగ్ నుంచి ఆస్ట్రేలియా, వియత్నాం, భారత్ సహా పలు దేశాలు ప్రస్తుతం ఎరువులను దిగుమతి చేసుకుంటున్నాయి. చైనా నుంచి ఎగుమతులు నిలిచిపోవడం వల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల వ్యవసాయ ఆధారిత దేశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్‌జీ సరఫరా లేకపోవడంతో భారత్‌లోని పలు యూరియా కంపెనీలు ఎ÷–లాంట్లను మూసివేసే పరిస్థితులు నెలకొన్నట్లు ఇటీవల పలు సర్వేలు వెల్లడించాయి.

# : సెట్టింగ్ పూజలు జగన్‌కు అలవాటు

సంప్రదాయాలను గౌరవించి డిక్లరేషన్ ఇచ్చారని.. కానీ జగన్ ఎప్పుడూ ఆ పని చేయలేదన్నారు.ఈ మమేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. 'హిందూ ధర్మాన్ని భక్షించే వారే 'హిందూ ధర్మ రక్ష' అని సాక్షి పత్రికలో ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదం' అని వ్యాఖ్యానించారు. పండుగల సమయంలో ప్రజలందరికీ మేలు జరగాలని కోరుకోకుండా.. కేవలం జగన్ బాగుండాలని మాత్రమే కోరుకోవడమే వైసీపీ నైజమని ఆరోపించారు. గత ఐదేళ్లలో హిందూ సంప్రదాయాలను గౌరవించిన దాఖలాలు లేవని, కల్తీ నెయ్యితో లడ్డూ తయారీ ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీశారని మంత్రి ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తు, యువత ఉపాధి విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో గ్రాడ్యుయేట్ నిరుద్యోగం 24 శాతానికి చేరి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. గత 20 నెలల్లో 6,28,347 ఉద్యోగ అవకాశాలు కల్పించి దేశంలోనే ఏపీ రికార్డు సృష్టించిందని మంత్రి అన్నారు. ప్రతి ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. 2026 ఫిబ్రవరి 28 నుంచి దివ్యాంగులకు సిటీ బస్సులు, పల్లె వెలుగు బస్సుల్లో ఉచితం ప్రయాణం.. ఇతర బస్సుల్లో 50 శాతం రాయితీ అమలు చేస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3,000 నుంచి రూ.6,000కు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా మౌజన్లకు రూ.45 కోట్లు తక్షణమే అకౌంట్లలో విడుదల చేశామని మంత్రి వెల్లడించారు. పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇప్పటివరకు మూడు విడతలుగా 26,149 మందికి రూ.1,943 కోట్లు చెల్లించామని వివరించారు. ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ... అల్లా దయతో అందరి జీవితాల్లో సంతోషాలు వెల్లివిరియాలని మంత్రి పార్థసారథి ఆకాంక్షించారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో విపత్తుల శిక్షణా కేంద్రం

ఇందుకోసం సంబంధిత విభాగాల నుంచి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. దీనిపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలకు విపత్తు నిర్వహణపై ఒకే విధమైన శిక్షణను అందించడం, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రాణ నష్టాన్ని, ఆర్థిక నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించడం, క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా జిల్లాల్లో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం. విపత్తుల నివారణకు సంబంధించి ఇది ఒక అత్యున్నత పరిశోధన మరియు పాలసీ సపోర్ట్ కేంద్రంగా పనిచేస్తుందని అన్నారు. శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో మంత్రి గారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు కేవలం సహాయక చర్యలకే పరిమితం కాకుండా, ముందస్తు సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. విపత్తుల నిర్వహణలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి కచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్ టైమ్ మానిటరింగ్, సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్‌లు, హైస్పీడ్ బోట్లు వంటివాటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దానకిశోర్ , అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమీషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి, స్పెషల్ పోలీస్ బెటాలియన్ అడిషనల్ డిజీ సంజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో అన్నదాతల కుదేలు

పంటలకు నష్టం వాటిల్లిందని అన్నదాతలు కన్నీరుమున్నీరు అవుతున్నారు. గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురిశాయి. గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి, జి.మాడుగులలో వడగళ్లు పడ్డాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గురువారం కురిసిన మోస్తరు వర్షాలకు మొక్కజొన్న, మినుము, పెసర పంటలు మళ్లీ తడిచాయి. తడిచిన కారణంగా కాయలు రాలిపోతాయని, మినుము రంగుమారిపోతుందని, గింజలు రంగు మారిపోతాయని, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. లంక భూముల్లో కోత అనంతరం ఆరబెటట్టిన మిర్చిపంట, ఉడకబెట్టి ఆరబోసిన పసుపు తడిచిపోయాయి. నెల్లూరు జిల్లాలో బుధ, గురువారాల్లో రాత్రిపూట కురిసిన వర్షాలకు కోతకు వచ్చిన వరి పైరు దెబ్బతినగా, మామిడి పూత, పిందెలు నేలరాలాయి. రాపూరు మండలం గోనుపల్లిలో వడగండ్ల వానకు దాదాపు 100 ఎకరాలకుపైగా వరి నేలవాలింది. రాంకూరు, గరిమెనపెంట గ్రామాల్లోని 100 ఎకరాల్లో మామిడి తోటల్లోని పూత, పిందె నేలరాలింది. నిమ్మ తోటల్లో పండ్లు రాలిపోయాయి. అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి, లింగంగుంట, మంగుపలి,?ల కామిరెడ్డిపాడు, అనంతసాగరం గ్రామాల్లో వరి దెబ్బతినగా, గుడిగుంట, గౌరవరం, గుడిగుంట గ్రామాల్లో మిరప, బొప్పాయి, పత్తి మెట్ట పైర్లు దెబ్బతిన్నాయి. కొండాపురం, జలదంకి మండలాల్లో వరి కోతలు పూర్తి చేసిన రైతులు గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం రాశులను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతపురం జిల్లాలో రైతులకు రూ.1.29 కోట్ల పంటనష్టం వాటిల్లినట్టు అంచనావేశారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం ఎర్రోనిపల్లిలో వడగండ్ల వానకు కర్బూజ పంట ధ్వంసమైంది. తిరుపతి జిల్లాలో 1070 ఎకరాల్లో అరటి, వరి, తమలపాకు పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు సుమారు రూ.10.25 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. బాపట్ల జిల్లాలో గురువారం జల్లులు కురవడంతో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చిని కాపాడుకోడానికి రైతులు శ్రమించాల్సి వచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు గ్రామాల్లో గురువారం వడగళ్లు పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పూత, పిందె దశలో ఉన్న మామిడి పంటకు నష్టం వాటిల్లింది. కాపు దశలో ఉన్న జీడిమామిడి సైతందెబ్బతిందని రైతులు చెబుతున్నారు. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో వర్షాలు పడతాయని, గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 23 వరకు కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

# మద్యం కేసులో కీల్ పరిణామం

### అవినాశ్ రెడ్డికి రెగ్యుల్ బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ,మార్చి 20 : ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడైన ముప్పిడి అవినాశ్ రెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. అవినాశ్‌కు సుప్రీం కోర్టు రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. మద్యం కుంభకోణం కేసులో ఏ-7గా ఉన్న అవినాశ్ రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుంది. కోర్టు అనుమతితో జరిగిన ఈ విచారణలో అవినాశ్ కీలక విషయాలు వెల్లడించినట్లు సమాచారం. మద్యం కుంభకోణంలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పాత్ర, అంతిమ లబ్దిదారుడికి సంబంధించిన విషయాలపై అవినాశ్ రెడ్డి వివరాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ స్కామ్‌లో రాజ్ కసిరెడ్డి ప్రధాన నిందితుడిగా ఉండగా, అవినాశ్ రెడ్డి ఆర్థిక నియంత్రణ, లావాదేవీలలో ముఖ్యపాత్ర వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసుకు సంబంధించి విచారణ ఇంకా కొనసాగుతోంది

# చెవిలో పూలు పెట్టిన భట్టి బడ్జెట్

### అన్ని వర్గాలను విస్మరించిన కేటాయింపులు

### బిఆర్ఎస్ ఎమ్మెల్యేల చెవిలో పూలతో విమర్శలు

హైదరాబాద్,మార్చి20 : బడ్జెట్ మొత్తం మోసమని, అన్ని వర్గాల ప్రజల చెవిలో కాంగ్రెస్ ప్రభుత్వం పువ్వులు పెట్టిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. బడ్జెట్ మొత్తంలో ఎక్కడ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే అంశమే లేదన్నారు. ఆరు గ్యారంటీల ఊసే తీయలేదని మండిపడ్డారు. కేవలం కుంభకోణాల కోసమే కాంగ్రెస్ సర్కారోళ్లు ఈ బడ్జెట్ పెట్టుకున్నరని ఆరోపించారు. ఈ మేరకు గంగుల కమలాకర్, వివేకానందలో కలసి చెవిలో పూలతో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై బ్జడెట్‌లో ఎలాంటి అంశం లేదని విమర్శించారు. రైతు భరోసాను ఇచ్చిన మాట ప్రకారం ఈ సారైనా ఎకరానికి రూ.15 వేలకు పెంచుతారని ఆశించామని, కానీ ఊసే తీయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆఖరికి ఆ రూ.12 వేల చొప్పున కూడా ఎప్పుడు ఇస్తారో చెప్పలేదని ధ్వజమెత్తారు. రైతులకు ఏడాదికి రూ.12 వేల అంశం కూడా ఉత్తమాటగానే మిగిలిపోయిందని విమర్శించారు. ఇక మహిళకు నెలకు రూ.2500 ఇస్తామని ఎన్నికల సందర్భంగా రేవంత్‌రెడ్డితోసహా కాంగ్రెస్ నేతలు జోరుగా ప్రచారం చేశారని, కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఆ హామీని నెరవేర్చలేదని జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది ఆడబిడ్డలను దగా చేయడమేనని మండిపడ్డారు. వృద్ధాప్య పించన్‌లు, వికలాంగ పించన్‌ల విషయంలో కూడా ప్రభుత్వం మాటతప్పిందని విమర్శించారు. వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులు రూ.6 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆగ్రహించారు.

# నేడు రంజాన్ పండగ

### సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

హైదరాబాద్,మార్చి 20 :రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగను ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో సంతోషంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా దువా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

# యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

### ఎమ్మెల్యే గిత్త జయసూర్య వెల్లడి

కర్నూలు,మార్చి 20 : యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. ఈ మేరకు పరిశ్రమల స్థాపనలో వేగంగా అడుగులు పడుతున్నాయని అన్నారు. పరిశ్రలకు, పెట్టుబడులకు సానుకూల వాతావరణం ఉందన్నారు. శుక్రవారం నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఉగాది కానుకగా ఉద్యోగ కల్పనకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని యువతకు బంగారు భవిష్యత్ అందించేందుకు జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించింది. శాఖల వారీగా భారీ నోటిఫికేషన్లు, ప్రధానంగా విద్య, పోలీస్ శాఖలకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసింది. నోటిఫికేషన్ విడుదల నుంచి పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, నియామక ప్రక్రియ ముగిసే వరకు ప్రతి దశకూ ఈ క్యాలెండర్‌లో స్పష్టమైన గడువులను ప్రభుత్వం నిర్ణయించింది' అని అన్నారు. అభ్యర్థులు ఎలాంటి గందరగోళం లేకుండా ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే సూచించారు.

## రాష్ట్రంలో ఎల్పిజి సమస్య రాకుండా చూడాలి

అమరావతి,మార్చి 20 : రాష్ట్రంలో ఎల్పీజీ సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్‌జీ, ఈవీ, ఇతర మార్గాలపై దృష్టి పెట్టాలన్నారు. గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినక ముందే అప్రమత్తం కావాలని ఆదేశించారు. ఎల్పీజీ సరఫరాలో విద్యా సంస్థలు, ఆలయాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

# హర్మ్యూజ్ విముక్తికి అమెరికా యత్నాలు

### ఇరాన్ బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం

### యూరోపియన్ దేశాలు సైతం మద్దతు



వాషింగ్టన్/లండన్,మార్చి20 : హర్మ్యూజ్‌పై పట్టుకు అమెరికా యత్నాలు ప్రారంభించింది. ఇరాన్ క్షిపణులను, డ్రోన్లు, బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది. హర్మ్యూజ్ విముక్తికి యూరోపియన్ దేశాలు సైతం మద్దతుగా ముందుకు సాగనున్నాయి. ప్రపంచ చమురు జీవనాడి హర్మ్యూజ్ జలసంధిని తెరిచేందుకు కీలక పోరును అమెరికా మొదలుపెట్టింది. ఇందుకోసం తీర ప్రాంతంలో ఇరాన్ మోహరించిన క్షిపణి లాంచర్లు, డ్రోన్లు, బోట్లు వంటి లక్ష్యాలను ఛేదించేందుకు తక్కువ ఎత్తులో ఎగిరే అపాచీ అటాక్ హెలికాప్టర్లు , తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలను రంగంలోకి దింపినట్లు అమెరికా సైనికాధికారులను ఉటంకిస్తూ కథనంలో వెల్లడించింది. అమెరికా ఛైర్మన్ ఆఫ్ ది జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కెయిన్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది. ఈ జలసంధిలో ఇరాన్ సీమైన్స్, బోట్స్, మిసైల్స్ నుంచి ఎదురయ్యే ప్రమాదాల్ని అరికట్టేందుకు ఈ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ ప్రాంతాన్ని దిగ్బంధిస్తూ ఇరాన్ పరిచిన ఉచ్చులను పూర్తిగా తొలగించడానికి వారానికి పైగా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ జలసంధి మూసివేతతో చమురు ధరలు 119 డాలర్లను తాకిన విషయం తెలిసిందే. భారీ ఆయుధాలతో ఎ-10 యుద్ధ విమానాలకు తోడు అపాచీ అటాక్ హెలికాప్టర్లను కూడా పంపించింది. ఇవి హర్మ్యూజ్ జలసంధిపై అతితక్కువ ఎత్తులో ఎగురుతూ శత్రులక్ష్యాలను మట్టుబెడుతున్నాయి. ఎ-10 యుద్ధ విమానాలు దక్షిణ తీర ప్రాంతాల్లోని ఇరాన్ ఫాస్ట్ అటాక్ క్రాఫ్టలను లక్ష్యంగా చేసుకొన్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో తమ మిత్ర దేశాలు కొన్ని అటాక్ డ్రోన్లను ఎదుర్కోవడానికి అపాచీ హెలికాప్టర్లను రంగంలోకి దించినట్లు జనరల్ డాన్ కెయిన్ వెల్లడించారు. అయితే.. ఆ దేశాల పేర్లు చెప్పేందుకు నిరాకరించారు. వాస్తవానికి కొన్నాళ్ల నుంచే ఎ-10, అపాచీ హెలికాప్టర్లు ఈ పనిచేస్తున్నట్లు చెప్పారు. వీటికి అండగా ఇప్పటికే ఆ ప్రాంతంలో ÷ టైర్ జెట్లు కూడా పనిచేస్తున్నాయి. ఇప్పటివరకు 120 నౌకలను పేల్చేసినట్లు రక్షణ మంత్రి పీట్‌హెగ్సెత్ వెల్లడించిన విషయం తెలిసిందే. అమెరికా ఎ-10 విమానాలను పదాతి దళాలకు క్లోజ్‌ఎయిర్ సపోర్ట్ మిషన్ల కోసం నిర్మించారు. తాజాగా ఇప్పుడు వాటిని నౌకలను ధ్వంసం చేయడానికి వినియోగిస్తున్నారు. దీని ముక్కుపై 30 ఎంఎం గన్ ఉండగా.. రెక్కలపై బాంబులు అమర్చి ఉంటాయి. అమెరికా ఎ-10 విమానాలు జోర్డాన్ కేంద్రంగా ఉన్నాయి. వీటిని గతంలో ఐసిస్‌పై ఆపరేషన్లకు వాడారు. ఇప్పటికే దాదాపు 2,200 మంది అమెరికా మెరైన్ కమాండోలు ఇరాన్ యుద్ధంలో పాల్గొనేందుకు బయల్దేరారు. వీరు ఇరాన్ దక్షిణతీరంలోని ద్వీపాలను స్వాధీనం చేసుకొని హర్మ్యూజ్ జలసంధిపై పట్టు సాధించాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది. ఇదిలావుంటే హోర్ముజ్ జలసంధి రక్షణ ప్రయత్నాల్లో చేరేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అలాగే ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి చర్యలు తీసుకుంటామని ఐరోపా దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్ మరియు కెనడాలు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. గల్ఫ్‌లో నిరాయుధ వాణిజ్య నౌకలపై ఇరాన్ ఇటీవల జరిపిన దాడులను, చమురు మరియు గ్యాస్ సహా పౌర మౌలిక సదుపాయాలపై జరిపిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటన పేర్కొంది. హోర్ముజ్ జలసంధిని మూసివేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. తీవ్రమవుతున్న ఘర్షణ పట్ల మేము తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాము. ఇరాన్ తన బెదిరింపులను, డ్రోన్ మరియు క్షిపణి దాడులను, వాణిజ్య నౌకాయానానికి జలసంధిని అడ్డుకునే ఇతర ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం 2817కు కట్టుబడి ఉండాలని పిలుపునిస్తున్నామని పేర్కొంది. జలసంధి ద్వారా సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించడానికి తగిన ప్రయత్నాలకు సహకరించేందుకు మేము సిద్ధంగా ఉన్నాము. సన్నాహక ప్రణాళికలో నిమగమైన దేశాల నిబద్ధతను మేము స్వాగతిస్తున్నామని ప్రకటన పేర్కొంది. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను సమన్వయంతో విడుదల చేయడానికి అధికారం కల్పించిన అంతర్జాతీయ ఇంధన సంస్థ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాము. ఉత్పత్తిని పెంచడానికి కొన్ని ఉత్పాదక దేశాలతో కలిసి పనిచేయడంతో సహా, ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి ఇతర చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

# భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

### మూడు దశల్లో దేవస్తానం అభివృద్ధి పనులు

### మాస్టర్ ప్లాన్‌పై చర్చించిన మంత్రులు

హైదరాబాద్,మార్చి 20 : తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థాన అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, వాకాటి శ్రీహరి అన్నారు. భద్రాద్రిని ఒక అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందని వెల్లడించారు. భద్రాచలం ఆలయ రూపురేఖలను మార్చేలా రూపొందించిన మాస్టర్ ప్లాన్ పై శుక్రవారం నాడు సచివాలయంలోని మంత్రి కొండా సురేఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రెండు వందల సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని ఆగమ శాస్త్రం ప్రకారం భక్తుల మనోభావాలకు అనుగుణంగా మూడు దశల్లో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపైముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత మాస్టర్ ప్లాన్‌కు తుదిరూపునివ్వాలని సమావేశంలో నిర్ణయించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యేనాటికి భద్రాచలంలో పుష్కర ఘాట్‌తో పాటు మొదటి దశ ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలాన్ని తెలంగాణలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక హబ్‌గా మారుస్తామన్నారు. భద్రాచలం సమీపంలోని రామవరంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గోదావరి పుష్కరాలలో భాగంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన కొరివి వీరభద్రస్వామి దేవాలయం, మల్లూరు లోని నరసింహాస్వామి దేవాలయాలను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. సమావేశంలో పార్లమెంట్ సభ్యులు బలరాం నాయిక్,ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్పీజిని ప్రజలకు అందుబాటులో ఉంచాలి

### అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్మడానికి వీల్లేదు

### ఎపి హైకోర్టు కీలక ఆదేశాలు

అమరావతి,మార్చి 20 : పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా దేశవ్యాప్తంగా వంట గ్యాస్ కొరత ఏర్పడిన నేపథ్యంలో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చమురు శుద్ధి సంస్థలు ఎల్పీజీని అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు కాన్ఫిడెన్స్ పెట్రోలియం ఇండియా లిమిటెడ్‌కు ఆదేశాలు జారీ చేసింది. దేశంలో ఎల్పీజీ కొరత ఉన్న సమయంలో చమురు శుద్ధి సంస్థలు అంతర్జాతీయ మార్కెట్లో విక్రయాలకు పాల్పడితే.. అది సామాన్య ప్రజలకు తీరని నష్టంతో పాటు కష్టాలను కలిగిస్తుందని కోర్టు స్పష్టం చేసింది. వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరా చేసేందుకు వీలుగా గ్యాస్ను పంపిణీదారులకు మాత్రమే సరఫరా చేయాలని ఆదేశించింది. దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలు ప్రొపేన్, బ్యూటేన్ నిల్వలను గరిష్ఠంగా ఎల్పీజీ ఉత్పత్తి కోసం ఉపయోగించడంతో పాటు ఉత్పత్తి చేసిన ఎల్పీజీని ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీఎల్, హెచ్పీసీఎల్, బీపీసీఎల్లకు అందుబాటులో ఉంచి.. దానిని కేవలం దేశీయ వినియోగదారులకు మాత్రమే సరఫరా చేయాలంటూ ఈ నెల 5న జారీ చేసిన స్వీయ ఉత్తర్వుల కఠిన అమలుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంలో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ, కాన్ఫిడెన్స్ పెట్రోలియం ఇండియా లిమిటెడ్లను ఆదేశించింది. ఇందులో భాగంగా వారికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 2కు వాయిదా వేసింది.

# ఆరు గ్యారెంటీలపై నిలదీస్తూనే ఉంటాం

### గన్ పార్క్ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

### ప్లకార్డులతో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శన

హైదరాబాద్,మార్చి 20 : ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గన్‌పార్క్ నుంచి అసెంబ్లీకి ర్యాలీకి బయల్దేరి వచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యమని గ్యారంటీ కార్డులు ఇచ్చి భద్రం చేసుకోమన్నారని గుర్తుచేశారు. ఇంతవరకు ఒక్క గ్యారంటీని నెరవేర్చిందని లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల తరఫున వృద్ధులు, వితంతువుల తరఫున బడ్జెట్ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. రూ.2500 మహాలక్ష్మి నిధులు ఎప్పుడిస్తారని నిలదీస్తామని తెలిపారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు నీటిమూటలయ్యాయని విమర్శించారు. బడ్జెట్‌లో రైతులకు, బీసీలకు జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. సంక్రాంతి, ఉగాది గడిచినా రైతు భరోసా పడలేదని అన్నారు. ఉద్యోగాలపై బొంకుతున్న కాంగ్రెస్‌ను అసెంబ్లీలో నిలదీస్తామని తెలిపారు. హామీలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. చట్టసభల్లో చర్చ అంటేనే ప్రభుత్వం లాగు తడుస్తోందని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనచారి ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు అసెంబ్లీలో జవాబు ఇవ్వని పరిస్థితి ఉందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండటం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలను బుల్డోజ్ చేస్తుందని మధుసూదనచారి మండిపడ్డారు. ప్రతిపక్షాలు అడిగిన ఏ ఒక్కదానికీ జవాబివ్వని పరిస్థితి ఉందని విమర్శించారు.

# ఆరు గ్యారెంటీలకు మంగళం పాడిన బడ్జెట్

### అంకెల గారడీతో బురిడీ కొట్టిచారు

### మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్,మార్చి 20 : తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ప్రజలను మోసం చేసేదిగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. బడ్జెట్‌తో తో ప్రజలకు ఒరిగేది శూన్యమని పేర్కొన్నారు. మహిళలు,పేద ప్రజలను, నిరుద్యోగులను వంచించిన బ్జడెట్ అని ఆరోపించారు. ఆరు గ్యారంటీలకు మంగళం పాడిన బడ్జెట్ అని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే స్కీమ్‌లకు సరైన కేటాయింపులు లేవని, అవినీతి అవకాశాలు ఉన్న ప్రాజెక్టులకు భారీ నిధులు కేటాయించారని వెల్లడించారు.గత సంవత్సరం బడ్జెట్ అంచనాలను ఈ ప్రభుత్వం అందుకోలేక పూర్తిగా విఫలమైందని ఇప్పటికే స్పష్టమైందని అన్నారు. అయినా కూడా మళ్లీ అదే విధంగా అంకెల మాయాజాలంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. కోటి 58 లక్షల మహిళలకు ఇస్తానన్న రూ. 2,500 చేయూత పథకం ప్రస్తావనే లేదు. వృద్దులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంపు కేటాయింపులు లేవు.తులం బంగారం హామీ పూర్తిగా మర్చిపోయారు.జాబ్ క్యాలెండర్‌ను పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. రైతు భరోసా పేరుతో హామీలు ఇచ్చినా, ఇప్పటివరకు మూడు పంటలకు ఎగ్గొట్టారని,ఆచరణ కు సాధ్యం కానీ రాజీవ్ యువవికాసానికి మాత్రం బ్జడెట్ లో ప్రతి సారి కేటాయింపులు చేస్తూ వస్తున్నారని ఆరోపించారు.ఈ ప్రభుత్వానికి భూములపై ఉన్న ప్రేమ, ప్రజలకు ఇచ్చిన హామీలపై లేదని తెలిపారు.

# ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో స్కాంలు

### వేయికోట్ల కుంభంకోణం జరిగింది

### రిటైర్డ్ అధికారుల నియామకంతో లాలూచీ

### స్కాం వివరాలను అసెంబ్లీలో ఎండగతాం

హైదరాబాద్,మార్చి 20 : ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో స్కాంలు కొనసాగుతున్నాయని బిఆర్ఎస్ ఎ మ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగులను పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి స్కాంలు చేస్తున్నాడని అన్నారు. అందులో సీఈ, ఈఎన్‌సీ అందరూ రిటైర్డ్ వాళ్లే ఉన్నారని తెలిపారు. నాలుగైదు స్కూళ్లను ప్యాకేజీ చేసి అన్యాయాలకు తెర తీశారని హరీశ్‌రావు మండిపడ్డారు. వీటి టెండర్లలో రూ.1000 కోట్ల స్కాం జరిగిందని అన్నారు. ఇందులో బీజేపీ వారికి ఒకటి, రెండు ప్యాకేజీలు దక్కాయని తెలిపారు. సమయం వచ్చినప్పుడు ఆ వివరాలన్నీ బయటపెడతామని స్పష్టం చేశారు. ఈ వందల కోట్ల టెండర్ల కుంభకోణంపై శాసనసభలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని అన్నారు. నా దగ్గర ఈ స్కామ్ కు సంబంధించి ఇంకా పూర్తి ఆధారాలు, వివరాలు ఉన్నాయని.. వాటన్నింటినీ అసెంబ్లీ సమావేశాల్లో సభ సాక్షిగా బయటపెడతానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 76 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు పూర్తి చేయగా, అందులో ఒక్కటంటే ఒక్కటి కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న 26 నియోజకవర్గాలకు ఇవ్వలేదని హరీశ్‌రావు తెలిపారు. కక్షపూరితంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్కూళ్లు మంజూరు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు, అలాగే కొందరు బీజేపీ ఎమ్మెల్యేలకు మాత్రం స్కూళ్లు కేటాయించారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో భారీ అవినీతి జరుగుతోందని హరీశ్‌రావు అన్నారు. కాంట్రాక్టర్లు ఆర్గనైజ్డ్ రింగ్ గా అయ్యి పనులను పంచుకుంటున్నారని అన్నారు. 76 స్కూళ్లకు సంబంధించిన ప్రతి టెండర్ కి ఎక్సెస్ ధర కోట్ చేసి దక్కించుకున్నారని తెలిపారు. టెండర్లలో కనిష్టంగా 4.59? నుంచి గరిష్టంగా 4.96? ఎక్సెస్‌తో, నిబంధనల ప్రకారం 5? దాటకుండా పక్కా ఎ÷-లాన్‌తో కొల్లగొట్టారని విమర్శించారు. ఒక్కో స్కూలుకు రూ. 250 కోట్లు కేటాయించగా, అందులో సివిల్ వర్క్స్ కోసమే సుమారు రూ. 150 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారని చెప్పారు. 76 స్కూళ్లకు సంబంధించి ప్రభుత్వ అంచనా వ్యయం రూ. 10,199.54 కోట్లు కాగా, కాంట్రాక్టర్లు దాన్ని రూ. 10,693.55 కోట్ల ఎక్సెస్‌తో దక్కించుకున్నారని అన్నారు. అంటే కేవలం ఈ టెండర్ల ద్వారా సుమారు రూ. 494 కోట్లు ప్రజాధనాన్ని అదనంగా దోచిపెడుతున్నారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ తో పాటు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరల్లో అత్యధికంగా 4.95 శాతం ఎక్సెస్ ధరకు టెండర్లు కేటాయించడం పలు అనుమానాలకు కలిగిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నియోజకవర్గంలో 4.95 ఎక్సెస్.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గం హుజూర్ నగర్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గం హుస్నాబాద్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని.. మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గం కొల్లాపూర్ లో 4.77 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని చెప్పారు. మంత్రి కొండా సురేఖ నియోజకవర్గం వరంగల్ ఈస్ట్ లో 4.99 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారన్నారు. మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గం నల్గొండలో 4.87 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారన్నారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియోజకవర్గం మంథనిలో 4.89 కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారని తెలిపారు. ఆశ్చర్యకరంగా ముఖ్యమంత్రి నియోజకవర్గంతో పాటు ఏకంగా 9 స్కూళ్ల టెండర్లను ఈ ప్రభుత్వం అదే సంస్థకు కట్టబెట్టిందని పేర్కొన్నారు. మంత్రుల నియోజకవర్గాల్లోనే ఎక్కువ ధరకు టెండర్లు ఖరారు కావడం ఈ కుంభకోణానికి నిదర్శనమని చెప్పారు. నాడు కేసీఆర్ పదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఏనాడూ రాజకీయ పక్షపాతం చూపలేదని గుర్తుచేశారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు సమానంగా ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. మిషన్ కాకతీయ మొదటి దశ నుంచే, మిషన్ భగీరథ, బీసీ,మైనార్టీ గురుకులాలు ఇలా ఏ పథకమైనా 119 నియోజకవర్గాలకు సమానంగా ఇచ్చారని అన్నారు మెడికల్ కాలేజీలను అన్ని జిల్లాలకు ఇస్తూ, నేటి కాంగ్రెస్ మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గానికి కూడా ఇచ్చామని తెలిపారు దళిత బంధు లాంటి గొప్ప పథకాన్ని ప్రతిపక్ష నేతగా ఉన్న భట్టి విక్రమార్క నియోజకవర్గమైన మధిర చింతకాని నుంచే పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఘనత కేసీఆది అని హరీశ్‌రావు కొనియాడారు.

# సంపాదకీయం

## అభిశంసనతో సాధించేదేమిటి ?

సర్ ప్రక్రియలతో అనేక రాష్ట్రాల్లో లక్షల ఓట్లు తొలగించారు. అయితే తొలగించిన ఓట్లకు సంబంధించి ఎక్కడా పెద్దగా ఫిర్యాదులు అందలేదు. దీంతో ఇప్పుడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆయా పార్టీలు తిరిగి అధికారం పొందుతాయా అన్న సందేహంలో ఉన్నాయి. ప్రధానంగా బెంగాల్లో మమతా బెనర్జీకి అధికార భయం పట్టుకుంది. సర్‌తో బెంగాల్లో 60 లక్షలకు పైగా ఓట్లు తొలగించారని తెలుస్తోంది. సర్ ప్రక్రియ ముగిసిన తరవాత వివిధ రాష్ట్రాలకు ఎన్నికల నగారా మోగింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దఫాల్లోనూ, మిగిలిన చోట్ల ఏప్రిల్ 9న ఒకే దఫాతో ఎన్నికలు ముగుస్తాయి. ఐదు అసెంబ్లీ పరిధిలో 824 స్థానాలకు జరగనున్న ఈ ఎన్నికల్లో ఎస్‌ఐఆర్ పక్రియతో సుమారు కోటీ 40 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. అయితే ఏ రాష్ట్రంలోనూ ప ఎద్దగా వ్యతిరేకత రాలేదు. వ్యతిరేకత కేవలం మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారి నుంచి వచ్చాయి. తాము ఓట్లు కోల్పోయామని పదుల సంఖ్యలో కూడా ఎవ్వరూ ముందుకు రాకపోవడం గమనించాలి. అయితే ఓటు నమోదులో ఇప్పటికీ శాస్త్రీయ పద్దతిని అవలంబించడం లేదు. పక్కాగా ఓటరు కార్డు దక్కడం లేదు. ఓటు నమోదు మొదలు, ఓటు తొలగింపు వరకు అంతా గందరగోళంగా సాగుతోంది. ఈ క్రమంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారు. ఎన్నికల కమిషన్ ఓ రాజ్యాంగ ప్రతిపత్తి గలిగిన సంస్థ. దాని పని అది చేసుకుంటూ పోతున్నది. ఎవరు అధికారంలో ఉన్నా, ఎన్నికల కమిషన్ పనిచేస్తూనే ఉంది. కానీ విపక్ష కాంగ్రెస్, తదితర పార్టీలకు ఇది మింగుడు పడడం లేదు. అందుకు జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన నోటీసులు ఇచ్చారు. ఇది కేవలం రాజ్యాంగ సంస్థ నిజాయితీని నిలదీయడం తప్ప మరోటి కాదు. ఇప్పటికే స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం ప్రవేశ పెట్టిన కాంగ్రెస్ తదితర పక్షాలు తలబొప్పి కట్టించుకున్నాయి. ఇకపోతే రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 17.4 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల పరిశీలన సర్ పేరుతో తొలగించండతో తట్టుకోలేక పోతున్న ఓట్లను ప్రతిపక్షాలు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను నిలదీసే లక్ష్యంతో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. బెంగాల్, అసోం లాంటి రాష్ట్రాల్లో పక్కనే ఉన్న బంగ్లా జాతీయ ఓట్లను తొలగించే ప్రక్రియ జరగింది. అక్రమంగా ఇక్కడ తిష్టవేసి ఓటర్లుగా మారారు. వారే రాష్ట్రాల్లో ఎవరు అధికారంలో ఉండాలో నిర్ణయించే దశకు చేరుకున్నారు. మరో వైపు ఒక్క చట్టబద్ధమైన ఓటరు కూడా తన ఓటు హక్కు కోల్పోకుండా చూశామని సిఇసి జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. ఒక్క అనర్హుడు కూడా ఓటు వేసే అవకాశం లేకుండా చూడటమే తన లక్ష్యమని చెప్పారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన అప్పిలేట్ ట్రిబ్యునళ్లు రోజుకు లక్ష వరకూ ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాయి. నోటిఫికేషన్ రాగానే బెంగాల్ సిఎస్, డిజిపి, హోం శాఖ కార్యదర్శి, కొల్‌కతా సిపిలను ఇసి బదిలీ చేయడం ద్వారా మమతకు వత్తాసుగా ఉన్న వారిని తొలగించింది. పశ్చిమ బెంగాల్‌లో పగ్గాలు చేజిక్కించుకోవాలని, కేరళం, తమిళనాడులోనూ అధికారం నిలబెట్టుకునేందుకు ఆయా పార్టీలు చేస్తున్న ప్రయత్నాలకు నిజంగానే సర్ విఘాతం కలిగించి ఉంటుంది. ఓ వైపు మత విద్వేషాలు, హింసను రెచ్చగొట్టడం ద్వారా కుల, మత విభజనను తీసుకురావడం ద్వారా మరోమారు అధికారంలో కొనసాగాలని మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారు ఎత్తులు వేస్తున్నారు. అందుకే మమతా బెనర్జీ ఏకంగా 50శాతం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు నిరాకరించింది. తమిళనాడులో డిఎంకె నేతృత్వంలోని ప్రభుత్వం రెండోసారి అధికారాన్ని నిలబెట్టు కునేందుకు ప్రజాతీర్పును కోరుతోంది. పదేళ్ల పాలనలో అభివృద్ధి చెందిన దేశాల జీవన ప్రమాణాలతో పోటీ పడేలా కేరళను తీర్చిదిద్ది, తీవ్ర పేదరికాన్ని తరిమేసి, ఎన్నో ఉద్యోగావకాశాలు కల్పించినట్టు పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ చెప్పుకుంటోంది. ప్రజానుకూల పాలనకు, ప్రజలపై ఉన్న నమ్మకానికి ప్రతీకగా మరోమారు విజయం సాధిస్తామని చెబుతోంది. అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య యుతంగా జరగాలని కోరుకుంటున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. అయితే జ్ఞానేష్ కుమార్‌ను అభిశంసించడం అంత సులువు కాదు. అధికార ఎన్‌డిఎ పూర్తి మద్దతుతో ఉండడంతో ఈ ప్రయత్నం ఎరవేరక పోవచ్చు. అలాగే సర్ ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా బీహార్‌లో కాంగ్రెస్ తలబొప్పి కట్టించుకుంది. మమతా బెనర్జీ కూడా సుప్రీంలో చివాట్లు తింది. ఇవన్నీ మరచి వీరు చేసే ప్రయత్నాలతో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే పని తప్ప మరోటి కాదని గుర్తించాలి. అలాగే అధికారంలో ఉంటూ మమతా బెనర్జీ లాంటి వారు రాజ్యాంగ విరుద్ద చర్యలకు పాల్పడడం క్షమించరాని నేరంగా పరిగణించాలి.

# ఉచితాలు అవసరమా, అనివార్యమా?



ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రభుత్వాలు బాధ్యతారాహిత్యంగా ఉచితాలు ప్రకటించడంపట్ల దేశ అత్యున్నత న్యాయస్థానం ఇటీవల రాష్ట్రాలను తీవ్రంగా హెచ్చరించింది. అటువంటి నిర్ణయాలు ప్రకటించే సమయాన్ని, ఆర్థిక తర్కాన్ని ప్రశ్నించింది. అవసరమైనవన్నీ ఉచితంగా ఇచ్చుకుంటూ పోతే ప్రజలు ఎందుకు పనిచేయాలి? అన్ని ఉచితంగా వస్తుంటే వాళ్ళు పనిచేయడం ఎక్కడి నుంచి నేర్చుకుంటారు? ఎన్నాళ్లీ ఉచితాల అమలు? ఇదేనా మనం చేసే జాతి నిర్మాణం? రాష్ట్ర ప్రభుత్వాలన్నీ దాదాపుగా రెవెన్యూ లోటు లోనే ఉన్నా, ఈ పథకాల అమలుకు డబ్బు ఎక్కడి నుంచి తెస్తున్నాయంటూ సుప్రీం ధర్మాసనం తమిళనాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేంద్రం కొత్తగా ప్రతిపాదించిన విద్యుత్ సవరణ నిబంధనలు 2024 లోని రూల్ 23ను సవాలు చేస్తూ తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి సంబంధించిన ఈ కేసులో సుప్రీం కోర్టు దాదాపుగా దేశంలోని అన్ని రాష్ట్రాలను హెచ్చరించినట్లేనని స్పష్టం అవుతుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఈ కేసును ఉద్ఘాటిస్తూ.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం మంచిదే. కానీ దానికి మూల్యం ఎవరు చెల్లించాలి? ఈ పథకాల అమలు కోసం ప్రభుత్వానికి డబ్బు ఎక్కడి నుండి వస్తుంది. అదంతా పన్ను చెల్లింపుదారులదే కదా? అంటూ అన్ని రాష్ట్రాలకు చురకలంటిచ్చినట్లు చీఫ్ జస్టిస్ వ్యాఖ్యలు ఉన్నాయి. ప్రస్తుతం రాజకీయ పార్టీల మేనిఫెస్టోపై చర్చ అనవసరం. సంక్షేమం, ఉచితాలు రెండు విభిన్న దృక్పథాలు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం ప్రభుత్వాల బాధ్యత. కానీ, రాజకీయ పార్టీలు సంక్షేమం ముసుగులో ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని ప్రజలను ప్రసన్నం చేసుకోవడానికి ఉచితాలు ప్రకటిస్తున్నాయి. అధికారమే లక్ష్యంగా అందలం ఎక్కేందుకు తొలుత తమ తలతాకట్టు పెట్టైనా హామీలను మీ గడపలకు చేరుస్తామని ప్రగల్భాలు పలికి అనంతరం ఆశతో అధికారమిచ్చిన ప్రజల తలపైనే చేతులు పెడుతున్న తీరును నేటి ప్రభుత్వాల్లో గమనిస్తున్నాం. ఒక నిర్దిష్టమైన ఆర్థిక విధానం అంటూ లేకుండా, అయితే అప్పులు చేస్తూ, లేకపోతే ధరలు పెంచుతూ ప్రజలను నయవంచనకు గురి చేస్తున్నాయి. మరిన్ని కనుగొనండి విద్యా రుణ సేవలు రాష్ట్ర వార్తలు లైఫ్ స్టైల్‌ాశ్రీంశీ =ముస - బిజెపికి సవాల్‌గా బెంగాల్ ఎన్నికలు ఉచితాల అంశాన్ని తెర మీదికి రావడానికి కారణమైన తమిళనాడు రాష్ట్రంలో ఇటీవల 100 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని యోచిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సవరణ నిబంధనలు- 2024 లోని నిబంధన 23 మేరకు ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో తమిళనాడు విద్యుత్ పంపిణీ కార్పొరేషన్ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో సుప్రీం కోర్టు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రస్తావిస్తూ.. నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని, ఈ భారం ప్రభుత్వం స్వీకరించడం ఎంత వరకు ప్రజా ప్రయోజనం, విద్యుత్ బిల్లు చెల్లించే శక్తి ఉన్నవారికి, లేనివారికి మధ్య ప్రామాణికం ఏంటి? సంక్షేమ రాజ్యంగా అణగారిన వర్గాలు, అవసరమైన వారికి సాయం చేయడాన్ని ఎవరైనా అంగీకరించాల్సిందే. దాన్ని సమాజం కూడా అదే రీతిలో స్వాగతించాలి. కానీ కొందరు వ్యక్తులు అన్ని ఉండి కూడా తమ పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వం అమలుచేసే పథకాలు, ఉచితాలు తమ జేబుకే చేరాలనుకునేవారు సమాజంలో అనేక మంది ఉండడమే ఆందోళన కలిగించే విషయం. తెలంగాణ రాష్ట్రంలో కూడా 200 వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నరు. రాష్ట్రంలోని కొన్ని లక్షల కుటుంబాలకు ఉపశమనం కలిగించే విషయమే. ప్రభుత్వం బాధ్యతగా భరోసాను కల్పించే పథకమే ప్రవేశపెట్టింది. కానీ ఏ స్థాయిలో ఈ పథకం ఉపయోగపడుతుందో అదే స్థాయిలో బిల్లు కట్టే స్తోమత ఉన్నవారికి కూడా అందించడం అసలు పథకం సార్థకతను ప్రశ్నించే విధంగా ఉందన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని సుప్రీం కోర్టు స్పష్టం చేస్తోంది. వాస్తవానికి ఉచిత పథకాలు సమాజానికి ప్రమాదమే. ఎప్పుడు ప్రమాదం అంటే అన్నీ ఉన్నవారికి కూడా ఇచ్చినప్పుడు, కడుపునిండా తినే స్తోమత ఉన్నవాడికి ఇచ్చినప్పుడు, ఈ ఉచితాలు తప్పక నిరుపయోగమే. కానీ బొక్కలుతేలి ఆకలిని అలవాటుగా మార్చుకుని తన దైనందిన జీవితాన్ని తప్పక కొనసాగిస్తున్న పేదవానికి ఉచితం అందితే అది తప్పక అమృతం అవుతుందే కానీ విషం కాదు. మన తెలంగాణ రైతాంగం అంటేనే రాష్ట్రం ఏర్పడే నాటికి ఒక రకమైన అభిప్రాయం అప్పుల ఊబిలు, ఉరికొయ్యలు, పురుగుల మందు డబ్బాలు, - బీడు భూములు, కరెంటు కోతలు, అడుగంటిన బోరుబావులు ఇది ఒక్క మాటలో చెప్పాలంటే మన రైతుల సమగ్ర స్వరూపం. ఏదిఏమైనా రాష్ట్రం ఏర్పడ్డాక పెట్టుబడికి రైతుబంధు డబ్బులు మాత్రం ఒక గొప్ప ధీమాను కల్పించాయని చెప్పడానికి ఒక్కటా రెండా అనేక జీవితాలు నిలువెత్తు నిదర్శనంగా నిలబడి ఉన్నాయి. ఈ పథకం సైతం అమలు విషయంలో దుర్వినియోగం అయింది. ఇప్పటివరకు రైతులకు నష్టం కంటే లాభం ఎక్కువగా చేసిన పథకం ఏదైనా ఉంది అంటే అది ఇదే. రాష్ట్రంలో లక్షలాది మంది వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఆసరా పింఛన్ల పథకంతో ప్రతి నెల ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చకపోయినా ఆయా వర్గాలను ఆత్మవిశ్వాసంతో బతకడానికి అవసరమైన ధీమాను ఈ పథకం కల్పించింది. రాజ్యం ఇదొక మానవీయ పథకంగా భావించాలే తప్ప ఉచితంగా పరిగణించవద్దు. పెద్దపెద్ద పారిశ్రామిక కుటుంబాలకు వేలకోట్ల రూపాయల రుణాలను రైట్ ఆఫ్ చేసిన దేశ పాలకులు సైతం ఉచిత పథకాలను విమర్శిస్తున్నారు. తమకు అందని ఉచిత పథకం ఏదైనా వృథానే అనిపించడం మామూలే. అతి ఎప్పుడైనా కొంపకు చేటే అన్నట్లు అనవసరమైన ఉచితం వ్యవస్థ ఉనికికే ముప్పు. ఈ సందర్భంగా మనందరం గుండెల మీద చేయి వేసుకుని ఆలోచించాల్సిన ఒక విషయం ఏంటంటే ఉచిత హామీల అమలు కోసం ఎంత మొత్తంలో ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. అందుకు నిధుల సమీకరణ ఎలా జరుగుతుంది అన్న ప్రశ్నలు సంధించుకుని మనకు మనమే సమాధానం చెప్పుకుంటే తప్ప మనకు మనం తెలుసుకోలేం. అర్థం కాదు కూడా ఈ ఉచితాల ముసుగు. సుప్రీం తీర్పు నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని, ఉచితాలతో ప్రజలను భ్రమల్లోకి నెట్టకుండా, వారి జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకువచ్చే దిశగా ప్రణాళికలు రూపొందించాలి.

## మధ్యప్రాచ్యంలో తగ్గని ఉద్రిక్తతలు

### అమెరికా ,ఇజ్రాయిల్‌లకు మద్దతు ఇస్తే దాడులు తప్పవు

### గల్ఫ్ దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు

టెహ్రాన్,మార్చి20 : మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరిన తరుణంలో, ఇరాన్ తన పొరుగు దేశాలకు కీలక విజ్ఞప్తి చేస్తూనే పరోక్ష హెచ్చరికలు జారీ చేసింది. తమపై దాడులు చేయడానికి అమెరికాకు, ఇజ్రాయెల్‌కు తమ భూభాగాలను లేదా సైనిక స్థావరాలను ఉపయోగించుకోనివ్వవద్దని పశ్చిమాసియా దేశాలను ఇరాన్ కోరింది. ప్రస్తుత సంక్షోభానికి ప్రాంతీయ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలే ముఖ్య కారణమని ఇరాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ స్థావరాల నుంచే తమపై దాడులు జరుగుతున్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాల ప్రకారం.. ఏ దేశం కూడా తన భూభాగాన్ని వేరొక దేశంపై దాడి చేయడానికి మూడవ పక్షానికి ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇవ్వకూడదని ఇరాన్ గుర్తు చేసింది. అమెరికా దాడులకు సహకరించే లేదా సౌకర్యాలు కల్పించే దేశాలను కూడా దురాక్రమణలో భాగస్వాములుగానే పరిగణిస్తామని, అటువంటి స్థావరాలు తమకు 'లక్ష్యాలు' అవుతాయని ఇరాన్ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయ్ హెచ్చరించారు. తమ సార్వభౌమాధికారంపై దాడులు జరిగితే, అంతర్జాతీయ చట్టాల ప్రకారం తమను తాము రక్షించుకునే హక్కు తమకు ఉందని ఇరాన్ స్పష్టం చేసింది. సౌదీ అరేబియా వంటి దేశాలు చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని, ఈ ప్రాంతంలో అస్థిరతకు అమెరికా, జియోనిస్ట్ (ఇజ్రాయెల్) శక్తులే కారణమని ఇరాన్ విమర్శించింది.

## మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యం

### డాలర్‌తో రూపాయి మారకం 93.15 కు చేరిక

న్యూఢిల్లీ : మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ శుక్రవారం ట్రేడింగ్ ఆరంభంలో రికార్డు స్థాయిలో పతనమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తొలిసారిగా 93.15 వద్దకు చేరింది. గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చడం రూపాయి మారకం విలువపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ఇక బ్రెంట్ క్రూడ్ ధర ప్రస్తుతం బ్యారెల్ 100 డాలర్లకు పైనే కొనసాగుతోంది. ముడి చమురు సరఫరాలో అంతరాయాలు సుదీర్ఘకాలంపాటు కొనసాగుతాయన్న భయాలు బ్రెంట్ క్రూడ్ ధరలు పైకి ఎగబాకేలా చేస్తున్నాయి. చమురు ధరలు పెరిగే కొద్దీ డాలర్‌కు డిమాండ్‌కు పెరిగి రూపాయి విలువపై ప్రతికూల ప్రభావం పడుతోందని నిపుణులు చెబుతున్నారు. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు స్టాక్ మార్కెట్‌పైనా తీవ్ర ప్రభావం చూపించాయి. గురువారం గ్లోబల్ మార్కెట్స్‌లో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడటంతో సూచీలు కుప్పకూలాయి. డాలర్‌పై పెట్టుబడులు పెరగడంతో అమెరికన్ కరెన్సీ మరింత బలపడింది. ఫలితంగా రూపాయి సహా అనేక వర్ధమాన దేశాల కరెన్సీలపై ప్రతికూల ప్రభావం పడిందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. వ్యవస్థాగత మదుపర్లు కూడా భారత్ నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడంతో రూపాయి విలువపై ఒత్తిడి మరింత పెరిగింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ద్రవ్యపరపతి విధానం కూడా ఈ పరిస్థితికి కొంత దోహదపడిందని నిపుణులు చెబుతున్నారు. ద్రవ్యోల్బణం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో యూఎస్ ఫెడ్ వడ్డీ రేటులో కోత పెట్టేందుకు సంకోచిస్తోంది. దీంతో, పెట్టుబడిదారులకు డాలర్ మరింత ఆకర్షణీయంగా మారి వర్ధమాన మార్కెట్స్ నుంచి నిధులు తరలి పోతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

## మరోమారు పెరిగిన బంగారం ధరలు

### పదిగ్రాముల బంగారంపై 650 పెరుగుదల


### లాభాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు

న్యూఢిల్లీ : మధ్య ప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో గురువారం భారీగా పతనమైన బంగారం ధర శుక్రవారం స్వల్పంగా కోలుకుంది. దేశంలో మేలిమి బంగారం ధర సగటున రూ.650ల మేర పెరిగింది. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.600ల మేర పెరిగింది. వెండి ధర మాత్రం తిరోగమనంలో కొనసాగుతూ మరో రూ.5 వేల మేర తగ్గింది (ఉనీటె, ఉాతిలె।స ఖసతిఇ।బ నీని ఓజీసఇఠ 20). గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,930కు పెరిగింది. నిన్నటితో పోలిస్తే ధర రూ.650ల మేర ఎగబాకింది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర కూడా రూ.600ల మేర పెరిగి రూ.1,38,350కు చేరుకుంది. నగరంలో వెండి ధర మాత్రం దాదాపుగా నిన్నటి స్థాయిలోనే కొనసాగుతోంది. కిలో వెండి ప్రస్తుతం రూ.2,64,900గా ఉంది. ఇతర ప్రధాన నగరాల వారీగా చూస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,630గా ఉంది. ఢిల్లీలో రూ.1,51,080గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,50,930గా ఉంది.

## ముగిసిన రంజాన్ ఉపవాసాలు

### నేడు పవిత్ర రంజాన్ పండగ

హైదరాబాద్,మార్చి20 : పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. చివరి శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గురువారం నెలవంక దర్శనం లేకపోవడంతో శు క్రవారం నెలవంక ఆధారంగా శనివారం రంజాన్ పండగను నిర్ణయించారు. దీంతో నెల రోజుల ఉపవాస దీక్షలను విరమించి పండగను జరుపకోబోతున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో 9వ నెల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండి ప్రార్థనలు ఆచరించారు. ఖురాన్ పఠించారు. ముఖ్యంగా ఈ మాసంలో దానధర్మాలు విరివిగా చేస్తారు. పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ఆత్మ పరిశీలనకు, స్వీయ క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇలా నెల రోజుల ఉపవాసాల ఆనంతరం నెలవంక కనిపించిన తర్వాత ఈద్ అల్ ఫితర్ అంటే రంజాన్ పండుగ జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే అతిముఖ్యమైన పండుగల్లో రంజాన్ అత్యంత ప్రధానమైనది. ఎంతో భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో రంజాన్ పండుగను ఆచరించారు. ముస్లిం ఆచరించే చంద్రమాన క్యాలెండర్‌లో రంజాన్ లేదా రమాదన్ అనేది తొమ్మిదో నెల. ఈ రంజాన్ పండుగ ఆధ్యాత్మిక చింతన, దానధర్మాలు, క్రమశిక్షణ వంటి వాటికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ రంజాన్ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని ముస్లిం పండితులు చెబుతారు. సాధారణంగా సౌదీ అరేబియాలో నెలవంక కనపించిన తర్వాతి రోజు భారత్‌లో రంజాన్ మాసంప్రారంభం కావడం అనేది ఆనవాయితీగా వస్తోంది. ఇక రంజాన్ పండుగ మార్చి 20 తేదీన నెలవంక దర్శనం ఆధారంగా జరుపుకుంటున్నారు.



ఆధ్యాత్మికం

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి

# కాంగ్రెస్ సర్కార్ 6 గ్యారెంటీలు పెద్ద మోసం

## ◆ 100 రోజుల్లో అమలు చేస్తామన్నారు.... 1000 రోజులు కావస్తున్న ఏ ఒక్క గ్యారెంటీ సక్రమంగా అమలు కాలే..... ◆ బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి

**కరీంనగర్ టౌన్, మార్చ్20:** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని, ముఖ్యంగా ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రజానీకాన్ని నమ్మించి మోసం చేసిందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000రోజులు కావస్తున్న ఏ ఒక్క గ్యారెంటీని సక్రమంగా అమలు చేయలేకపోయిందని , కాంగ్రెస్ సర్కార్ 6 గ్యారెంటీలు పెద్ద బోగస్ అని బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా విమర్శించారు. 6 గ్యారంటీలు కాంగ్రెస్ హామీల వైఫల్యాన్ని ఎండగడుతూ బిజెపి రాష్ట్ర శాఖ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి, అడిషనల్ కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 100 రోజుల్లో ఆరూ గ్యారంటీలు అమలు చేసి చూపిస్తామని మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. నేడు ఆ పార్టీ అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడిచినా కూడా ఇచ్చిన వాగ్దానం హామీ వాగ్దానాన్ని నిలుపుకోలేని దౌర్భాగ్య పరిస్థితిల్లో ఉన్నందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. ముఖ్యంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఒక ఫ్రీ బస్సును కల్పించి మహిళలకు ప్రతి నెల రూ. 2500, రూ. 500 కే గ్యాస్ సిలిండర్‌ను ఎగ్గొట్టిందన్నారు' రైతు భరోసా"కు భరోసా లేకుండా పోయిందన్నారు. రైతు భరోసా అందించడానికి అనేక కొర్రీలు పెడుతూ రైతాంగాన్ని తీవ్రంగా మోసం చేసిందన్నారు. రైతు కూలీల రైతు భరోసాకు మంగళం పాడిందన్నారు. ప్రధానంగా ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలోరూ.15 వేల రైతు భరోసా అందిస్తామని ప్రకటించి రూ.12 వేలకు కుదింపు చేసి రైతాంగాన్ని తీవ్రంగా మోసం చేసిందన్నారు. యువ వికాస పథకాన్ని గాలికి వదిలేసిందన్నారు.5 లక్షల విద్యా భరోసా కార్డు ఇంటర్నేషనల్ స్కూల్స్ ల ఏర్పాటు పత్తా లేకుండా పోయిందన్నారు. చేయూత " పథకానికి కాంగ్రెస్ సర్కార్ చేయించిందని, పెన్షన్లను పెంచుతామని పెన్షన్ దారులను తీవ్రంగా మోసం చేసిందన్నారు. రూ. 4000 పెన్షన్ ఇవ్వడానికి హస్తం పార్టీకి చేతులు రావడం లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇడ్ల స్థలం ఉన్నవారికి 5 లక్షల ఆర్థిక సాయం, తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం లను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అటకెక్కిచ్చిందన్నారు. గృహజ్యోతి పథకం కింద అర్హులైన వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే స్కీంను తూతూ మంత్రంగా అమలు చేసి చేతులు దులుపుకుందని ఆయన మండిపడ్డారు. ఆరూగ్యారంటీలను అమలు చేయలేని కాంగ్రెస్ సర్కార్ పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని తెలిపారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు 6 గ్యారంటీలను అమలు



చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. 6 గ్యారంటీల పై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే , బిజెపి చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. ఆరూ గ్యారెంటీల కోసం బిజెపి ప్రజానీకానికి అండగా ఉంటుందని, కాంగ్రెస్ సర్కార్ మెడలు వంచైనా సరే 6గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసేదాకా విడిచి పెట్టే ప్రసక్తి లేదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధులు సంగప్ప, వై. సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగుగ్గిలపు రమేష్, ఈ. నాగేశ్వర్ రెడ్డి , వసాల రమేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, కల్లెం వాసుదేవరెడ్డి, రంగు భాస్కరాచారి, చొప్పరి జయశ్రీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, సోమిడి వేణు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు, బండా రమణ రెడ్డి – జిల్లా ఎలక్షన్ సెల్ కన్వీనర్, కార్పొరేటర్లు వొంటెల సత్యనారాయణ రెడ్డి, భూపతి రవీందర్, మ్యాకాల వెంకటేష్ ,మాసం గణేష్, ఏన్నం ప్రకాశ్, కరీంనగర్ జోన్, మండల బాధ్యులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# టవర్ సర్కిల్‌లో ఘనంగా ఉగాది పచ్చడి, బూరెల వితరణ





**కరీంనగర్ టౌన్,మార్చ్20:** హిందూ వాహిని ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలోని టవర్ సర్కిల్ ప్రాంతంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉగాది పచ్చడి బూరెల వితరణ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. హిందూ వాహిని జిల్లా సంయోజక్, న్యాయవాది బెజ్జంకి శ్రీకాంత్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూ వాహిని రాష్ట్ర బాధ్యులు రుద్రోజు శ్రీనివాస్, 66వ డివిజన్ కార్పొరేటర్ వంగల పవన్ హాజరై, భక్తులకు, ప్రజలకు స్వయంగా ఉగాది పచ్చడి, బూరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంయోజక్ బెజ్జంకి శ్రీకాంత్ మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో ఉగాది పండుగకు ఉన్న విశిష్టతను కొనియాడారు. నూతనంగా ప్రారంభమైన ఈ 'పరాభవ' నామ సంవత్సరం దేశ ప్రజలందరి మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బేతి మహేందర్ రెడ్డి, హిందూ వాహిని నగర సంయోజక్ పోచమల్ల యాదవ్ ,పెండోట రాజు, మనోజ్ఞవ నాయకులు జూపల్లి ధీరజ్, వడ్ల తేజ, విష్ణు, సన్నీ, బబ్లు, సుమన్, వెంకట సాయి, తదితరులు పాల్గొన్నారు.

# సంఘ బలోపేతానికి కృషిచేసే నాయకత్వానికే అవకాశం

## ● అఖిలభారత యాదవమహాసభ కమిటీలు రద్దు....

**పెద్దపల్లి ప్రతినిధి :** అఖిల భారత యాదవ మహాసభ బలోపేతానికి పాటుపడే వారికే నాయకత్వ పగ్గాలు అప్పగిస్తామని పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సందనవేని రాజేందర్ అన్నారు. యాదవ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులతో కలిసి ట్రస్ట్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజేందర్ మాట్లాడుతూ, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లాలోని మండల కమిటీలను రద్దు చేస్తూ పత్రికా ప్రకటన చేశారు. ఏప్రిల్ 10నుండి 13మండల కమిటీలను ఎంపిక చేస్తామని, వీటితో పాటుగా మహిళ, యువత, యోప విభాగాలను కూడా ఎంపిక చేస్తామన్నారు. యాదవ విద్యార్థి వసతిగృహానికి జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్ రూ.40లక్షలు విరాళం ప్రకటించిన సందర్భంగా యాదవ సంఘం తరపున, జిల్లా యాదవుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఉన్న యాదవ వ్యాపారస్తులు, కాంట్రాక్టర్లు, ఎన్నారైలు, ఉద్యోగులు, అన్ని వర్గాల యాదవ కుల బాంధవులు భవనానికి సహకరించి విరాళాలను అందించాలని కోరారు. అనంతరం యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ,



యాదవ చారిటబుల్ ట్రస్ట్ గత పదేళ్ళుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పేద ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. మార్చి 31లోగా సభ్యత్వం పొందాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో నాయకులు చిలారపు పర్వతాలు యాదవ్, ట్రస్ట్ ఉపాధ్యక్షులు, పెగడ రమేష్, గొడుగు రాజ్ కుమార్, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వేల్పుల నాగరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు గుంపుల ఓదెల, బత్తిని లక్ష్మణ, మారం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# బసంత్ నగర్ విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోవాలి....

## ● యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

**పెద్దపల్లి ప్రతినిధి :** టీజీ ఎన్పీడీసీఎల్ పెద్దపల్లి సర్కిల్ పరిది బసంత్ నగర్ ఆపరేషన్ ఏఈ మానాల ప్రసాద్ పై చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. స్వామి డిమాండ్ చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్లలో పని చేస్తున్న ఆపరేటర్ల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ బెదిరిస్తున్నారని ఏఈ ప్రవర్తన సరిగా లేదని విచారణ జరిపి శాఖా పరమైన చర్యలు చేపట్టాలని శుక్రవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్ లో గల ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆపరేటర్లు, యూనియన్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఆపరేటర్లను కక్ష్య పూరితంగా వేధిస్తున్నారని ఎస్ఈ గంగాధర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఏఈ తీరుతో సబ్ స్టేషన్లలో పనిచేసే ఆపరేటర్లు భయాందోళన చెందుతున్నారని వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో మద్యం మత్తులో ఏఈ సబ్ స్టేషన్ లను సందర్శించి ఆపరేటర్లను ఇష్టానుసారంగా మాట్లాడు తున్నారని ఆరోపించారు. ఏఈ వైఖరిపై తక్షణమే



విచారణ జరిపి ఆపరేటర్లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజీ ఎన్పిడిసిఎల్ కంపెనీ ప్రెసిడెంట్ జి.ఆంజనేయులు, రీజనల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాగు నాయక్, సిహెచ్ నర్సయ్య, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండయ్య, కె.నరేష్, పెద్దపల్లి సర్కిల్ గౌరవ అధ్యక్షులు భిక్షపతి, మంథని డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్, సర్కిల్ పరిధిలోని ఆపరేటర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# 24న మండల స్థాయి క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపిక పోటీలు



**సుల్తానాబాద్, మార్చి20:** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల స్థాయి క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాల కోసం ఎంపిక పోటీలు ఈ నెల 24వ తేదీన ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎం.ఆర్.సి కేంద్రంలో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ప్రస్తుతం 3వ తరగతి చదువుతూ ఉండాలని, 2017 సెప్టెంబర్ 1 నుంచి 2018 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని, అవసరమైన ధ్రువపత్రాలతో ఈ నెల 24న ఉదయం 8 గంటలకు హాజరు కావాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మార్చి 28 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే పెద్దపల్లి జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు డి.సంధ్యారాణి, సి.హెచ్.శ్రీవాణి, ఆసియా, టి.ప్రణయ్, జి.వెంకటేష్, ఏ.సరోజ తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ సభ్యుడిగా సూత్రపు పరమేశ్....

**పెద్దపల్లి ప్రతినిధి :** టీపీసీసీ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సూత్రపు పరమేశ్ నియామకమయ్యారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విడుదల చేసిన జిల్లా కార్యవర్గంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా చోటు దక్కింది. పరమేశ్ నియామకం పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా తన నియామకానికి సహకరించిన పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయ రమణారావు, జిల్లా అధ్యక్షులు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ లకు పరమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. విప్ విజయ రమణారావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని పరమేష్ తెలిపారు.



# డిసిసి ప్రధానకార్యదర్శిని సన్మానించిన స్వర్ణకారసభ్యులు



**పెద్దపల్లి ప్రతినిధి,:** పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన దేవరకొండ రాజును స్వర్ణకార, బంగారు వర్తకసంఘ ప్రతినిధులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, నమ్మకంతో కీలక బాధ్యతలను అప్పగించి నందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ విజయరమణారావు, డి సి సి అధ్యక్షుడు మక్కన్‌సింగ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ వెండి బంగారు సంఘ అధ్యక్షులు రంగు శ్రీనివాస్, స్వర్ణకార సంఘ అధ్యక్షులు కట్ట రమేష్, గౌరవ అధ్యక్షులు కాసాల నరసింహచారి, ఉపాధ్యక్షులు సిరికొండ వేణుగోపాల్, కోశాధికారి బాణాల లక్ష్మణ్, ఆల్ ఇండియా సెక్రెటరీ కందుకూరి పూర్ణాచారి, రాష్ట్ర కార్యదర్శి మడుపు రామనర్సయ్య, సలహాదారులు కట్ట రాజానందం, ఉపాధ్యక్షులు దేవరకొండ చంద్రమౌళి, మునిగంటి కృష్ణ, రంగు శ్రీనివాస్, స్వర్ణకార సంఘ నాయకులు పలువురు పాల్గొన్నారు.

# మారుతీ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

**కరీంనగర్ టౌన్, మార్చ్20(:** కరీంనగర్ లోని వజ్రమ్మ కళ్యాణ మండపంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘం ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమ ప్రారంభంలో ప్రముఖ సిద్ధాంతి చెఱుకు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించబడింది. రాబోయే కాలంలో గ్రహగతులు, ఆదాయ వ్యయాలు ప్రజల శుభాశుభ ఫలితాలను సంతోష్ శర్మ వివరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షులు యాంసాని అశోక్,ప్రధాన కార్యదర్శి నార్ల నవీన్, కోశాధికారి ఎలుగూరి రవి, అదనపు ప్రధాన కార్యదర్శి, రేణికుంట ప్రవీణ్, సంయుక్త కార్యదర్శి మోటూరి ఆంజనేయులు, కో–ఆర్డినేటర్ ఎలుగూరి మధు,ఈ సందర్భంగా నూతన సభ్యులు మాట్లాడుతూ, తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తామని, అందరినీ కలుపుకుంటూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫతేనగర్‌లో మద్యం తాగిన తర్వాత ఘర్షణ

## - రాయితో దాడి చేసి వ్యక్తి హత్య



**హైదరాబాద్ :** ఫతేనగర్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. పైప్‌లైన్ రోడ్ వద్ద ఉన్న బుర్హాన్ ఇంజినీరింగ్ వర్క్స్ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున హత్య జరిగింది. సనత్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. అశోక్ వివరాల ప్రకారం, బీహార్‌కు చెందిన రోహిత్ కుమార్ (40) మరియు తాండూర్‌కు చెందిన నరేష్ (45) ఇద్దరూ అక్కడి చిన్న దుకాణాలలో కూలీలుగా పని చేస్తూ, అదే ప్రాంతంలో నివసిస్తూ ఉండేవారు. మార్చి 19/20 మధ్య రాత్రి సుమారు 2:45 గంటల సమయంలో ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. ఈ సమయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. ఆగ్రహానికి లోనైన రోహిత్ కుమార్ సమీపంలో ఉన్న రాయిని తీసుకుని నరేష్‌పై తలకు, శరీరానికి పలుమార్లు బలంగా దాడి చేశాడు. దీంతో నరేష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య అనంతరం నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రాంతాన్ని కట్టుదిట్టంగా భద్రపరిచారు. క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి

# సంస్కృతి, సాంప్రదాయాలు, ధర్మ పరిరక్షణ ధ్యేయంగా ఆర్ఎస్ఎస్ వందేళ్ల ప్రయాణం

## ◆ విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణరావు

**కరీంనగర్ టౌన్,మార్చ్20:** భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు, ధర్మ పరిరక్షణ ధ్యేయంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్ల ప్రయాణం కొనసాగిందని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణరావు అన్నారు. ఆర్ఎస్ఎస్ కరీంనగర్ ఆధ్వర్యంలో పరమ పూజనీయ డాక్టర్ హెడ్గే వార్ జయంతి , ఉగాది ఉత్సవ వేడుకలు నగరంలోని రెవెన్యూ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్త గా హాజరైన ఆయన మాట్లాడుతూ పరమ పూజనీయ డాక్టర్ ఒక గొప్ప దేశభక్తుడు, భావితరాలకు ఒక ఆదర్శ మూర్తిగా వెలుగొందిన నాయకుడు అని కొనియాడారు. కళ్ళకు కనిపించే దృశ్యంను చూడడాన్ని దృష్టి అంటారని, భవిష్యత్తులో జరగబోయే దాన్ని ఊహించి పని ప్రారంభించే వారిని ద్రష్ట అంటారని, అలా డాక్టర్ భవిష్యత్తులో జరగబోయే దానిని ఊహించిన గొప్ప వారని అందుకే డాక్టర్ ని యుగ ద్రష్ట అంటారని తెలిపారు. 1889లో జన్మించిన డాక్టర్ చిన్న వయసులోనే దేశం స్థితి, దేశ బానిసత్వం గురించి ఆలోచించేవారని, స్కూల్లో చదువుకునే వయసులోనే వందేమాతరం ఉద్యమాన్ని నిర్మాణం చేశారన్నారు. వైద్య విద్యను అభ్యసించిన డాక్టర్ ఉద్యోగ ప్రయత్నాలు చేయకుండా తన జీవితాన్ని దేశం కోసం అంకితం చేయాలనే సంకల్పం తీసుకున్నారన్నారు. ఆ రోజుల్లో డాక్టర్ జి కాంగ్రెస్ లో ఒక ముఖ్య నాయకుడిగా పనిచేశారని, గాంధీజీ ఇచ్చిన పిలుపు మేరకు ఉప్పు సత్యాగ్రహం చేసి తొమ్మిది నెలలు జైలు శిక్షణ కూడా అనుభవించారని తెలిపారు. డాక్టర్ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొంటూనే అసలు ఈ దేశం ఎందుకు పరాధీనమైంది ..? దేశ భవిష్యత్తు ఏంటి అనే ఆలోచన ఆయన మదిలో మొదలైందన్నారు. దేశ పరం వైభవ స్థితి కోసం, దేశంలో జాతీయవాదం బలపడాలనే ఆకాంక్షతో,మన సంస్కృతి సాంప్రదాయాలు ధర్మ స్థాపన సంకల్పంతో 1925లో డాక్టర్ ఆర్ఎస్ఎస్ ను స్థాపించారని తెలిపారు. పట్టుమని పదిమంది కూడా లేని చిన్నపిల్లలతో ప్రారంభించిన సంఘం నేడు ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించిందన్నారు. దేశంలోని అనేక రంగాల్లో ఆర్ఎస్ఎస్ లోని అనేక విభాగాలు పనిచేస్తున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ కింద పనిచేసే అనేక సంస్థలు, ఆర్గనైజేషన్లు దేశ హితం, ఐక్యత కోసం తమవంతుగా కృషి చేస్తూ ముందుకు కొనసాగుతు న్నాయన్నారు. జాతీయ భావన, ఐక్యత లేని ఏ దేశం కూడా మనగడ సాధించలేదన్నారు. నేడు ప్రపంచంలోని అనేక దేశాలు ఐక్యత లేని కారణంగా ఎన్నో సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నాయని, యుద్ధాలు చేసుకునే స్థితికి వచ్చాయన్నారు. జాతీయవాదం, ఐక్యత తో నే భారత దేశం నేటికీ వర్ధిల్లు తుందన్నారు. సంఘం వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నేడు సమాజంలోకి పంచ పరివర్తన్ తో ముందు కొనసాగుతుందన్నారు.ముఖ్య అతిథి






కోటా విద్యా సంస్థల చైర్మన్ దబ్బేట అంజి రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ లో పనిచేసే స్వయం సేవకులు సమాజం కోసం ఎంతో కమిట్మెంట్తో పనిచేస్తారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ కు తాను ఒక బార్న్ స్టూడెంట్ లాంటి ( ఇప్పుడే పుట్టిన బేబీ) వాడిన న్నారు. తన పిల్లలను మాత్రం ఆర్ఎస్ఎస్ చూపించిన మార్గంలోనే ముందుకు తీసుక వెళుతున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని ముందు ఉగాది ఉత్సవ వేడుకల్లో భాగంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ సహ సంఘ చాలక్ చక్రవర్థుల రమణాచార్యులు, జిల్లా సంఘచాలక్ దుర్శెట్టి నిరంజనా చారి, నగర సంఘచాలక్ హన్మాండ్ల శ్రీనివాసరెడ్డి, లతోపాటు స్వయంసేవకులు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు

## చేతివృత్తి కులాలకు చేయూతనివ్వని బడ్జెట్

### - పూసాల సంపత్



**కరీంనగర్, మార్చి20:** కాంగ్రెస్ ప్రభుత్వం చేతివృత్తి కులాలకు 12వేల500 బడ్జెట్ కేటాయించి నప్పటికీ కుల సంఘాల ప్రాతిపదికన రజకులకు బడ్జెట్ కేటాయించలేదని ఆరోపిస్తూ తెలంగాణ రజక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ శు క్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ కులవృత్తి ఆధారంగా బ్రతికే రజక కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నాయని, అరకొర బడ్జెట్ తో సంక్షేమం సాద్యం కాదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా రజక సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. బడ్జెట్ సమావేశాల్లో రజక కార్పోరేషన్కు 5వేల కోట్లతో ప్రత్యేక నిధులు కేటాయించిడమే కాక బిసి కార్పొరేషన్ ద్వారా గ్రామాల్లోని రజక సంఘాలకు వ్యక్తిగత లోన్లిచ్చి ఆదుకుని, పేదరికంలో మగ్గుతున్న రజకుల ఆర్థిక అభ్యున్నతికి సబ్ ప్లాన్తో ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు పూసాల సంపత్ ప్రకటనలో పేర్కొన్నారు.

## బల్దియాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిన్న చూపు

### - బిజెపి కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్ రావు



**కరీంనగర్ టౌన్, మార్చ్20:** బల్దియాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల కేటాయింపు విషయంలో చిన్న చూపును చూసిందని దీంతో అభివృద్ధి, సంక్షేమపథకాల అమలు విషయంలో పట్టణ ప్రజలలకు తీరని అన్యాయం జరగనుందని బిజెపి కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ కరీంనగర్ కార్పొరేటర్ బోయిన్ పల్లి ప్రవీణ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. నిండు అసెంబ్లీ సాక్షిగా అబద్దాల అంకెలతో కూడిన బడ్జెట్ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. కేటాయింపులు కు వాస్తవ పరిస్థితికి పొంతన లేకుండా అత్తెసరు నిధులను ఆయా శాఖలకు కేటాయించారనే బాధను వ్యక్తంచేశారు. కొత్త ప్రాజెక్టులు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదనేది ఈ కేటాయింపులతో తేటతెల్లమయిందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల విద్యకు సంబంధించి యంగ్ ఇండియా స్కూల్ లకు గతంలో మాదిరిగానే నిధులు కేటాయించారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో మాటలకు చేతలకు పొంతన లేనివిధంగా నిధుల ప్రస్తావనను ఆర్థిక మంత్రి వినిపించారన్నారు. నేత కార్మికులకు ఈసారి తక్కువ బడ్జెట్ కేటాయించడం వల్ల సిరిసిల్ల కరీంనగర్ జిల్లాలోని చేనేత కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు.

## బడ్జెట్ సమావేశాల్లో ప్రాధాన్యత రంగాలకే పెద్దపీట: ఎమ్మెల్యే కవ్వంపల్లి



**తిమ్మాపూర్, మార్చి20, :** హైదరాబాదులోని శాసనసభలో శుక్రవారం నిర్వహించిన బడ్జెట్ సమావేశాల్లో ఉప ముఖ్యమంత్రి ప్రాధాన్యత రంగాలకు పెద్దపీట వేశారని టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హర్షం వ్యక్తంచేశారు. వ్యవసాయం, విద్యుత్, విద్య, వైద్యంతో పాటు ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించారని పేర్కొన్నారు. విద్యారంగ అభివృద్ధికి రూ. 26,674 కోట్లు, వ్యవసాయరంగం అభివృద్ధికి రూ. 23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ. 21,285 కోట్లు,బీసీ సంక్షేమానికి రూ. 12,511 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ. 11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ. 7,934 కోట్లు, మైనార్టీ సంక్షేమం.. రూ. 3,769 కోట్లు కేటాయించి ప్రభుత్వం ఉదాతరతను చాటుకుందనో ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నడూ లేని విధంగా అన్నివర్గాల సంక్షేమానికి కేటాయించిన ఈ బడ్జెట్ సబ్బండవర్ణాల సంక్షేమ బడ్జెట్ గా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు అధిక ప్రాధాన్యమిచ్చి రూ. 50,713 కోట్లు కేటాయించడంతో ప్రజల్లో నెలకొన్న అనుమానాలు పటాపంచలైనట్లు పేర్కొంటూ బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, ప్రభుత్వానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి అభినందనలు తెలిపారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ బడ్జెట్ ప్రజారంజకం: వైద్యుల అంజన్ కుమార్



**కరీంనగర్ టౌన్, మార్చ్ 20** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-2027 బడ్జెట్ అద్భుతమని, ఇది పూర్తిగా ప్రజల పక్షపాతి బడ్జెట్ అని కరీంనగర్ అర్బన్ డిసిసి అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ కొనియాడారు.ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పద్దులు రాష్ట్ర ప్రగతికి బాటలు వేసేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయం మరియు పంచాయతీరాజ్ రంగాలకు భారీగా నిధులు కేటాయించడం శుభపరిణామన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టి, మైనార్టీ వర్గాల సంక్షేమానికి భారీ కేటాయింపులు జరిపారని, ఈ ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. దళిత, బహుజన, మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఈ బడ్జెట్ మరోసారి నిరూపించిందని ఆయన ప్రశంసించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, సమతుల్యతతో కూడిన బడ్జెట్ను అందించిన ప్రభుత్వానికి అంజన్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## నవోదయ ప్రవేశ పరీక్షలో ఎంతో శ్రమించి కష్టపడి అర్హత సాధించి

- నవోదయ ఫలితాలలో మెరిసిన కృష్ణవేణి చాంప్స్
- కరస్పాండెంట్ చందుపట్ల.తిరుపతి రెడ్డి,
- ప్రధానోపాధ్యాయులు బర్ల.శ్రీనివాస్




**రామగిరి, మార్చి 20:-** 2026-27 విద్యా సంవత్సరం నకు జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశ అర్హత పరీక్షలో అర్హత సాధించి సీటు సాధించుకున్న కృష్ణవేణి చాంప్స్ అయినటువంటి బోడిగే ప్రజ్ఞయ, గరిగంటి మురారి, బాలసాని హార్దిక్ లను పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ చందుపట్ల.తిరుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బర్ల.శ్రీనివాస్ అభినందించారు. నవోదయ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించడం మామూలు విషయం కాదని దానికి ఎంతో శ్రమించాలని అలా కష్టపడి అర్హత సాధించి మీ యొక్క తల్లిదండ్రులకు, మీ ఉపాధ్యాయులకు, మీ పాఠశాలకు అలాగే మీ ఉరికి మంచి పేరు తీసుకువచ్చారని ఆ ముగ్గురు విద్యార్థులను కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ శ్రీధర్ బాబు, రంజిత్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బడ్జెట్లో హామీలు 6గ్యారెంటీలకు కేటాయింపులు లేవు

### - బడ్జెట్ అంకెలు, మాటలు ఘనంగా కనిపించే గారడి
### - బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**కరీంనగర్ టౌన్, మార్చ్20:** ఈసారి బడ్జెట్లో నైనా 6 గ్యారంటీలు అమలు చేస్తారని ప్రజలు ఎంతో ఆశగా చూశారని , మళ్లీ వాళ్ళ ఆశలపై కాంగ్రెస్ నీళ్లు చల్లిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. బడ్జెట్లో కాంగ్రెస్ హామీలకు, ఆరూ గ్యారంటీలకు కేటాయింపులే లేవన్నారు. మహిళలకు రూ. 2500 ఉసే లేదన్నారు. చేయూత కింద ఇస్తామన్నా రూ. 4000 ల పింఛన్కు అతి గతి లేదన్నారు. తులం బంగారంకు, నిరుద్యోగ భృతికి కేటాయింపులు లేవన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయని , బడ్జెట్ కాంగ్రెస్ హామీలకు అనుగుణంగా లేదని , బడ్జెట్ అంకెలు కేటాయింపులు, మాటలు ఘనంగా కనిపించే గారడి మాత్రమేనన్నారు. బడ్జెట్ కు విశ్వసనీయత లేదన్నారు.

## రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చిలుముల నవీన్ కుమార్ నియామకం



**కరీంనగర్ టౌన్,మార్చ్20:** తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చిలుముల నవీన్ కుమార్ లను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ నియామకం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.ఈ మేరకు గురువారం రోజున కరీంనగర్ జిల్లా నియామక పత్రం నవీన్ కుమార్ కు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేయాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇచ్చే పిలుపులలో కార్యక్రమాలలో పాల్గొనాలని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్, రాష్ట్ర ప్రత్యేక గౌరవ సలహాదారు కనకం వంశీ కిరణ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## బల్దియాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిన్న చూపు

### - బిజెపి కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్ రావు

**కరీంనగర్ టౌన్, మార్చ్20:** బల్దియాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల కేటాయింపు విషయంలో చిన్న చూపును చూసిందని దీంతో అభివృద్ధి, సంక్షేమపథకాల అమలు విషయంలో పట్టణ ప్రజలలకు తీరని అన్యాయం జరగనుందని బిజెపి కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ కరీంనగర్ కార్పొరేటర్ బోయిన్ పల్లి ప్రవీణ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. నిండు అసెంబ్లీ సాక్షిగా అబద్దాల అంకెలతో కూడిన బడ్జెట్ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. కేటాయింపులు కు వాస్తవ పరిస్థితికి పొంతన లేకుండా అత్తెసరు నిధులను ఆయా శాఖలకు కేటాయించారనే బాధను వ్యక్తంచేశారు. కొత్త ప్రాజెక్టులు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదనేది ఈ కేటాయింపులతో తేటతెల్లమయిందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల విద్యకు సంబంధించి యంగ్ ఇండియా స్కూల్ లకు గతంలో మాదిరిగానే నిధులు కేటాయించారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో మాటలకు చేతలకు పొంతన లేనివిధంగా నిధుల ప్రస్తావనను ఆర్థిక మంత్రి వినిపించారన్నారు. నేత కార్మికులకు ఈసారి తక్కువ బడ్జెట్ కేటాయించడం వల్ల సిరిసిల్ల కరీంనగర్ జిల్లాలోని చేనేత కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు.

## జిల్లా అభివృద్ధిపై బడ్జెట్లో ఎలాంటి ప్రస్తావన లేకపోవడం బాధాకరం

### - సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



**కరీంనగర్ టౌన్,మార్చ్20:** 2023 డిసెంబర్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ప్రభుత్వాన్ని నడిపిస్తూ రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టే బడ్జెట్ చూస్తుంటే ఆడంబరంగా అంకెల్లో భారీ బడ్జెట్లను ప్రవేశపెడుతూ అమలు చేయడానికి మాత్రం ప్రభుత్వం దగ్గర డబ్బులు లేకుండా పోతున్నాయని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026 - 2027 సంవత్సరానికి గాను రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో 5 లక్షల ప్రమాద భీమా, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉద్యోగులకు ప్రమాద బీమా మంచిదైనప్పటికీ పేదలకు ఇండ్లు, పెన్షన్లు ఇవ్వకపోవడం దారుణమని, ఇందిరమ్మ ఇండ్లకు గతంలో కేటాయించిన 14వేల కోట్ల ను పెంచాల్సింది పోయి కేవలం 7వేల కోట్లు కేటాయించడం సరైంది కాదని, విద్య కు 20శాతం నిధులు కేటాయించాలని విద్యావేత్తలు చెబుతున్నప్పటికీ అమలు చేయకపోగా గత బడ్జెట్ కంటే స్వల్పంగా అంటే 0.65 శాతం పెంచడం పట్ల విద్యా రంగంపై ప్రభుత్వానికి చిన్న చూపు ఉన్నట్లు కనబడుతుంది. హైదారాబాద్ చుట్టుతనే విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం వివక్షత అవుతుందని, వైద్య రంగానికి 4.2 శాతం నిధులు కేటాయించడం సరైంది కాదని కనీసం 10 శాతం కేటాయించేది ఉండేనని అన్నారు. కరీంనగర్ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేకించి బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం దారుణమని, ఉత్తర తెలంగాణకే తల మాణికం లాంటి కరీంనగర్లో మానేరు రివర్ ఫ్రంట్ కేబుల్ బ్రిడ్జి పనుల పురోగతికి నిధులు కేటాయించలేదని, జిల్లాలోని ప్రాజెక్టులు, వాటి పరిధిలోని కాలువల నిర్మాణాలకు నిధులు కేటాయించక పోవడం సరైన మొత్తంగా బడ్జెట్ చూస్తే బారెడు అమలు మాత్రం మూరెడులా ఉందని పంజాల శ్రీనివాస్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

# అకాల వర్షాలతో నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాలి

## ● వెయ్యి ఎకరాలలో నేలకొరిగిన మొక్కజొన్న పంట ● మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి







**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లినియోజకవర్గంలో మొన్నటి ఆకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లి, కూనారం గ్రామాల్లో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన మొక్కజొన్న పంటలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సందర్శించి రైతులను పరామర్శించారు. అన్నదాతలు అధైర్య పడవద్దని, బిఆర్ఎస్ రైతులకు అండగా ఉంటుందని రైతులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల మొక్కజొన్న పంట తీవ్రంగా నష్టపోయిందని తెలిపారు. సుమారు 500 నుండి 1000 ఎకరాల వరకు పంట నష్టపోయినట్లు అంచనా వేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా నష్టపోయిన రైతుల్లో ఎక్కువ మంది కౌలు రైతులే ఉండటం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని, సరైన పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను అర్థం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్, మాజీ ఎంపీటీసీ దేవయ్య, మంథని రాజయ్య, రాజు, వివేక్ పటేల్, వెంకన్న, బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# బాధితులకు బాసటగా... ఆన్ సైట్ ఎఫ్.ఐ.ఆర్ నమోదు


## - బాధితులకు సత్వర పోలీసు సేవలు అందించడమే తమ లక్ష్యశీ - ఎస్ఐ తాడవేని శ్రీనివాస్







**రామగిరి, మార్చి 20:** పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తూ ఆన్ సైట్ ఎఫ్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా రామగిరి పోలీసులు కీలక అడుగు వేశారు. బాధితురాలు ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కు వచ్చే అవసరం లేకుండా వారు ఉన్న చోటికే వెళ్లి కేసు నమోదు చేశారు. మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన మట్ట రాజయ్య(48) అనే భవన నిర్మాణ మేస్త్రీ రాజాపూర్ గ్రామంలో ఉరి వేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డ విషయాన్ని బాధిత కుటుంబ సభ్యులు రామగిరి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న వెంటనే రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితురాలు మృతుడి రాజయ్య భార్య ఓదమ్మ వద్ద నుండి ఫిర్యాదును స్వీకరించి, అక్కడికక్కడే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేశారు. అనంతరం ఎఫ్.ఐ.ఆర్ పత్రాన్ని బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ తాడవేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాధితులకు సత్వర పోలీసు సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. 'ఆన్ సైట్ ఎఫ్.ఐ.ఆర్' కార్యక్రమం ద్వారా బాధితులు పోలీస్ స్టేషన్ లకు వెళ్లే అవసరం లేకుండా వారి వద్దకే వచ్చి పిర్యాదు స్వీకరించి ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

# నెల రోజుల భక్తి... ఏడాదంతా స్ఫూర్తి .. నేడే ఈద్ ఉల్ ఫితర్



**జమ్మికుంట మార్చి 20 :** షవ్వాల్ నెలవంక తొంగి చూసింది. అత్యంత పవిత్రంగా కఠోర నియమ, నిష్టలతో కొనసాగించిన రంజాన్ నెలకు ముస్లింలు ఘనంగా వీడ్కోలు పలికారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు (రోజా)లు కొనసాగించి ఇక సంతోషంగా ఈద్ ఉల్ ఫితర్ పండుగ సంబురాలు జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం సాయంత్రం నెలవంక దర్శనం ఇవ్వడంతో ఉలేమాలు శనివారం ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు జరుపుకోవాలని ప్రకటించారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఆకలి, దప్పికల నుంచి ఓర్పు,సహనం అనే సద్గుణాలను నేర్చుకున్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే తత్వాన్ని అలవర్చుకున్నారు. 30 రోజుల పాటు చేపట్టిన దీక్షలు, ప్రార్థనలతో పొందిన నైతిక విలువలను వచ్చే ఏడాదంతా స్ఫూర్తిగా కొనసాగించడానికి సంసిద్ధులయ్యారు. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ పండుగ శనివారం భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పండుగ ప్రాధాన్యం, నెల రోజులుగా చేపట్టిన ఉపవాస దీక్షలు (రోజా)లతో నేర్చుకున్న శిక్షణ ముస్లింలందరు పాటించాలని మతపెద్దలు, ఉలేమాలు చెబుతున్నారు. షవ్వాల్ మాసంలోని మొదటి రోజు కనిపించే నెలవంక తర్వాత ప్రత్యేక దువా చేసి ఈద్ ఉల్ ఫితర్ పండుగ జరుపుకుంటారు. ఈద్ ఉల్ ఫితర్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ముస్లింలు పండుగ రోజు ఉదయాన్నే తలస్నానం చేసి, కొత్త దుస్తులు ధరించి ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. ఈ నేపథ్యంలో ఈద్గాహ్ వద్ద భారీ ఎత్తున ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం రంజాన్ పండుగ రోజున షీర్ ఖుర్మా చేసుకొని నోరు తీపి చేసుకుంటారు. ధనికులు, పేదలు అనే తారతమ్యం లేకుండా సమాజంలోని అందరూ ఒకే విధమైన దినచర్య పాటిస్తారు. ఈ పండుగ ఆరోగ్యకర పద్ధతులు, శాంతి, సౌభాగ్యాలను నెలకొల్పుతుందని నమ్మకం. పండుగ తర్వాత మరో ఆరు రోజుల పాటు షవ్వాల్ దీక్షలు పాటిస్తారు. **ప్రత్యేక దువా** ముస్లింలు పండుగకు ముందు రోజు రాత్రి షవ్వాల్ నెల నెలవంక కనిపించిన తర్వాత ప్రత్యేక దువా (ప్రార్థన) చేస్తారు. అప్పటితో ఉపవాస దీక్షలు ముగుస్తాయి. ఈద్ ఉల్ ఫితర్ రోజు సూర్యోదయానికి ముందు నిద్రలేస్తారు. ఉదయం ఫజర్ నమాజ్ చేస్తారు. అందరూ సంప్రదాయ స్నానాలు (గుసుల్) చేస్తారు. అనంతరం కొత్త బట్టలు ధరిస్తారు. చాలా మంది లాల్చీ, పైజామా ధరిస్తారు. ఈద్ (పండుగ) రోజు ఉపవాసం ఉండకూడదని ఖురాన్ చెబుతోంది. ఈద్ ఉల్ ఫితర్ నమాజు కంటే ముందు 'జకాత్' చెల్లిస్తారు. ఇస్లాం ఐదు మూల స్తంభాల్లో జకాత్ నాలుగోది. పండుగ రోజున నమాజ్ కు ముందు పేదలకిచ్చే దానమే ఫిత్రా. అందుకే ఈ పండుగకు ఈద్ ఉల్ ఫితర్ అని పేరు వచ్చింది. **రంజాన్ స్పెషల్ 'షీర్ ఖుర్మా'** రంజాన్ పండుగ రోజు అందరి దృష్టి షీరఖుర్మా' పైనే ఉంటుంది. పండుగ రోజు నమాజ్ ముగిశాక మిత్రులు, బంధువులు, ఆత్మీయులతో పంచుకునేందుకు వారందరిని ఇండ్లకు ఆహ్వానిస్తారు. వారికి షీర్ ఖుర్మాతో విడదీయరాని అనుబంధం ఉంది. ఉపవాసాలు, ఐదుపూటల నమాజ్, చివరి పది రోజుల్లో ఎతెఖాఫ్, షబే ఖదర్, జాగరణ రాత్రులతో నెల రోజుల పాటు ముస్లింలు ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. చివరి రోజు ఉపవాస దీక్ష ముగిసిన తర్వాత ముస్లింలు సోదరభావంతో హిందువులకూ 'షీర్ ఖుర్మా' అందిస్తారు. **దానధర్మాలకు ప్రతీక:** రంజాన్ మాసం అత్యంత నియమ, నిష్టలతో పవిత్ర రంజాన్ మాసపు ఉపవాస దీక్షలు చేపట్టి షవ్వాల్ నెలవంక చూసిన తర్వాత ఈద్ ఉల్ ఫితర్ పండుగ జరుపుకుంటాం. పేదల ఆకలి బాధలు తెలుసుకొని ఈద్ నమాజ్ కు ముందే ప్రతి ఒక్కరు విధిగా ఫిత్రా, జకాత్ చెల్లించాలి. ఇదే పవిత్ర రంజాన్ మాసం ఆశయం. ప్రేమ, కరుణ, సోదరభావం, పరమత సహనం ఇస్లాం ప్రధాన ఉద్దేశం. రంజాన్ మాసమంతా అనుక్షణం సర్వ మానవాళి సుఖ సంతోషాల కోసమే ప్రార్థిస్తాం. ఇస్లాం మూల సిద్ధాంతాలు కలిమా, నమాజ్, రోజా, జకాత్, హజ్ ఐదు అంశాలపై ఉన్నాయి. ఈ నెలలో దైవ ప్రార్థన, బీదలకు తనవంతు సాయం, ప్రేమాభిమానాలతో గడిపిన జీవన విధానం మిగిలిన 11 నెలలు పాటు ఆచరించాలని పవిత్ర ఖురాన్ లో అల్లాహ్ నిర్దేశించారు. అల్లాహ్ సన్మార్గంలో ముస్లింలందరు నడవాలి. **దివి నుంచి భువికి ఖురాన్** ముస్లింలకు అతి పవిత్రమైన మాసం రంజాన్. ఖురాన్ గ్రంథం దివి నుంచి భూమికి ఈ మాసంలోనే వచ్చింది. ఈ నెలలో ఉపవాస దీక్షతో శరీరాన్ని శుద్ధి చేసుకోవడం ద్వారా ఆత్మ ప్రక్షాళన అవుతుంది. దీంతో మోహం, మదం, కోపతాపాలు అదుపులో ఉంటాయి. రంజాన్ మాసంలో ముస్లింలు అందరూ ఉపవాస దీక్షలు ఆచరించడం తప్పనిసరి. ఖురాన్లో సూచించినట్లుగా సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు 30 రోజుల పాటు పాటించే దీక్షల్లో చుక్క నీరు కూడా సేవించరు. ఇలా 30 రోజుల పాటు కఠోర నియమాలతో ఉపవాస దీక్ష చేస్తారు. ఉపవాస దీక్షలతో మనో నిగ్రహం కలుగుతుంది. ఆకలి విలువ తెలుస్తుంది. కోరికలు దహించుకుపోతాయి. ప్రేమ, అభిమానం, క్రమశిక్షణ, కర్తవ్యం తదితర గుణాలు దరి చేరతాయి. ఎన్నో ప్రత్యేకతలతో సాగే రంజాన్ మాసం ఈద్ ఉల్ ఫితర్ వేడుకలతో ముగుస్తుంది.



# ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విప్ కేటాయించడం పట్ల సంబరాలు



**ఇల్లందకుంట మార్చి 20 :** తెలంగాణ పిసిసి ఉపాధ్యక్షులు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కు విప్ రావడం పట్ల కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ఫిషర్ మెన్ చైర్మన్ బండి మల్లేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బాణసంచా కాల్చి ,స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డివానిపల్లి సర్పంచ్ గడ్డి శ్రీనివాస్, వంగ రామకృష్ణ, మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఉన్నతమైన పదవులు కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని కష్టకాలంలో హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జిగా ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ఇంకా ఉన్నతమైన పదవులు వెంకట్ అన్నకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని కోరారు. మండలంలో ఉన్నటువంటి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బండి మల్లేష్ ఫిషర్మెంట్ చైర్మన్ కరీంనగర్ జిల్లా వంగ రామకృష్ణ, మండల సీనియర్ నాయకులు సర్పంచ్ గడ్డి శ్రీనివాస్ ఉప సర్పంచ్ అరెల్లి రమేష్, గుండారపు సాయికుమార్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మంకు ఐలయ్య, ధంసాని కిరణ్ పెద్ది అభి, జక్కు కుమార్, పరకాల విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# గుల్జార్ మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనలు..



**జమ్మికుంట మార్చి 20 :** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మల్కాజ్గిరి నియోజకవర్గ పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ జన్మదిన సందర్భంగా నేడు జమ్మికుంట పట్టణంలోని గుల్జార్ మస్జీద్‌లో బిజెపి పార్టీ మైనార్టీ నాయకుడు మహమ్మద్ నసీరొద్దీన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చినారు. ఈ సందర్భంగా నసీరొద్దీన్ గారు మాట్లాడుతూ ఈటెల రాజేందర్ అష్ట ఐశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించి, ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుల్జార్ మస్జిద్ మతగురువు మౌలానా మొహమ్మద్ జహీరుల్ ఖాదిరీ ప్రత్యేక ప్రార్థనలు చేసినారు.

# మానవత్వం చాటుకున్న ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు

## - ఆలయంలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి చీరల పంపిణీ



**ఇల్లందకుంట మార్చి 20 :** అపర భద్రాద్రిగా పేరుపొందిన శ్రీ ఇల్లంతకుంట సీతారామచంద్రస్వామి దేవస్థానం లో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందికి మానవత దృక్పథంతో చీరలు పంపిణీ పంపిణీ చేశారు. శుక్రవారం ఆలయంలో పనిచేస్తున్న ఐదు మంది మహిళా సిబ్బందికి రామారావు తన సొంత డబ్బులతో ఖరీదు చేసిన చీరలను వారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని ఆలయంలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి చీరలు అందించాలని ఒక చిన్న సదుద్దేశంతో వారికి శ్రీరామనవమి కానుకగా అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గోడిశాలపరమేష్, నారాయణరెడ్డి దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి భరోసా... ఇది ప్రజల బడ్జెట్

## - కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్ టౌన్, మార్చ్20:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ పూర్తిగా ప్రజల అవసరాలకు అద్దం పట్టేలా ఉందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు కొనియాడారు. ఈ బడ్జెట్ తెలంగాణను ప్రగతి పథంలో తీసుకెళ్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌లోని ముఖ్యాంశాలను చారిత్రాత్మక బీమా పథకం దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా కోటి 15 లక్షల కుటుంబాలకు బీమా భరోసా కల్పిస్తూ 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని ప్రవేశపెట్టడం విప్లవాత్మక నిర్ణయమని ప్రశంసించారు. దీని కోసం ఆరోగ్య శాఖకు రూ. 13,679 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు నిధులు కేటాయించడం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. రంగాల వారీగా భారీ కేటాయింపులు: విద్య: రూ. 26,000 కోట్లు (ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అద్భుతం). వ్యవసాయం: రూ. 23,179 కోట్లు. పంచాయతీరాజ్: రూ. 33,000 కోట్లు. సాగునీరు: రూ. 22,615 కోట్లు. మెట్రో విస్తరణ: రూ. 24,000 కోట్లు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ దేశ చరిత్రలోనే తొలిసారిగా భారీ నిధులు కేటాయించారని రాజేందర్ రావు తెలిపారు. ప్రజల ఆరోగ్యం, విద్య, ఉపాధి లక్ష్యంగా నూతన ఒరవడితో ముందుకు వెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

TARAJYOTHI TELUGU DAILY
తారాజ్యోతి

# నేడు మంథనిలో ఉచిత మెగా వైద్య శిబిరం



**రామగిరి , మార్చి 20:-** ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా కిమ్స్ హాస్పిటల్స్ సహకారంతో శ్రీ సీతారామ సేవా సదన్, మంథని ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. స్థానిక శ్రీ సీతారామ సేవా సదన్ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని శ్రీ సీతారామ సేవా సదన్ అధ్యక్షులు కె వి ఎల్ ఎన్ హరిబాబు, ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల గణపతి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ప్రహ్లాద్, కోశాధికారి అంబ్రిష్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ శిబిరంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన హైదరాబాదులో నిపుణులైన డాక్టర్లు పాల్గొని రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేసి, అవసరమైన సలహాలు, సూచనలు అందించనున్నారు. ముఖ్యంగా డాక్టర్ బి. సాయి ఫణి చంద్ర (సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ ః హెడ్ -- రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్స్), డాక్టర్ శ్వేతా పెండ్యాల (సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ ః స్పైన్ సర్జన్), డాక్టర్ విశాల్ కుమార్ చిటీకేశి (సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్), డాక్టర్ నవ్యశ్రీ యనిగల్ల (కన్సల్టెంట్ పీడియాట్రిక్ హీమాటో ఆంకాలజిస్ట్ ః ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్), డాక్టర్ డిడ్డి హరిప్రకాష్ (సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ ః ఆర్థ్రోస్కోపిక్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్), డాక్టర్ రోషన్ కుమార్ జైస్వాల్ (కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ ః కాంప్లెక్స్ ట్రామా సర్జన్), డాక్టర్ నవ వికాస్ యు. కంటి అండ్ టీం (చీఫ్ సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్), డాక్టర్ గ. కిషోర్ గల్లా (కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్), డాక్టర్ శ్రీ వర్ధన్ జాస్తి (కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్), డాక్టర్ సాయి స్నేహిత వెలుగులేటి (కన్సల్టెంట్ యూరోగైనకాలజిస్ట్ ః లాపరోస్కోపిక్ సర్జన్) తదితరులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచిత మందుల పంపిణీ కూడా జరగనుంది. పలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ప్రత్యేక మార్గదర్శనం అందించనున్నారు. మంథని ప్రాంతవాసులు ఈ సదవకు ఆశయాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

# రోడ్డు, పైప్‌లైన్‌కు భవిష్యత్తులో ఎలాంటి నష్టం కలగకుండా చూడాలి

- కల్వచర్ల గ్రామంలో కొత్త రోడ్డు రక్షణపై కాంగ్రెస్ నాయకుల ఆందోళన
- కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రెండ్ల కృష్ణమూర్తి







**రామగిరి, మార్చి 20:-** రామగిరి మండలం, కల్వచర్ల గ్రామంలో ఇటీవల నిర్మించిన 18 ఫీట్ల వెడల్పు రోడ్డు రక్షణపై కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రెండ్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇట్టి విషయంపై రామగిరి మండల ఎంపిడిఓ, కల్వచర్ల గ్రామ సెక్రటరీ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ గ్రామ ప్రజల దీర్ఘకాలిక రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో సుమారు రూ. 2.6 కోట్ల వ్యయంతో ఈ రహదారి నిర్మాణం చేపట్టబడింది. ప్రస్తుతం అదే రోడ్డు పక్కన వాటర్ పైప్‌లైన్ పనుల నిమిత్తం తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఈ తవ్వకాల వల్ల కొత్తగా నిర్మించిన రోడ్డు దెబ్బతినే ప్రమాదం ఉందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో మరియు భారీ వాహనాల రాకపోకల సమయంలో రోడ్డు కుంగిపోవడం లేదా కూలిపోవడం వంటి ప్రమాదాలు తలెత్తే అవకాశముందని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పైప్‌లైన్ పనులను రోడ్డు నుండి కొంత దూరంగా మార్చి వేయాలని, అలాగే ఇప్పటికే తవ్విన ప్రాంతాలను సిమెంట్ కంకరతో బలంగా పూడ్చి రోడ్డును పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. రోడ్డు మరియు పైప్‌లైన్ రెండింటికీ భవిష్యత్తులో ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిచో ఇట్టి విషయాన్ని రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు కి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఒర్రె సదయ్య,వీరబోయిన రాజమౌళి, కోలిపాక సత్తయ్య, బూడిద రాజేందర్, గొట్టిముక్కల మల్లేష్ గౌడ్, ఆసం రాజు, జంగిలి సదానందం, మేకల మారుతి, మామిడి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తాం

- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్




**రామగిరి,మార్చ్ 20:-** పార్టీపరంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తామని నూతనంగా నియామకమైన పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం మంథని పట్టణం ప్రెస్ క్లబ్ లో ఆయన పాత్రికేయుల సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... డిసిసి అధికార ప్రతినిధిగా నియమించినందుకు తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు, పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మక్కన్ సింగ్ లకు రాజేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని ప్రజల్లోకి బలోపేతంకు చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేస్తారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కార్యకర్తల కోసం వారి సంక్షేమం కోసం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ప్రజల్ని సమన్వయపరచుకుంటూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రజల సహకారంతో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతామని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు సహకారంతో ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో అడవి సోమన్ పల్లి సర్పంచ్ గట్టు దామోదర్, ఐ ఎన్ టి యు సి నాయకులు పెరవేన లింగయ్య, నాయకులు వేల్పుల రాజు, టి. రాజు, ఎస్సీ సెల్ నాయకులు రాకేష్, మంథని శ్రీనివాస్, వార్డు సభ్యులు రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

# బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారించే అద్భుత పండు ఇది.. మహిళలు తప్పక తినాల్సిందే

మహిళల్లో అధికంగా వచ్చే అనారోగ్య సమస్యల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ముఖ్యమైనది. అయితే బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు తీసుకునే అనేకానేక చర్యల్లో ఆహారం ఒకటి. సరైన ఆహారం తింటే శరీరంలో క్యాన్సర్ కారకాలు ఉత్పత్తి కాకుండా నివారించవచ్చు. బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారించే ఆహారాల్లో పుచ్చకాయ ముఖ్యమైనది. ఇది రుచికి ఎంత కమ్మగా ఉంటుందో, దాని వల్ల చాలా ప్రయోజనాలు కూడా అంతే అధికంగా ఉన్నాయి. పుచ్చకాయలో 90 శాతం నీరు ఉంటుంది. కాబట్టి శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో ఈ పండు ప్రధాన పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా పుచ్చకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వివిధ వ్యాధులను దూరం చేస్తాయి పుచ్చకాయ క్యాన్సర్‌ను నివారించడంలో కూడా సహాయపడుతుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ (కణాలను నాశనం చేసే క్రియాశీల అణువులు) తొలగించడంలో సహాయపడతాయి. అందుకే పుచ్చకాయ వివిధ క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గిస్తుందని నిపుణులు అంటున్నారు. పుచ్చకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్-సి రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా ఇది ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడం ద్వారా క్యాన్సర్ నివారించడంలో సహాయపడుతుంది. ప్రత్యేకంగా ఇది రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పుచ్చకాయలో ఉండే లైసోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ సూర్యుని అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. ఫలితంగా పుచ్చకాయ సన్ టాన్ తొలగించడమే కాకుండా, చర్మ క్యాన్సర్‌ను కూడా నివారిస్తుంది. పుచ్చకాయలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. కాబట్టి ప్రతిరోజూ పుచ్చకాయ తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. దృష్టి మెరుగుపడుతుంది. అంతేకాకుండా ఈ సీజనల్ వివిధ రకాల ఇన్ఫెక్షన్ల నుంచి కళ్లను రక్షిస్తుంది. నీటి కంటెంట్‌తో పాటు, పుచ్చకాయలో తగినంత మొత్తంలో విటమిన్-బి6 ఉంటుంది. ఇది మెదడును ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. రోజూ పుచ్చకాయ తినడం వల్ల వేసవితాపం నుంచి కాపుడుకోవచ్చు. పుచ్చకాయలో ఎక్కువగా నీరు ఉంటుంది. కేలరీల కంటెంట్ చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి శరీర బరువును తగ్గించుకోవాలనుకుంటే, ప్రతిరోజూ మీ ఆహారంలో ఈ పండును తీసుకోవచ్చు.

# ఆలివ్ ఆయిల్‌తో అద్భుతాలు..! ఇలా వాడితే మధుమేహం పరార్..

మధుమేహం అనేది ఒక దీర్ఘకాలిక అనారోగ్య సమస్య. ఈ వ్యాధి ఒకసారి వస్తే ఎప్పటికీ నయం కాదు. ఎందుకంటే దీనిని పూర్తిగా నయం చేసే చికిత్స ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. చాపకింద నీరులా సోకే మధుమేహం రాకుండా ఉండాలంటే ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండటం అవసరం. రక్తంలో గ్లూకోజ్ పెరిగినప్పుడు మనిషికి మధుమేహం వస్తుంది. గ్లూకోజ్ మన శరీరానికి శక్తి ప్రధాన వనరుగా పరిగణిం చబడుతుంది. శరీరం గ్లూకోజ్‌ని తయారు చేయగలదు. ఇన్సులిన్ అనేది ప్యాంక్రియాస్ ఉత్పత్తి చేసే హార్మోన్. ఇది గ్లూకోజ్ కణాలలోకి ప్రవేశించడానికి సహాయపడుతుంది. మధుమేహం బాధితుల్లో శరీరం తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయదు..లేదంటే ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించదు. అటువంటి పరిస్థితిలో గ్లూకోజ్ రక్తంలో పేరుకుపోతుంది. కణాలకు చేరుకోలేకపోతుంది. మధుమేహం మొత్తం శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది మూత్రపిండాలు, నాడీ వ్యవస్థ, గుండె ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. మధుమేహాన్ని నియంత్రించడానికి, నిపుణులు ఆరోగ్యకరమైన జీవనశైలిని, మంచి ఆహారాన్ని సిఫార్సు చేస్తారు. మధుమేహాన్ని నియంత్రించడంలో ఆలివ్ ఆయిల్ ఎంత ప్రభావవంతంగా ఉంటుందో తెలుసుకుందాం మధుమేహాన్ని నియంత్రించడానికి ఆలివ్ ఆయిల్ ప్రయోజనాలు: ఆలివ్ ఆయిల్ రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయ పడుతుంది. ఇది డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. ముఖ్యంగా టైప్ 2డయాబెటిస్ రోగులకు ఇది అద్భుతంగా పనిచేస్తుంది. ఆలివ్ నూనెలో అనేక రకాల పోషకాలు ఉన్నాయి. ఆలివ్ ఆయిల్ యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలం. అధిక చక్కెర కారణంగా ఆక్సీకరణ ఒత్తిడి పెరుగుతుంది. అదే సమయంలో, యాంటీఆక్సిడెంట్లు దాని స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ఇదిడయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతే కాదు మధుమేహం వల్ల శరీరంలో చాలా సార్లు వాపు వస్తుంది. ఆలివ్ ఆయిల్ గుణాలు శరీరంలో మంటను తగ్గించి, సెల్ డ్యామేజ్‌ను నివారిస్తాయి. 1టేబుల్ స్పూన్ ఆలివ్ నూనెలో 14 గ్రాముల మొత్తం కొవ్వు ఉంటుంది. కానీ ఫైబర్, చక్కెర ఉండదు. ఇది విటమిన్లు మంచి మూలం.. గుండె జబ్బులతో సంబంధం ఉన్న చెడు కొలెస్ట్రాల్ మొత్తాన్ని తగ్గిస్తుంది. మీరు ఒక రోజులో ఎంత తింటారు అనేది ముఖ్యం. మీరు రోజుకు 3 నుండి 4 టీస్పూన్ల ఆలివ్ నూనెను మాత్రమే తీసుకోవాలి. ఆలివ్ ఆయిల్ ఇతర ప్రయోజనాలు..ఆలివ్ ఆయిల్ మంటను తగ్గిస్తుంది. ఆలివ్ నూనె ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. ఆలివ్ ఆయిల్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ఇది రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆలివ్ నూనె రక్తపోటును తగ్గిస్తుంది.

# సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన సర్పంచ్



**రామగిరి, మార్చి 20:-** మంథని మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ బొడ్డు రజిత- శ్రీనివాసులు శంకుస్థాపన చేశారు. గ్రామపంచాయతీ పరిధిలోని ఒకటవ వార్డులో సిద్ధం మల్లేష్ ఇంటి నుండి సిద్ధం లక్ష్మీ ఇంటి వరకు ఎన్ ఆర్ ఈజీఎస్ నిధులు ఐదు లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రజిత మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభ ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులను మంత్రి సహకారంతో చేపడుతామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పర్వతాలు యాదవ్, వార్డు సభ్యులు బండి లావణ్య శంకర్, గువ్వల రాజు, రాదండి దేవమ్మ రాజనర్సి, పంచిక దేవేందర్, గుడిమల్ల తిరుపతి, జంజర్ల శశికళ ప్రభు, బర్ల రజిత సురేందర్ ,గంట ప్రశాంత్, కార్యదర్శి ప్రేమలత తోపాటు గ్రామస్తులు సిద్ధం మల్లేష్, బాద్రపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ పాలకవర్గానికి సన్మానం



**రామగిరి,మార్చ్ 20:-** మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డిలను మంత్రపురి టాటా మ్యాజిక్ అసోసియేషన్ వారు ఘనంగా సన్మానించారు. శుక్రవారం మంథని పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టాటా మ్యాజిక్ యూనియన్ అసోసియేషన్ వారు నూతనంగా ఎన్నికైన మున్సిపల్ పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. అనంతరం అసోసియేషన్ కార్యాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ సహేందర్ రెడ్డిలకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు తీగల సమ్మయ్య, ఉపాధ్యక్షుడు సంజీవ్, ముఖ్య సలహాదారు తోటపల్లి రాజబాబు, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్, కోశాధికారి రౌతు రమేష్, ప్రచార కార్యదర్శి ఎండి లల్లు, అడ్డా ఆర్గనైజర్ బూడిద గట్టయ్య, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గుండెకు మేలు చేసే ఉల్లి కాడలు..

## రక్తప్రసరణ సజావుగా సాగాలంటే వీటిని తినాల్సిందే

ఉల్లిపాయలో అనేక సుగుగుణాలు ఉంటాయి. అందుకే ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదనే నానుడి ప్రజాజీవనంలో స్థిరపడి పోయింది. ఉల్లిపాయలే కాదు ఉల్లి కాడలు కూడా ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రతి మార్కెట్‌లో ఉల్లి కాడలు తక్కువ ధరకే లభ్యమవుతుంటాయి. ఉల్లి కాడలను ఇతర కూరగాయలతో కూడా జోడించి వంటలు చేయొచ్చు. ఆకర్షణీయంగా కనిపించడమేకాకుండా రుచి కూడా అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం..ఉల్లి కాడలు హృద్రోగులకు, వృద్ధులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఉల్లి కాడల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి గుండెకు ఎంతో మేలు చేస్తాయి. దీన్ని కూరలో వేసుకుని తింటే గుండె జబ్బులు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అలాగే ఉల్లి కాడల్లో ఉండే క్వెర్సెటిన్ అనే పదార్థం యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఈ యాంటీఆక్సిడెంట్ ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది. అలాగే గుండె జబ్బుల వంటి తీవ్రమైన సమస్యల నుంచి ఉపశమనం పొందుతుంది. ఇందులో విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, ఫైబర్ ధమనులను ఆరోగ్యంగా ఉంచి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి. ఉల్లి కాడలను తినడం వల్ల రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. అంటే, శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉంటే, దానిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో అధికంగా సల్ఫర్ ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీర నొప్పిని తగ్గిస్తాయి. నిత్యం ఉల్లి కాడలను ఆహారంలో భాగంగా తీసుకుంటే శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. ఇది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.


# అంత డేంజరా..? ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయ తింటే.. శరీరంలో ఏమవుతుందంటే..!



సమ్మర్ సీజన్ మొదలైంది. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10దాటిందంటే.. సూర్యుడు ప్రతాపం మొదలవుతుంది. ఇంట్లోంచి బయటకు అడుగు పెట్టామంటే.. చాలు ఉక్కపోత చెమట పట్టడం సహజం. బయటకు వెళ్లాక బట్టలన్నీ చెమటతో తడిసిపోతున్నాయి. మన శరీరం నుండి పోషకాలు కోల్పోవడమే దీనికి కారణం. అయితే దీన్ని బ్యాలెన్స్ చేసేందుకు చాలామంది వేసవిలో పుచ్చకాయ ఎక్కువగా తింటుంటారు. పుచ్చకాయలో లైకోపీన్, యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, అమినో యాసిడ్స్ అధికంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి కూడా ఈ పండు బాగా ఉపయోగపడుతుంది. ఇందులో క్యాలరీలు చాలా తక్కువ కాబట్టి, ఈ పండును తీసుకోవడం వల్ల మన పొట్ట ఎక్కువ సమయం నిండుగా ఉంటుంది. ఈ పండు వేసవిలో ఎండ వేడిమి నుండి మన శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. అలాగే ఇందులో 92శాతం నీరు ఉంటుంది. కాబట్టి ఇది మన శరీరానికి ఎక్కువ వాటర్ కంటెంట్ అందిస్తుంది. తాజా పుచ్చకాయలో సిట్రులిన్ అనే ముఖ్యమైన అమైనో ఆమ్లం ఉంటుంది. ఈ సిట్రులైన్ నైట్రిక్ ఆక్సైడ్ 6 ను ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా రక్తపోటు అదుపులో ఉంటుంది. పుచ్చకాయలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫలితంగా, పుచ్చకాయ శరీరంలో చక్కెర పరిమాణాన్ని నియంత్రిస్తుంది. డైటింగ్ చేసేవారికి కూడా పుచ్చకాయ చాలా మంచిది. కానీ కొందరు పుచ్చకాయను రిఫ్రిజిరేటర్ లో ఉంచి తింటారు. కానీ ఇలా చేయడం వల్ల పోషక విలువలు తగ్గుతాయని మీకు తెలుసా..సాధారణంగా కొంతమంది మార్కెట్ నుండి పండ్లను కొనుగోలు చేసి ఇంటికి తెచ్చిన తర్వాత వాటిని ఫ్రిజ్‌లో ఉంచుతారు. అయితే పండ్లను కోసి ఫ్రిజ్‌లో ఉంచే అలవాటు ఉంటే మాత్రం వెంటనే దానిని వదిలేయండి. ముఖ్యంగా పుచ్చకాయను ఫ్రిజ్‌లో పొరపాటున కూడా పెట్టకూడదు. పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం కంటే గది ఉష్ణోగ్రత వద్ద ఉంచడం మంచిదని పరిశోధనలు చెబుతున్నాయి. ఎంత ఎండలోనైనా పుచ్చకాయ చాలా చల్లగా ఉంటుంది. తినడానికి రుచికరమైనది. కానీ కట్ చేసిన పుచ్చకాయను ఫ్రిజ్ లో ఉంచితే ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉంది. సాధారణంగా కోసిన పుచ్చకాయపై బ్యాక్టీరియా పెరగడం ప్రారంభమవుతుంది. ఇది ఆరోగ్యానికి చాలా హానికరం.

# భారత్‌లో 2028 ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్

2028లో ప్రతిష్టాత్మక ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. పోలాండ్‌లోని టోరూన్ నగరంలో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 2028 సంవత్సరానికి గానూ ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ ఆతిథ్య హక్కులను భారత్‌కు అప్పగించామని వరల్డ్ అథ్లెటిక్స్ వైస్ ప్రెసిడెంట్ అదిల్లే సుమరివాలా ప్రకటించారు. ఈ ఏడాదికి గానూ ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ పోలాండ్ నగరంలో మార్చి 20-22 వరకు జరగనుంది. ఈ ఈవెంట్ ప్రారంభం కావడానికి ఒక రోజు ముందు జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్ 2028లో ప్రతిష్టాత్మక ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యం ఇచ్చే బాధ్యతకు భారత్‌కు అప్పగించింది. ఈ క్రమంలో ఈ మెగా ఈవెంట్ ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని కళింగ ఇండోర్ అథ్లెటిక్స్ స్టేడియంలో జరగనుంది. కాగా, 2028 ప్రపంచ ఇండోర్ ఛాంపియన్‌షిప్ కోసం తమ బిడ్‌ను ఈ ఏడాది ప్రారంభంలోనే భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) వేసింది. దీంతో ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్ నుంచి ఇద్దరు సభ్యుల బృందం ఈ ఏడాది జనవరిలో భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియం కాంప్లెక్స్‌లో ఉన్న అత్యాధునిక ఇండోర్ సదుపాయాన్ని పరిశీలించింది. ఈ క్రమంలో తాజా నిర్ణయం వెలువడింది.కాగా, 2028లో జరగబోయే ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ ఆతిథ్య హక్కులు భారత్‌కు దక్కడంపై ఏఎఫ్ఐ అధ్యక్షుడు బహదూర్ సింగ్ సగూ సంతోషం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై భారత అథ్లెటిక్స్ స్థాయి పెరుగుతోందనడానికి ఈ పరిణామం ఒక సూచిక అని పేర్కొన్నారు. "ప్రపంచ అథ్లెటిక్స్ 2028 ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌ను నిర్వహించే బాధ్యతను భారత్‌కు




అప్పగించింది. ఇది భారత అథ్లెటిక్స్ స్థాయి పెరుగుదలకు నిదర్శనం. ప్రముఖ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా వరుసగా ఒలింపిక్, ప్రపంచ పతకాలు గెలిచినప్పటి నుంచి భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది." అని బహదూర్ సింగ్ సగూ వెల్లడించారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ప్రతిష్టాత్మక ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి న్యూజిలాండ్ కూడా గతంలో ఆసక్తిని వ్యక్తం చేసింది. అయినప్పటికీ 2028లో ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించే అవకాశం భారత్‌కు దక్కింది. భారత్ పోటీలో ఉన్నందున ఆతిథ్య దేశాన్ని ఎంపిక చేసే నిర్ణయం తీసుకున్నప్పుడు తమను లోపలికి అనుమతించలేదన్నారు సాంకేతిక కమిటీ ఛైర్మన్, ఏఎఫ్ఐ మాజీ కార్యదర్శి రవీందర్ చౌదరి. ఆ తర్వాత ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని భారత్‌కు ఇచ్చినట్లు వరల్డ్ అథ్లెటిక్స్ కౌన్సిల్స్ ప్రకటించిందని తెలిపారు. ప్రపంచ ఇండోర్ ఛాంపియన్‌షిప్స్‌లో సాధారణంగా మూడు రోజుల పాటు 26 ఈవెంట్‌లు (పురుషులకు, మహిళలకు చెరో 13) జరుగుతాయి. పోలాండ్‌లో జరుగుతున్న ఈ ఎడిషన్‌లో 4ఇ400 మీటర్ల మిక్స్‌డ్ రిలేను మొదటిసారిగా నిర్వహిస్తున్నారు. ఆ 13 ఈవెంట్లలో 60 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1500మీటర్లు, 3000 మీటర్లు, 60 మీటర్లు హర్డిల్స్, 4ఇ400 మీటర్లు రిలే, హై జంప్, పోల్ వాల్ట్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్ పుట్, హెప్టాథ్లాన్ (మహిళలకు పెంటాథ్లాన్) ఉన్నాయి. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియం కాంప్లెక్స్‌లో 2024లో ప్రారంభమైంది. అక్కడి అత్యాధునిక ఇండోర్ ఫెసిలిటీలో 2028 ఏషియన్ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి భారత్ కూడా బిడ్ దాఖలు చేసింది. ఈ క్రమంలో ఏషియన్ అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు చెందిన ఇద్దరు సభ్యుల ప్రతినిధి బృందం ఈ ఏడాది కళింగ స్టేడియం కాంప్లెక్స్‌ను పరిశీలించింది. కాగా, భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలోని ఇండోర్ ఫెసిలిటీలో మార్చి 24-25 వరకు తొలి జాతీయ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు భారత్ ఆతిథ్యం ఇస్తోంది. ఈ ఇండోర్ అథ్లెటిక్స్ సెంటర్‌లో 200 మీటర్ల సింథటిక్ ట్రాక్, 80 మీటర్లు ప్లస్ 20 మీటర్ల రన్నింగ్ ట్రాక్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, పోల్ వాల్ట్, షాట్ పుట్ కోసం ప్రత్యేక ట్రాక్‌లు ఉన్నాయి. పూర్తికాల కోచింగ్ తీసుకుంటున్న వారి కోసం ఈ ఫెసిలిటీలో 60 ట్విన్ షేరింగ్ రూమ్స్ ఉన్నాయి. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలన్న దేశ ఆకాంక్షకు అనుగుణంగా, భారత్ అనేక ప్రతిష్టాత్మక ప్రపంచ అథ్లెటిక్స్ ఈవెంట్‌ల కోసం బిడ్లు దాఖలు చేసింది. అహ్మదాబాద్‌లో జరగనున్న 2028 ప్రపంచ అండర్-20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌తో పాటు 2031 ప్రపంచ (సీనియర్) అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ కోసం కూడా భారత్ బిడ్ దాఖలు చేయనుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ 2030లో జరగబోయే కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది.

## స్పోర్ట్స్



### కెప్టెన్లు మారుతున్నా మారని పంజాబ్, దిల్లీ రాత

పీఎల్ వచ్చిన తరువాత ప్రపంచ క్రికెట్?లో చాలా రాకల మార్పులు వచ్చాయి. అయితే ఈ 19ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో కొన్ని జట్లు కప్పుల మీద కప్పులు గెలుస్తుంటే, మరికొన్ని జట్లు మాత్రం ఇంకా 'ఈసారి కప్పు కొట్టాలి' అనే నినాదంతోనే సరిపెట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పంజాబ్ కింగ్స్ , దిల్లీ క్యాపిటల్స్ జట్లు ఈ జాబితాలో ముందు వరుసలో ఉంటాయి. ఈ రెండు జట్లలో ఆటగాళ్లు మారుతున్నారు, కోచ్‌లు మారుతున్నారు, అన్నింటికంటే ముఖ్యంగా కెప్టెన్లు రికార్డు స్థాయిలో మారుతున్నారు. కానీ, ఆఖరి మెట్టు మీద మాత్రం ఈ జట్లు బోల్తా పడుతూనే ఉన్నాయి. ఐపీఎల్?లో సక్సెస్ ఫుల్ టీమ్స్ అయిన సీఎస్కే, ముంబయి జట్లను గమనిస్తే వాటిలో కెప్టెన్సీ విషయంలో ఒక స్పష్టమైన నిలకడ కనిపిస్తుంది. కానీ పంజాబ్ కింగ్స్, దిల్లీ క్యాపిటల్స్ జట్లు దీనికి పూర్తి విరుద్ధం. గడిచిన 19 సీజన్లలో పంజాబ్ కింగ్స్ ఏకంగా 17 సార్లు కెప్టెన్సీలో మార్పులు చేసింది. ఐపీఎల్?లో అత్యధిక సార్లు కెప్టెన్లను మార్చిన జట్టుగా పంజాబ్ నిలిచింది. మరోవైపు దిల్లీ కూడా దాదాపు 13 మంది సారథులను మారుస్తూ ప్రయోగాలు చేసింది.పంజాబ్ జట్టులోకి వచ్చిన కెప్టెన్ల జాబితా చూస్తే అంతా హేమాహేమీలే కనిపిస్తారు. యువరాజ్ సింగ్?తో మొదలైన ఈ ప్రస్థానం కుమార్ సంగక్కర, మహేల జయవర్ధనే, ఆడమ్ గిల్‌క్రిస్ట్, జార్జ్ బెయిలీ, గ్లెన్ మాక్స్‌వెల్, రవిచంద్రన్ అశ్విన్, కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, శిఖర్ ధావన్, శ్రేయస్ అయ్యర్ వరకు చేరుకుంది. వీరితో పాటు మధ్యలో పలువురు కెప్టెన్లు కూడా బాధ్యతలు చేపట్టారు. ఇంతమంది దిగ్గజాలు జట్టును నడిపించినా, లాంగ్ రన్?లో జట్టును నిలకడగా విజయ తీరాలకు చేర్చడంలో మాత్రం యాజమాన్యం విఫలమవుతూనే వచ్చింది. పంజాబ్ కింగ్స్ చరిత్రలో చెప్పుకోదగ్గ సీజన్లు 3 మాత్రమే ఉన్నాయి. 2008లో జరిగిన తొలి ఐపీఎల్ సీజన్?లో యువరాజ్ సింగ్ సారథ్యంలో ఆ జట్టు సెమీఫైనల్ కు చేరి ఆశలు రేకెత్తించింది. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయి ప్రదర్శన 2014లో కనిపించింది. జార్జ్ బెయిలీ కెప్టెన్సీలో మాక్స్‌వెల్, మిల్లర్, సెహ్వాగ్ వంటి స్టార్ ఆటగాళ్లతో కూడిన పంజాబ్ జట్టు ఫైనల్ వరకు వెళ్లి రన్నరప్?గా నిలిచింది. ఇక గత ఏడాది సీజన్?లో ఫైనల్ వరకు వెళ్లి ఆర్సీబీ చేతిలో ఓటమి చెందింది. శ్రేయస్ అయ్యర్ రాకతో జట్టులో కొంత కాన్ఫిడెన్స్ పెరిగింది. ఈ 3 సీజన్లు మినహాయిస్తే పంజాబ్ ప్రదర్శన ఎప్పుడూ అభిమానులకు నిరాశనే మిగిల్చింది.దిల్లీ క్యాపిటల్స్ (గతంలో దిల్లీ డేర్‌డెవిల్స్) కూడా కెప్టెన్ల మార్పులలో పంజాబ్?కు తక్కువేమీ కాదు. వీరేంద్ర సెహ్వాగ్?తో మొదలుపెట్టి గౌతమ్ గంభీర్, దినేష్ కార్తీక్, కెవిన్ పీటర్సన్, జేపీ డుమిని, జహీర్ ఖాన్, కరుణ్ నాయర్, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, డేవిడ్ వార్నర్ వంటి ఎందరో ఆటగాళ్లు ఈ జట్టుకు నాయకత్వం వహించారు. అయితే ఒక కెప్టెన్?కు జట్టును నిర్మించుకోవడానికి తగినంత సమయం ఇవ్వకుండానే మార్పులు చేయడంతో దిల్లీ జట్టు ఎప్పుడూ కొత్త ప్రయోగాలకే పరిమితమైంది.కెప్టెన్లు మార్పులు ఎక్కువగా ఉన్నా, దిల్లీ జట్టు అప్పుడప్పుడు మెరుపులు మెరిపించింది. 2008, 2009 సీజన్లలో సెహ్వాగ్ సారథ్యంలో వరుసగా సెమీఫైనల్స్?కు చేరిన దిల్లీ, 2012లో జయవర్ధనే నేతృత్వంలో ప్లేఆఫ్స్?కు అర్హత సాధించింది. ఇక శ్రేయస్ అయ్యర్ కెప్టెన్?గా ఉన్నప్పుడు కూడా దిల్లీ దశ మారింది. 2019లో ప్లేఆఫ్స్, 2020లో ఫైనల్?కు చేర్చి జట్టును బలంగా నిలిపాడు. ఆ తర్వాత 2021లో రిషబ్ పంత్ సారథ్యంలోనూ జట్టు ప్లేఆఫ్స్ కు చేరింది. కానీ ఆ తరువాత ఈ జట్టు మేనేజ్మెంట్ శ్రేయస్ అయ్యర్, పంత్? ఇద్దరిని వదిలేసుకోవడం అతిపెద్ద పొరపాటు. అయితే పంజాబ్?తో పోలిస్తే దిల్లీకి సక్సెస్ రేటు కొంచెం ఎక్కువే ఉన్నా, ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షగానే మిగిలింది.నిజానికి కెప్టెన్లను మార్చడం అనేది కేవలం పైకి కనిపించే సమస్య మాత్రమే. అసలు లోపం బలమైన టీమ్?ను నిర్మించుకోలేకపోవడం లోనే ఉంది. పంజాబ్ జట్టు ప్రతి వేలంలో దాదాపు జట్టును మార్చేస్తూ జట్టులో నిలకడ లేకుండా చేస్తోంది. దిల్లీలో స్టార్ ఆటగాళ్లు ఆడినా, వాళ్లను ఎక్కువ సీజన్లలో ఫ్రాంఛైజీలో కొనసాగించలేదు. సీఎస్కే, ముంబయి జట్లు అలా కాదు. తమ స్టార్ ఆటగాళ్లను దాదాపు కొనసాగించే ప్రయత్నమే చేస్తాయి. అదే వారి సక్సెస్ సీక్రెట్. నాయకత్వం ఒక్కటే మ్యాచ్?లను గెలిపించదు, ఆ నాయకుడికి అండగా నిలిచే బలమైన ఆటగాళ్లు లేకపోవడమే ఈ రెండు జట్లకు శాపంగా మారింది. ఐపీఎల్ 2026 సీజన్?లో పంజాబ్ కింగ్స్, దిల్లీ క్యాపిటల్స్ బలంగానే బరిలోకి దిగుతున్నాయి. పంజాబ్ కింగ్స్ జట్టును శ్రేయస్ మళ్లీ అయ్యర్ నడిపించనుండగా, రిక్కీ పాంటింగ్ కోచ్?గా వ్యవహరిస్తున్నారు.



## మ్యాచ్ విన్నర్లను తయారు చేస్తున్నారు: కైఫ్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) సపోర్ట్ స్టాఫ్‌పై ఆ జట్టు మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఆర్సీబీలో కొత్త శకం మొదలైందని, అక్కడ ఆటగాళ్లను కాకుండా మ్యాచ్ విన్నర్లను తయారు చేస్తున్నారని తెలిపాడు. జట్టులోని ప్రతి ఆటగాడితో ఫలితాన్ని రాబడుతున్నారని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా మార్చి 28(శనివారం) ఈ మ్యాచ్ జరగనుంది. అప్‌కమింగ్ సీజన్ నేపథ్యంలో తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మహమ్మద్ కైఫ్ ఆర్సీబీ జట్టును విశ్లేషించాడు. రూ.7 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వెంకటేశ్ అయ్యర్‌ను ఏ స్థానంలో ఆడిస్తారో అర్థం కావడం లేదని, అతని కోసం దేవదత్ పడిక్కల్‌ను పక్కనపెడుతారా? అనేది చూడాలన్నాడు. 'బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం పిచ్.. బంతి బ్యాట్ మీదకు వచ్చేలా ఆడేవారికి, షాట్ మేకింగ్‌ను ఇష్టపడేవారికి, ఫాస్ట్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే బ్యాటర్లకు బాగా సహకరిస్తుంది. వెంకటేష్ అయ్యర్ వేగంగా వచ్చే బంతులను ఆడేందుకు ఇష్టపడతాడు. ప్రస్తుతం ఆర్సీబీ తుది జట్టులో తీవ్రమైన పోటీ ఉంది. వెంకటేష్ అయ్యర్‌ను ఏ స్థానంలో ఆడిస్తారో నాకు తెలియదు. గత సీజన్‌లో దేవదత్ పడిక్కల్ చాలా బాగా రాణించాడు. పడిక్కల్, రజత్ పాటిదార్, విరాట్ కోహ్లీతో పాటు కోచ్‌ల గురించి మాట్లాడితే.. వారు జట్టులో ఒక అద్భుతమైన వాతావరణాన్ని సృష్టించారు. టీమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్ వంటి ఆటగాళ్లకు నిర్దిష్టమైన పాత్రలను అప్పగించారు. వారు కూడా మేనేజ్‌మెంట్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ.. తమ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చారు. ఆర్సీబీ కోచ్‌లు ఇప్పుడు కొత్త ఆటగాళ్లను తయారు చేస్తున్నారు. అదే ఆ జట్టులో కనిపిస్తున్న ప్రధాన మార్పు. ప్రధాన బౌలర్ హజెల్ వుడ్ అందుబాటులో లేకపోవడం వల్ల ఆరంభంలో ఆర్సీబీ కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. కానీ ప్రస్తుత కోచింగ్ స్టాఫ్ ఎవరిని జట్టులోకి తీసుకువచ్చినా వారి నుంచి ఆశించిన ఫలితాన్ని రాబడుతున్నారు. గత సీజన్‌లో ఆరు, ఏడు సార్లు ప్రత్యర్థి జట్లను 150 పరుగుల లోపే కట్టడి చేశారు. ఇలా గతంలో ఎన్నడూ జరగలేదు. సుయాష్ వంటి ఆటగాడికి పెద్దగా అనుభవం లేకపోయినా.. అతని నుంచి మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలు రాబట్టారు. కృనాల్ పాండ్యా తన బౌలింగ్‌తో మ్యాచ్‌లు గెలిపించాడు. రీప్లేస్‌మెంట్‌గా ఎవరు వచ్చినా వారి నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబడుతున్నారు. ఆటగాళ్లు తమ సామర్థ్యానికి మించి రాణించేలా ఆర్సీబీ కోచ్‌లు ప్రోత్సహిస్తున్నారు.ఆర్సీబీ ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగాల్సి ఉంటుంది. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌ను ఆడించాలనుకుంటే ఒక పేసర్‌ను వదులుకోవాల్సి వస్తుంది.

## 2027 ప్రపంచకప్‌నకు బీసీసీఐ భారీ ప్రణాళికలు

### జట్టు ఎంపిక, ఆటగాళ్ల ఫిట్‌నెస్, ఐపీఎల్ ప్రదర్శనపై నిఘా

### 20 మందితో జాబితా సిద్ధంచేసిన బీసీసీఐ అధికారులు


2027 వన్డే వరల్డ్ కప్‌నకు ఇంకా ఏడాదిపైగానే సమయం ఉన్నప్పటికీ, బీసీసీఐ ముందుగానే జట్టు రూపకల్పనపై దృష్టి పెట్టింది. గత ఐసీసీ టోర్నీల్లో విజయాలు సాధించిన భారత జట్టు, ఈసారి కూడా ట్రోఫీపై కన్నేసింది.ఇటీవల భారత వన్డే, టెస్ట్ జట్లకు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహిస్తున్నాడు. అయితే అతని కెప్టెన్సీలో జట్టు ప్రదర్శన మిశ్రమంగా ఉంది. ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్ కోల్పోవడం, స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో ఓటమి ఎదురవడం బీసీసీఐ ఆలోచనలను ప్రభావితం చేసింది.బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఐపీఎల్ 2026 మ్యాచ్‌లను జాగ్రత్తగా పరిశీలించనుంది. ప్రతి సెలెక్టర్ వారానికి కనీసం ఒక మ్యాచ్‌ను ప్రత్యక్షంగా లేదా టీవీ ద్వారా వీక్షిస్తూ ఆటగాళ్ల ఫామ్, ఫిట్‌నెస్‌ను అంచనా వేయనున్నారు.అజిత్ అగార్కర్ నేతృత్వంలోని ఈ కమిటీ వరల్డ్ కప్‌నకు సరైన జట్టును ఎంపిక చేయడంలో కీలక పాత్ర పోషించనుంది.వరల్డ్ కప్ కోసం బీసీసీఐ సుమారు 20 మంది ఆటగాళ్ల జాబితాను సిద్ధం చేయాలని భావిస్తోంది. ఇందులో శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, కేఎల్ రాహుల్ వంటి కీలక ఆటగాళ్లు ప్రధానంగా ఉంటారు.కొత్త ఆటగాళ్లను ఎక్కువగా ప్రయోగించకుండా, స్థిరమైన జట్టుతో ముందుకు వెళ్లాలనే ఆలోచన ఉంది.టెస్ట్ క్రికెట్‌లో ప్రయోగాలకు బీసీసీఐ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి బౌలర్లు ప్రధాన ఎంపికగా కొనసాగనున్నారు. ఆఫ్ఘానిస్థాన్‌తో జరిగే టెస్ట్ మ్యాచ్‌లో కూడా వీరే కీలకంగా ఉండనున్నారు.టెస్ట్, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే ఆడుతున్నారు. ఇటీవలి సిరీస్‌ల్లో వీరి ప్రదర్శన స్థిరంగా ఉండటం గమనార్హం. అయితే ప్రతి మ్యాచ్ వీరి కెరీర్‌కు కీలకంగా మారుతోంది. వరల్డ్ కప్ జట్టులో వీరికి స్థానం దక్కుతుందా అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది.భారత జట్టు ఈ ఏడాది జూన్‌లో ఆఫ్ఘానిస్థాన్‌తో ఒక టెస్ట్, మూడు వన్డే మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్ కూడా వరల్డ్ కప్ జట్టు ఎంపికపై ప్రభావం చూపే అవకాశం ఉంది. బీసీసీఐ ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేస్తుండటం భారత జట్టు సీరియస్‌నెస్‌ను చూపిస్తోంది. అనుభవం, యువత కలయికతో 2027 వరల్డ్ కప్‌కు బలమైన జట్టు సిద్ధం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## వన్డే వరల్డ్ కప్ రేసు నుంచి వెస్టిండీస్ ఔట్ !

ఇటీవల టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ మెగా టోర్నీ ముగిసిన వెంటనే వన్డే క్రికెట్ సందడి మొదలైంది. బంగ్లాదేశ్ వేదికగా పాకిస్తాన్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో బంగ్లా పులులు అద్భుత ప్రదర్శన చేశాయి. నిర్ణయాత్మకమైన చివరి వన్డేలో 11 పరుగుల తేడాతో విజయం సాధించి, సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకున్నాయి. ఈ గెలుపు బంగ్లాదేశ్ ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా, 2027 వరల్డ్ కప్ క్వాలిఫికేషన్ రేసులో ఆ జట్టును ముందు వరుసలో నిలబెట్టింది.బంగ్లాదేశ్ సాధించిన ఈ విజయంతో ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. తాజా ర్యాంకింగ్స్ ప్రకారం, బంగ్లాదేశ్ 10వ స్థానం నుంచి 9వ స్థానానికి ఎగబాకగా, వెస్టిండీస్ జట్టు 9 నుంచి 10వ స్థానానికి పడిపోయింది. 2027 వన్డే ప్రపంచకనప్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే ఆతిథ్యం ఇస్తున్నాయి. ఆతిథ్య దేశాలుగా ఈ రెండు జట్లు నేరుగా అర్హత సాధించగా, మిగిలిన ఎనిమిది జట్లు ర్యాంకింగ్స్ ఆధారంగానే ప్రవేశిస్తాయి.వెస్టిండీస్ జట్టు 2027 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించాలంటే టాప్-10లో కొనసాగడం తప్పనిసరి. కానీ, ప్రస్తుతం బంగ్లాదేశ్ జోరు చూస్తుంటే కరేబియన్ జట్టుకు కష్టాలు తప్పేలా లేవు. రాబోయే వన్డే మ్యాచుల్లో వెస్టిండీస్ ఓడిపోతే, ఆ జట్టు క్వాలిఫికేషన్ రేసు నుంచి పూర్తిగా తప్పుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే గత వన్డే వరల్డ్ కప్‌నకు అర్హత సాధించలేకపోయిన వెస్టిండీస్, మరోసారి అటువంటి చేదు అనుభవాన్ని ఎదుర్కోవాల్సి రావడం ఆ జట్టు అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది.మరోవైపు, గత వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయిన భారత్, ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ టైటిల్ చేజార్చుకోకూడదని పట్టుదలగా ఉంది. సౌత్ ఆఫ్రికా గడ్డపై జరగనున్న ఈ మెగా టోర్నీ కోసం టీమిండియా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికలతో సిద్ధమవుతోంది. మొత్తానికి 2027 వన్డే వరల్డ్ కప్ క్వాలిఫికేషన్ పోరు రసవత్తరంగా మారింది.

## దిల్లీ క్యాపిటల్స్‌కు బ్రేక్ ఇవ్వనున్న మిచెల్ స్టార్క్

క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ 2026 రసవత్తర పోరుకు సమయం దగ్గరపడింది. మార్చి 28 నుంచి పండగ మొదలుకావాల్సి ఉండగా, టోర్నీ ప్రారంభానికి ముందే పలు జట్లకు ఊహించని షాకులు తగులుతున్నాయి. తమ జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషిస్తారని భావించిన స్టార్ ప్లేయర్లు గాయాల బారిన పడి దూరం కావడం అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్, దిల్లీ క్యాపిటల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ వంటి జట్లు తమ ప్రధాన అస్త్రాలను కోల్పోయి ఇప్పుడు ప్రత్యామ్నాయాల వేటలో పడ్డాయి. సీజన్ ఆరంభానికి ముందే ఐపీఎల్ గ్లామర్‌ను తగ్గించేలా వరుసగా ఆటగాళ్లు తప్పుకుంటున్న ఈ పరిణామాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. రాజస్థాన్ రాయల్స్ జట్టుకు సీజన్ మొదలవ్వక ముందే భారీ ఎదురుదెబ్బ తగిలింది. చెన్నై సూపర్ కింగ్స్ నుంచి ట్రేడ్ ద్వారా రాజస్థాన్?లోకి వచ్చిన ఇంగ్లాండ్ స్టార్ ఆల్ రౌండర్ సామ్ కరన్ గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యే అవకాశం ఉంది. మార్చి 5న భారత్ తో జరిగిన టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ తర్వాత ఆయన ఎటువంటి మ్యాచ్ ఆడలేదు. కరన్ లేకపోవడం వల్ల ఆల్ రౌండర్ల విభాగంలో రాజస్థాన్ బలహీనపడనుంది. ప్రస్తుతం ఆ జట్టులో రవీంద్ర జడేజా, డోనోవన్ ఫెరీరా వంటి ఆల్ రౌండర్లు ఉన్నప్పటికీ, కరన్ స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడి కోసం రాయల్స్ తీవ్రంగా అన్వేషిస్తోంది. ఈసారి రాజస్థాన్ రాయల్స్ జట్టుకు సరికొత్త సారథి రాబోతున్నాడు. యువ ఆటగాడు రియాన్ పరాగ్ 2026 సీజన్ లో రాజస్థాన్ జట్టును నడిపించనున్నాడు. మార్చి 30న గౌహతి వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే పోరుతో రాజస్థాన్ తన ఆటను ప్రారంభించనుంది. ఆ




తర్వాత ఏప్రిల్ 4న అహ్మదాబాద్‌లో గుజరాత్‌తో, ఏప్రిల్ 7, 10 తేదీల్లో గౌహతిలోనే ముంబై, బెంగళూరు జట్లతో తలపడనుంది. సామ్ కరన్ లేని లోటును రియాన్ పరాగ్ తన కెప్టెన్సీలో ఎలా అధిగమిస్తాడో చూడాలి. దిల్లీ క్యాపిటల్స్ జట్టు కూడా తన ప్రధాన పేసర్ మిచెల్ స్టార్క్ సేవలను ఆరంభ మ్యాచుల్లో కోల్పోనుంది. గతేడాది వేలంలో రూ. 11.75 కోట్లకు దిల్లీ సొంతం చేసుకున్న ఈ ఆసీస్ స్పీడ్ గన్, టోర్నీ మొదట్లో అందుబాటులో ఉండడు. రాబోయే అంతర్జాతీయ షెడ్యూల్ దృష్టిలో ఉంచుకుని స్టార్క్ కు విశ్రాంతి అవసరమని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. పవర్ ప్లే ఓవర్లలో వికెట్లు తీయడంలో దిట్ట అయిన స్టార్క్ లేకపోవడం వల్ల దిల్లీ బౌలింగ్ విభాగంలో పట్టు కోల్పోయే ప్రమాదం ఉంది. ఆయన మళ్లీ ఎప్పుడు జట్టులో చేరుతాడనేది రాబోయే వారాల్లో రిటర్న్ టు ప్లే ప్రోటోకాల్స్ బట్టి తెలుస్తుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు పరిస్థితి కూడా ఏమీ బాగోలేదు. ఆ జట్టు ఆల్ రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ పాదానికి గాయం కావడంతో ఐపీఎల్ 2026 నుంచి పూర్తిగా తప్పుకున్నాడు. రూ. 3 కోట్లకు కొనుగోలు చేసిన ఎడ్వర్డ్స్, తన ఐపీఎల్ అరంగేట్రం కోసం ఇంకా వేచి చూడాల్సిందే. బిగ్ బాష్ లీగ్?లో 19 వికెట్లు తీసి మంచి ఫామ్?లో ఉన్న ఎడ్వర్డ్స్ దూరం కావడం ఎస్ఆర్‌హెచ్?కు పెద్ద లోటే. ఇప్పటికే కమిన్స్ గాయం వల్ల ఆందోళనలో ఉన్న హైదరాబాద్ కు ఇది అదనపు భారం. సన్ రైజర్స్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ వెన్నునొప్పి కారణంగా సీజన్ ఆరంభ మ్యాచులకు దూరం కావడంతో, ఇషాన్ కిషన్ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. కమిన్స్ కోలుకునే వరకు ఇషాన్ నాయకత్వంలోనే హైదరాబాద్ బరిలోకి దిగనుంది. మార్చి 28న బెంగళూరులో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీతో జరిగే తొలి మ్యాచ్ లోనే ఇషాన్ తన కెప్టెన్సీ సత్తాను నిరూపించుకోవాల్సి ఉంది. కొత్త కెప్టెన్, కీలక బౌలర్ల గైర్హాజరీలో సన్ రైజర్స్ ప్రయాణం ఎలా సాగుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది. కేవలం స్టార్క్, కమిన్స్ మాత్రమే కాకుండా జోష్ హేజిల్‌వుడ్, నాథన్ ఎల్లిస్ వంటి ఇతర ఆస్ట్రేలియా పేసర్లు కూడా గాయాల కారణంగా ఆరంభ మ్యాచులకు దూరం కానున్నారు. హేజిల్‌వుడ్ ఆర్సీబీకి, కమిన్స్ ఎస్ఆర్‌హెచ్‌కి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆస్ట్రేలియా ప్రధాన పేసర్లందరూ ఒకేసారి గాయాల బారిన పడటం, విశ్రాంతి తీసుకోవడం వల్ల ఆయా జట్ల బౌలింగ్ విభాగాలు బలహీనమయ్యాయి. ఈ కీలక బౌలర్లు లేని సమయంలో దేశీయ బౌలర్లు ఎంతవరకు రాణిస్తారో చూడాలి.

# విశ్వ్వజి



## స్నానంతోనే సంరక్షణ

చలికాలం.. చర్మానికి గడ్డుకాలం. చల్లని గాలులతో చర్మ ఆరోగ్యం పాడవుతుంది. చర్మాన్ని సంరక్షించుకోవడం కూడా.. కష్టంగా మారుతుంది. అందుకే, స్నానం చేసే సమయంలో కొన్ని చిట్కాలు పాటిస్తే.. శీతాకాలంలోనూ చర్మం మెరిసిపోతుంది. చలికాలం అనగానే అందరూ వేడినీటి స్నానానికే మొగ్గు చూపుతారు. కానీ, వేడినీళ్లు చర్మానికి హాని కలిగిస్తాయి. శరీరంలోని తేమను తొలగిస్తాయి. కాబట్టి, గోరు వెచ్చని నీటితోనే స్నానం చేయండి. అది కూడా 10 నిమిషాలకు మించకుండా చూసుకోండి. స్నానపు నీటిలో కొద్దిగా తేనె లేదా కొబ్బరి నూనె లాంటి హైడ్రేటింగ్ పదార్థాలను కలపడం ద్వారా.. తేమ త్వరగా కోల్పోకుండా ఉంటుంది. ఇక స్నానానికి సబ్బులకు బదులుగా బాడీ వాష్‌లను ఎంచుకోవడం మంచిది. ఎందుకంటే, సబ్బును ఎంత ఎక్కువగా ఉపయోగిస్తే.. చర్మం అంతగా పొడిబారుతుంది. అదే సమయంలో.. బాడీ వాష్‌లు చర్మానికి తేమను అందించే గుణాన్ని కలిగి ఉంటాయి. ఇక, బాత్ స్క్రబర్‌లు, బాడీ బ్రష్‌లు కూడా చర్మానికి హాని కలిగిస్తాయి. వాటిని పక్కన పెట్టేయాల్సిందే! తలస్నానం తర్వాత జుట్టుకు కండిషన్ అప్లయి చేయండి. ఇతర కాలాలతో పోలిస్తే.. చలికాలంలో జుట్టు పొడిగా మారుతుంది. కాబట్టి, షాంపూ తర్వాత కండిషనర్ వాడండి. స్నానం పూర్తయిన వెంటనే.. బాడీ మొత్తం మాయిశ్చరైజ్ చేసుకోవాలి. చర్మం తడిగా ఉన్నప్పుడే మాయిశ్చరైజర్‌ను అప్లయి చేస్తే.. తేమ ఎక్కువ సమయంపాటు నిలిచి ఉంటుంది. చర్మాన్ని చికాకు పెట్టే దుస్తులను దూరం పెట్టాలి. చాలామంది రాత్రిపూట ఉన్ని స్వెటర్‌లను డైరెక్టుగా వేసుకుంటారు. బదులుగా.. కాటన్ దుస్తులు ధరించి, వాటిపైన స్వెటర్ తొడుక్కోండి. ఎందుకంటే, ఉన్ని.. చర్మాన్ని చికాకు పెట్టడంతోపాటు పొడిగా మార్చే అవకాశం ఉంటుంది. ఇలాంటి చిట్కాలతో.. చలికాలంలోనూ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

## పెరుగులో కిస్మిస్‌లను వేసి నానబెట్టి తినండి..

### ఎన్నో అద్భుతమైన లాభాలు కలుగుతాయి..!

పెరుగును మనం రోజూ తింటూనే ఉంటాం. చాలా మందికి భోజనం చివర్లో పెరుగును తినకపోతే భోజనం చేసిన ఫీలింగ్ కలగదు. అందులో భాగంగానే పెరుగును ఇష్టంగా తింటుంటారు. ఇక కిస్మిస్‌లను కూడా మనం తరచూ వాడుతూనే ఉంటాం. వీటిని నేరుగా తింటారు లేదా స్వీట్ల తయారీలో ఉపయోగిస్తారు. అయితే పెరుగులో కిస్మిస్‌లను కలిపి కాసేపు నానబెట్టి ఆ తరువాత తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పెరుగు కిస్మిస్ మిశ్రమం అద్భుతమైన కాంబినేషన్‌గా పనిచేస్తుందని వారు అంటున్నారు. ఈ మిశ్రమంలో అనేక పోషకాలు ఉంటాయి. దీన్ని తరచూ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## జీడిపప్పుతో పాలను ఇలా తయారు చేసి రోజూ తాగండి..



### ఎన్నో లాభాలు కలుగుతాయి..!

జీడిపప్పును మనం తరచూ తింటూనే ఉంటాం. వీటిని తీపి పదార్థాల తయారీలో వాడుతారు. మసాలా వంటకాల్లోనూ జీడిపప్పును వేస్తుంటారు. దీని వల్ల వంటకాలకు చక్కని రంగు, రుచి వస్తాయి. జీడిపప్పును నేరుగా లేదా వేయించుకుని కూడా తినవచ్చు. ఎంతో రుచిగా ఉంటుంది. అయితే ఈ పప్పును తినడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. కనుక రోజూ ఈ పప్పును గుప్పెడు మోతాదులో తినాలని పోషకాహార నిపుణులు సూచిస్తుంటారు. అయితే జీడిపప్పును నేరుగా కాకుండా వీటితో పాలను తయారు చేసి కూడా తీసుకోవచ్చు. జీడిపప్పు పాలు కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. అనేక పోషకాలను అందిస్తాయి. జీడిపప్పు పాలను రోజూ ఒక కప్పు మోతాదులో ఉదయం తాగుతుంటే ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జీడిపప్పును రోజూ నేరుగా తినలేమని అనుకునేవారు వీటితో పాలను తయారు చేసి రోజూ తాగితే ఎంతో లాభం ఉంటుందని అంటున్నారు.

హైబీపీ ఉన్నవారికి..

జీడిపప్పుల్లో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. కనుక జీడిపప్పు పాలను రోజూ సేవిస్తుంటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీని వల్ల రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. జీడిపప్పులో మెగ్నిషియం, పొటాషియం అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి బీపీని నియంత్రిస్తాయి. కనుక ఈ పాలను రోజూ తాగుతుంటే హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

జీడిపప్పులో మెగ్నిషియం, కాపర్, విటమిన్ కె, క్యాల్షియం, విటమిన్ డి అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక ఈ పాలను రోజూ తాగుతుంటే ఎముకలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

కంటి ఆరోగ్యానికి.. జీడిపప్పులో లుటీన్, జియాజాంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కంటిలోని రెటీనాను రక్షిస్తాయి. దీని వల్ల కళ్లలోని కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో వృద్ధాప్యంలో కళ్లలో శుక్లాలు రాకుండా చూసుకోవచ్చు. కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. జీడిపప్పు పాలలో కాపర్ అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది మన శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల చర్మం సురక్షితంగా ఉంటుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. జీడిపప్పు పాలలో జింక్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీని వల్ల సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను తగ్గించుకోవచ్చు. జీడిపప్పు పాలలో అధికంగా ఉండే ఐరన్, కాపర్ ఎర్ర రక్త కణాలు వృద్ధి చెందేలా చేస్తాయి. దీంతో రక్తహీనత తగ్గుతుంది.

ఇలా తయారు చేయాలి..

ఇక జీడిపప్పు పాలను ఇంట్లోనే ఎంతో సులభంగా తయారు చేసుకోవచ్చు. బయట మార్కెట్‌లో లభించే జీడిపప్పు పాలను తాగాల్సిన పనిలేదు. జీడిపప్పు పాలను తయారు చేసేందుకు గాను 1 కప్పు జీడిపప్పు, 4 కప్పుల నీళ్లు, పప్పును నానబెట్టేందుకు మరి కొన్ని నీళ్లు, చిటికెడు సముద్రపు ఉప్పు, ఒక టీస్పూన్ తేనె (రుచి కోసం) తీసుకోవాలి. ముందుగా జీడిపప్పును నీటిలో వేసి రాత్రంతా నానబెట్టాలి. లేదా కనీసం 4 గంటలపాటు అయినా నానబెట్టాలి. తరువాత వాటిని తీసి 4 కప్పుల నీళ్లను పోసి అందులోనే ఉప్పు, తేనె వేసి కలిపి ఆ మిశ్రమాన్ని బ్లెండర్‌లో వేసి మెత్తగా పట్టుకోవాలి. దీంతో క్రీమ్ లాంటి మెత్తని పేస్ట్ లా ఉండే పాలు రెడీ అవుతాయి. అవసరం అనుకుంటే ఇంకొన్ని నీళ్లను కలుపుకోవచ్చు. ఇలా జీడిపప్పు పాలను తయారు చేసి గాలి చొరబడని సీసాలో నిల్వ చేసుకుంటే ఎప్పుడు కావాలంటే అప్పుడు ఈ పాలను తాగవచ్చు. ఈ పాలను ఉదయం బ్రేక్ ఫాస్ట్ అనంతరం సేవిస్తే ఎంతో ఫలితం ఉంటుంది. ఇలా జీడిపప్పు పాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## ఫైబర్ వల్ల మన శరీరానికి కలిగే ఉపయోగాలు ఏమిటి..?


### రోజుకు ఎంత ఫైబర్ అవసరం.. ఏమేం తినాలి..?

మనల్ని ఆరోగ్యంగా ఉంచేందుకు గాను అనేక రకాల పోషక పదార్థాలు సహాయం చేస్తాయి. వాటిల్ల ఫైబర్ కూడా ఒకటి. దీన్నే పీచు పదార్థం అని కూడా పిలుస్తారు. ఫైబర్ సాధారణంగా రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి సాల్యుబుల్ ఫైబర్ కాగా రెండోది ఇన్ సాల్యుబుల్ ఫైబర్. ఇవి రెండూ మనకు పలు ఆహారాల్లో లభిస్తాయి. సాల్యుబుల్ ఫైబర్ నీటిలో కరుగుతుంది. ఇది పండ్లు, బీన్స్, చిరు ధాన్యాలు, గింజలు, కూరగాయల్లో అధికంగా ఉంటుంది. అలాగే ఇన్ సాల్యుబుల్ ఫైబర్ అంత త్వరగా నీటిలో కరగదు. కాస్త సమయం పడుతుంది. ఈ రకం ఫైబర్ మనకు ఎక్కువగా పండ్లు, గింజలు, కూరగాయలు, తృణ ధాన్యాల ద్వారా లభిస్తుంది. అయితే ఈ రెండు రకాల ఫైబర్‌లు మనకు ఎంతో మేలు చేస్తాయి. ఫైబర్ ఉండే ఆహారాలను రోజూ తింటుండం వల్ల అనేక లాభాలు కలుగుతాయి.

ఫైబర్ వల్ల కలిగే లాభాలు..

ఫైబర్ వల్ల మనకు ఎంతో మేలు జరుగుతుంది. ఫైబర్ ఉండే ఆహారాలను తింటుంటే అధిక బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉంటుంది. జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం, మలబద్దకం, పొట్టలో అసౌకర్యం తగ్గుతాయి. కొలెస్ట్రాల్, బీపీ నియంత్రణలో ఉంటాయి. ఇలా ఫైబర్ మనకు ఎంతో మేలు చేస్తుంది. అధికంగా బరువు ఉన్నవారు రోజూ ఫైబర్ ఉండే ఆహారాలను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఫైబర్ వల్ల జీర్ణాశయం నిండుగా ఉన్న భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. కనుక ఫైబర్ ఉన్న ఆహారాలను తింటుండం వల్ల సులభంగా బరువును తగ్గించుకోవచ్చు.

షుగర్ ఉన్నవారికి, జీర్ణ వ్యవస్థకు..



ఫైబర్ ఉన్న ఆహారాలను రోజూ తింటే షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. దీని వల్ల షుగర్ అదుపులో ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. మధుమేహం ఉన్నవారు రోజూ ఫైబర్ ఉండే ఆహారాలను తింటుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. అదేవిధంగా ఫైబర్ వల్ల మన జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియా వృద్ధి చెంది ఆరోగ్యంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. దీని వల్ల ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. అలాగే గ్యాస్ ఏర్పడకుండా ఉంటుంది. ఫైబర్ ఉన్న ఆహారాలను తింటుంటే శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. దీని వల్ల గుండె పనితీరు మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

ఫైబర్ ఎంత అవసరం, ఏమేం తినాలి..?

సాధారణంగా ఫైబర్ నీటిలో కరుగుతుంది. కనుక ఇది మన శరీరంలో నిల్వ ఉండదు. కనుక ఫైబర్ ఉండే ఆహారాలను రోజూ కచ్చితంగా తినాల్సి ఉంటుంది. ఇక ఫైబర్ పురుషులకు అయితే రోజుకు 30 గ్రాములు, స్త్రీలకు 25 గ్రాముల వరకు అవసరం అవుతుంది. 2 నుంచి 5 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లలకు 15 గ్రాములు, 5 నుంచి 11 ఏళ్లు ఉన్నవారికి 20 గ్రాముల వరకు రోజూ ఫైబర్ కావాలి. ఫైబర్ ఎక్కువగా మనకు ఓట్స్, బార్లీ, యాపిల్ పండ్లు, సిట్రస్ జాతికి చెందిన నారింజ, నిమ్మ, గ్రేప్ ఫ్రూట్ పండ్లు, అరటి, పియర్స్, బెర్రీ పండ్లు, క్యారెట్లు, మొలకలు, చియా విత్తనాలు, అవిసె గింజలు, బ్రౌన్ రైస్, కినోవా, మొక్కజొన్న, బాదంపప్పు, వాల్ నట్స్, గుమ్మడి విత్తనాలు, కాలిఫ్లవర్, క్యాబేజీ, పచ్చి బఠానీ, కొత్తిమీర, పాలకూర, పుదీనా, తోటకూర, జామ పండ్లు, నల్ల శనగలు వంటి అనేక ఆహారాల్లో లభిస్తుంది. కనుక వీటిని రోజూ తింటుంటే ఫైబర్‌ను పొందవచ్చు. ఆరోగ్యంగా ఉండవచ్చు.

# మార్కెట్

## సెబీ కొత్త చీఫ్‌గా తుహిన్ కాంత పాండే నియామకం

%బజుదీ× ఎష్ట్రఅవట% ఎ స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' నూతన సారథిగా (%బజుదీ× ఎష్ట్రఅవట%) తుహిన్ కాంత పాండే (%బఝష్ట్రఅఅ ఖుఖ్ఖు ౹ఖుఅనవఎ%) నియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్థిక శాఖ కార్యదర్శిగా (%=వజవఅబవ ౹వవషతీమ్ఖుతీఎ%) పని చేస్తున్న ఆయనకు సెబీ చీఫ్ బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర నియామకాల కమిటీ గురువారం ఇందుకు ఆమోదం తెలిపింది. కాగా, ప్రస్తుతం సెబీ చీఫ్‌గా ఉన్న మాధాబీ పురీ బుచ్ (%మీఖఎస్త్రుఖఎఅ ౹బతీఅ దీబఎష్ట్ర%) మూడేళ్ల పదవీ కాలం నేటితో (ఫిబ్రవరి 28తో) ముగియనుంది. ఈ నేపథ్యంలో తుహిన్ కాంత పాండేను సెబీ కొత్త చీఫ్‌గా ప్రభుత్వం నియమించింది. తుహిన్ కాంత పాండే 1987 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ అధికారి. ఆయన గతంలో ఆర్థిక కార్యదర్శిగా, రెవెన్యూ కార్యదర్శిగా పనిచేశారు. ఎయిరిండియా ప్రైవేటీకరణలో పాండే కీలక పాత్ర పోషించారు. తుహిన్ కాంత పాండేకు ఫైనాన్స్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌లో విస్తృత అనుభవం ఉంది. రానున్న మూడేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు. ఇక ఇప్పటి వరకూ సెబీకి చీఫ్‌గా వ్యవహరించిన మాధబీ పూరీ బుచ్‌ను కేంద్రం 2022 ఫిబ్రవరి 28న నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆమె అదే ఏడాది మార్చి 2వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. సెబీకి ఓ మహిళ చైర్మన్‌గా నియామకం కావడం ఇదే తొలిసారి. మాధవి గతంలో ఐసీఐసీఐ సెక్యూరిటీస్ హెడ్‌గా సేవలందించారు. 2017 నుంచి 2021 మధ్య కాలంలో సెబీ పూర్తి స్థాయి మెంబర్‌గా పని చేశారు. సెబీ చీఫ్‌గా ఆమె పదవీ కాలం నేటితో ముగియనుంది.




## పారిశ్రామికానికి బ్రేక్.. మూడు నెలల కనిష్ఠానికి పడిపోయిన వృద్ధి

### సెప్టెంబర్‌లో 4 శాతానికి పరిమితం..

న్యూఢిల్లీ : పారిశ్రామిక రంగానికి మళ్లీ బ్రేకులుపడ్డాయి. గనులు, తయారీ రంగంలో నెలకొన్న స్తబ్దత కారణంగా గత నెలకుగాను పారిశ్రామిక రంగంలో వృద్ధి మూడు నెలల కనిష్ఠ స్థాయి 4 శాతానికి పడిపోయింది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 3.1 శాతంతో పోలిస్తే పెరిగినప్పటికీ వరుస నెలల్లో నమోదైన వృద్ధితో పోలిస్తే భారీగా పడిపోయింది. గత మూడు నెలల్లో ఇంత తక్కువగా వృద్ధిని నమోదు చేసుకోవడం ఇదే తొలిసారి. కేంద్ర గణాంకాల శాఖ మంగళవారం విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టంచేశాయి. గనులు రంగంలో వృద్ధి మైనస్ 0.4 శాతానికి పడిపోగా, తయారీ రంగం కాస్త పుంజుకున్నప్పటికీ మొత్తం పారిశ్రామిక ప్రగతిపై ప్రతికూల ప్రభావం చూపింది. అలాగే ఆగస్టు నెల పారిశ్రామిక గణాంకాలను 4 శాతం నుంచి 4.1 శాతానికి సవరించింది కేంద్ర ప్రభుత్వం. సెప్టెంబర్ నెలలో వెల్లడైన తాజా గణాంకాలు.. దేశీయ డిమాండ్ తగ్గడం, ప్రపంచ ఆర్థిక అనిశ్చిత పరిస్థితులతోపాటు, రంగాలకు సంబంధించిన సవాళ్ల మధ్య పారిశ్రామిక కార్యకలాపాల్లో నిస్తేజం నెలకొన్నదని పేర్కొంది. దేశీయ పారిశ్రామిక ప్రగతిలో 78 శాతం వాటా కలిగిన తయారీ రంగం 4.8 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. అలాగే ఆగస్టు నెలలో ఇది 3.8 శాతంగా ఉన్నది. గనుల రంగంలో వృద్ధి −0.4 శాతానికి పడిపోయింది. క్రితం ఏడాది ఇదే నెలలో 0.2 శాతంగావున్న వృద్ధి, ఈ ఏడాది ఆగస్టులో 6.6 శాతంగా నమోదైంది. ఆ మరుసటి నెలలో ప్రతికూలానికి పడిపోవడం విశేషం. దేశవ్యాప్తంగా ఆకాల వర్షాలు కురియడం వల్లనే వృద్ధి జారుకున్నదని కేంద్రం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. క్యాపిటల్ గూడ్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్/నిర్మాణ రంగ పరికరాలు, కన్స్యూమర్ డ్యూరబుల్ రంగాలు ఆశాజనక పనితీరు కనబరిచాయి. కానీ, ప్రైమరీ గూడ్స్, కన్స్యూమర్ నాన్-డ్యూరబుల్ మాత్రం ప్రతికూలానికి పడిపోయాయి.



తొలి ఆరు నెలల్లోనూ అంతే

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మసకబారిన పారిశ్రామిక ప్రగతి అటు రెండో త్రైమాసికంలోనూ అంతంత మాత్రంగానే నమోదు చేసుకున్నది. మొత్తంగా ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో పారిశ్రామిక వృద్ధి 3 శాతానికి పరిమితమైంది. 2024-25 ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో నమోదైన 4.1 శాతంతో పోలిస్తే భారీగా పడిపోయింది.

# ఆంధ్రప్రదేశ్

## కుటుంబ ఆస్తుల పంపకం జరగలేదు

**వైఎస్ ఉన్నంతవరకు ఆస్తులన్నీ ఉమ్మడివే**
**జగన్ ఇప్పటికైనా చెల్లికి, పిల్లలకు న్యాయం చేయాలి**
**వైఎస్ విజయమ్మ సంచలన ప్రకటన**

విజయవాడ,మార్చి 20 : కుటుంబ ఆస్తులపై దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి సతీమణి విజయలక్ష్మ కీలక వ్యాఖ్యలు చేశారు. 2009లో వైఎస్ఆర్ మరణం వరకున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని స్పష్టం చేశారు. ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగలేదని ఆమె క్లారిటీ ఇచ్చారు. అన్ని ఆస్తులను నలుగురు మనుమళ్లకు సమానంగా పంచాలనేదే వైఎస్ఆర్ ఉద్దేశమని, ఇది ఆయన ఆదేశం కూడా అని స్పష్టం చేశారు. తమ దగ్గరి వాళ్లందరికీ తెలిసిన వాస్తవమిదని విజయలక్ష్మి అన్నారు. ఎంఓయూలో వైఎస్.షర్మిలకు రాసిన ప్రతీ ఆస్తి న్యాయంగా ఆమెకు చెందాల్సినవేనని తెలిపారు. అందుకే వైసీపీ అధినేత, తన కుమారుడు జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ఎంఓయూ రాశారని ప్రస్తావించారు. నిజానికి తనకు తక్కువే రాశారని, సరస్వతి సిమెంట్‌తో సహా ఎంఓయూలో లేని యెలహంక ల్యాండ్ కూడా షర్మిలదేనని చెప్పుకొచ్చారు. జగన్ ఇచ్చానని చెబుతున్న నగదు షర్మిల వాటాకు ఇచ్చిన డెవిడెండ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఆస్తుల విషయంలో జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశారని చెప్పుకొచ్చారు. ఎప్పటికైనా తనకు న్యాయం చేస్తారని జగన్ తల్లిగా ఆశిస్తున్నానని అన్నారు. ఇప్పటి వరకూ ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగలేదని విజయలక్ష్మి క్లారిటీ ఇచ్చారు. ఇప్పుడు చదువుతున్న షర్మిల ఆస్తుల లాంటివి వైఎస్సార్ జగన్‌కు కూడా ఇచ్చారని తెలిపారు. అది ఆస్తి పంపకం కాదని అన్నారు. నిజమేమిటో దేవుడికి, తన కొడుక్కి మాత్రమే తెలుసని చెప్పుకొచ్చారు. తమ ఆస్తులపై గోబెల్స్ ప్రచారం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. మీరు ఎంత కాదన్నా దేవుడే న్యాయం చేస్తారని తెలిపారు. తమ ఆస్తులపై అసత్యాల ప్రచారం మానుకోవాలని వైఎస్ఆర్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నానని అన్నారు. మళ్లీ మళ్లీ మీడియాలో ప్రస్తావించొద్దని వేడుకుంటున్నానని వైఎస్ విజయలక్ష్మి చెప్పారు.

## ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**మంత్రి శ్రీహరి ఇంటిని ముట్టడించిన ఆశా కార్యకర్తలు**

నారాయణపేట,మార్చి20 : తమ డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఇంటిని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ముట్టడించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే కోరుతూ పెద్ద సంఖ్యలో ఆశా కార్యకర్తలు అక్కడికి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొన్ని రోజులుగా ఆశా కార్యకర్తల సమస్యలపై పోరాటాలు చేస్తున్నా గాని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ఆశా వర్కర్లకు రూ. 18 వేలు వేతనం వెంటనే అమలు చేయాలని, ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆశా వర్కర్లపై పెరుగుతున్న పనిభారం తగ్గించి, అదనపు భత్యాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయాలన్నారు. గర్భిణిలు, శిశు సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశాలకు ప్రత్యేక గౌరవ వేతనం ఇవ్వాలి. ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

**అదుపుతప్పి వాహనాలను ఢీకొన్న ఆర్టీసీ బస్సు**
**ఘటనలో ఏడుగురు దుర్మరణం**


చెన్నై,మార్చి 20 : తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డుపై వెళుతున్న ఇతర వాహనాలను ఢీకొట్టిన ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన సేలం జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం ఓ ఆర్టీసీ బస్సు కోయంబత్తూరు నుంచి సేలం బయలుదేరింది. బస్సు ఉత్తమ శోలపురం దగ్గర హైవేపై వెళుతుండగా అదుపుతప్పింది. డివైడర్‌ను దాటుకుని అవతలి వైపు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఆ రోడ్డుపై వెళుతున్న ఓ బైక్‌తో పాటు టెంపోను ఢీకొట్టింది. బైక్, టెంపో నుజ్జునుజ్జయ్యాయి. బైకుపై ప్రయాణిస్తున్న ఓ మహిళతో పాటు ఆమె కూతురు అక్కడికక్కడే మరణించారు. ఇక.. టెంపోలో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారిలో 11 నెలల చంటిపాప కూడా ఉండటం విషాదకరం. మాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ సభ్యులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు మొదలుపెట్టారు. గాయపడినవారిని చికిత్స కోసం దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతివేగం కారణంగానే బస్సు అదుపుతప్పి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై సీనియర్ పోలీస్ అధికారి ఒకరు మాట్లాడుతూ.. 'ప్రమాదానికి సంబంధించి పూర్తి దర్యాప్తు జరుగుతోంది. దర్యాప్తు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

## వాతావరణ పరిస్థితులపై రైతులను అప్రమత్తం చేయాలి

అమరావతి,మార్చి 20 : రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులపై రైతులకు, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ, అప్రమత్తం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తద్వారా పంట నష్టం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, పంట నష్టం జరిగినప్పుడు పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని చెప్పారు. రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానలతో పంటలకు జరిగిన నష్టంపై గురువారం సీఎం చంద్రబాబు సమీక్ష జరిపారు. ఇప్పటి వరకు గాలివానలు, వర్షాలు, వడగళ్ల కారణంగా దెబ్బతిన్న పంట నష్టం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కృష్ణా, నెల్లూరు, శ్రీసత్యసాయి, ఎన్టీఆర్, అనంతపురం, మన్యం జిల్లాల్లోని 16 మండలాల్లో 89 గ్రామాల్లో వర్షాలతో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అధికారులు సీఎంకు వివరించారు. 384 హెక్టార్లలో వరి, 630 హెక్టార్లలో మొక్కజొన్న, 200 హెక్టార్లలో మినుము పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. మొత్తం 1,215 హెక్టార్లలో సాధారణ పంటలు దెబ్బతినగా, 2,043 మంది రైతులు నష్టపోయినట్లు చెప్పారు.

# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

**అకాల వర్షంతో పంటనష్టపోయిన వారికి హామీ**
**కలెక్టలర్లతో సమీక్షించిన సిఎం చంద్రబాబు**



అమరావతి,మార్చి 20 : అకాల వర్షాలతో పంట దెబ్బతిన్న రైతన్నలను ఆదుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రైతన్నలు అధైర్యపడొద్దని.. అండగా ఉంటామని భరోసా కల్పించారు. అకాల వర్షాలతో పంట నష్టంపై సీఎం తన క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. అకాల వర్షాలతో సంభవించిన పంట నష్టంపై వరుసగా రెండో రోజూ సీఎం సమీక్షించారు. భారీ గాలులు, అకాల వర్షాలు, వడగళ్లతో దెబ్బతిన్న పంటల వివరాలను తెలుసుకున్నారు. 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు వివరించారు. వీటి విలువ రూ.40 కోట్లుగా అధికారులు తేల్చారు. 9 జిల్లాల్లో 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మిరప, కూరగాయలు, మామిడి, ఆరెంజ్, నిమ్మ పంటలు దెబ్బతినట్లు అధికారులు వెల్లడించారు. ఉద్యాన పంటల నష్టం విలువ రూ.22.68 కోట్లుగా అంచనా వేశారు. సీఎం చంద్రబాబుకు సబ్కా ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. ఉగాది కానుకగా తాము సైతం ఊహించని విధంగా సూక్ష్మ, చిన్న మధ్యతరగతి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారని హర్షం వ్యక్తం చేశారు. సుదీర్ఘంగా ఎదురు చూస్తున్న 2021 వివిధ మున్సిపాలిటీలలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేయడంపై సబ్కా మనస్ఫూర్తిగా స్వాగతిస్తోందని అన్నారు. అలాగే రోడ్ల పనులు చేసిన వారికి, డీఎంఎఫ్, ఎస్డీఎంఎఫ్, వివిధ రాష్టాల్లో పనులు చేసిన వారికి బిల్లులు విడుదల చేశారని తెలిపారు. ప్రభుత్వానికి ఉన్న ఆర్థిక సవాళ్లలో సైతం ఉగాది పండుగ సందర్భంగా నిధులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రికి, మంత్రులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా బిల్లులు రాని కాంట్రాక్టర్లకు సైతం ఈ ఆర్థిక సంవత్సరంలోనే నిధులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

## పాల ఉత్పత్తి దారులు నమోదు తప్పనిసరి

**పశుసంవర్ధక శాఖ సంచాలకులు దామోదర్ నాయుడు..**

విజయవాడ,మార్చి20 : పాల సహకార సంఘాలలో సభ్యులు కాని పాల ఉత్పత్తి మరియు విక్రయదారులు తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఎఫ్ఎస్ఎస్ఎఐలో నమోదు చేసుకోవలెనని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు పాల విక్రయదారులకు సూచించారు. సహకార సంఘాల్లో సభ్యులుకాని పాల ఉత్పత్తి మరియు విక్రయదారులు తప్పనిసరిగా అనుమతులు పొందిన పిమ్మట మాత్రమే తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో పాల కల్తీకి సంబందించిన ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పాల ఉత్పత్తి మరియు విక్రయదారుల నమోదు / లైసెన్సింగ్ నియమావళిని తప్పనిసరిగా అనుసరించాలని ఆయన తెలిపారు. ఈ పక్రియలో భాగంగా పశుసంవర్ధక శాఖాధికారులు తమ నిర్దేశిరచబడిన అధికార బృందాలచే కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి పాల ఉత్పత్తి మరియు విక్రయదారులు ఈ÷ూంఎ లో సంబంధిత నమోదు / లైసెన్స్ కలిగి ఉన్నారా? లేదా? అని నిర్దేశిరచడం జరుగుతుందని చెప్పారు. ÷ూల ఉత్పత్తి మరియు విక్రయదారుల పాలు ఇతర ఉత్పత్తుల నిర్వహణ సురక్షితమైన మరియు నాణ్యమైన విధానంలో జరుగుతోందని పశు సంవర్ధక శాఖ అధికారులు ధ్రువీకరించడం జరుగుతుందన్నారు. నిబంధనలు పాటించని సందర్భంలో తగిన చర్యలు అనేవి తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ూష్ట్రం లోని పాలు మరియు వాటి ఉప ఉత్పత్తుల వినియోగదారులు అందరూ ఈ విషయంలో తగిన అవగాహనతో ఉండాలని తెలిపారు. ఏదైనా పాల ఉత్పత్తి మరియు విక్రయ నిర్వహణలో ఆహార భద్రతా ప్రమాణాలను పాటించని పాల విక్రయదారుల ఎడల ఫిర్యాదులను మీ సమీప ఆహార భద్రతా అధికారి వారికి తెలియజేయమని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తి మరియు విక్రయదారులు ఏ విధమైన లోటుపాట్లు ఫిర్యాదులు లేకుండా పాలు ఉపఉత్పత్తుల విక్రయాలు సమగ్రంగా చేసుకోవాలన్నారు. అధికారుల పర్యవేక్షణ తనిఖీలు సక్రమంగా ఉండేందుకు వినియోగదారుల నుండి ఫిర్యాదులు అనేవి రాకుండా ఉండేందుకు విక్రయ దారులు ఈ÷ూంఎ లో లైసెన్స్ నమోదు చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు ఈ సందర్భంగా సూచించారు.

## కైరుప్పలలో వైభవంగా పిడకల సమరం

**పరస్పరం పిడకలు విసురుకున్న భక్తులు**

కర్నూలు,మార్చి 20 : కర్నూలు జిల్లా ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో సంప్రదాయ పిడకల సమరం అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. ఆధునిక కాలంలో కూడా తమ పూర్వీకుల నాటి ఆచారాలను గౌరవిస్తూ, కైరుప్పల గ్రామస్థులు ఈ పిడకల సమరాన్ని ఏటా నిర్వహించడం విశేషం. కైరుప్పల గ్రామంలో ప్రతి సంవత్సరం ఉగాది సందర్భంగా జరిగే ప్రసిద్ధ 'పిడకల సమరం' ఈ ఏడాది కూడా అత్యంత ఉత్సాహంగా, సంప్రదాయబద్ధంగా జరిగింది. ఈ ఏడాది జరిగిన పిడకల సమరంలో వీరభద్రస్వామి - కాళికాదేవికి సంబంధించిన ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు పిడకలు విసురుకున్నారు. ఈ పోరులో సుమారు 36 మందికి పిడకల ముక్కలు తగిలి చిన్నపాటి గాయాలయ్యాయి. అయినప్పటికీ ఆ గ్రామంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఈ వేడుక అత్యంత ప్రశాంతంగా ముగిసింది. ఈ వింత సంబరాన్ని చూసేందుకు కర్నూలు జిల్లా నుంచే కాకుండా పక్క రాష్టాలైన కర్ణాటక, తెలంగాణ నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దెబ్బలు తగిలినా అది స్వామివారి ఆశీస్సుగా భావిస్తారు. వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా.. కైరుప్పలలో శుక్రవారం సాయంత్రం పిడకల సమరం జరిగింది. ఈ సమరం కోసం పిడకలను సిద్ధం చేశారు. ఆలయ ఆవరణలో రాశులుగా పిడకాలను ఉంచారు. మండలంలోని అస్పరి, కారుమంచి, బిల్లేకల్లు, చిన్నపల్లి, పుష్పాలదొడ్డి, యాటకల్లు, కలపరి, దొడగొండ, తురువగల్, అలారుదిన్నె, ముత్తకూరు గ్రామాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. ఈ పోరు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఈ పోరాటం కేవలం సంప్రదాయంలో భాగంగానే జరుగుతుంది. కార్యక్రమం ముగిసిన తర్వాత అందరూ కలిసి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సమరంలో భక్తులు తమ కోర్కెలను నెరవేర్చుకోవడం, వీరభద్ర స్వామికి పిడకలను సమర్పించడంలో భాగంగా ఆనవాయితీగా పాల్గొన్నారు.

## ఎంపి డ్రగ్స్ వ్యవహారంపై టిడిపిలో రచ్చ

**పార్టీ నోటీసులతో వివరణ ఇచ్చుకున్న మహేశ్ కుమార్**
**సీల్డు కవర్‌లో వివరణ పంపిన ఏలూరు ఎంపి**

అమరావతి,మార్చి 20 : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రంగారెడ్డి జిల్లాల్లోని మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన డ్రగ్స్ ఉదంతం కార్చిచ్చు రేపుతోంది. ఇద్దరు కీలక రాజకీయ నేతలు ఈ కేసులో ఇరుక్కోవడం, వారికి నిర్వహించిన డ్రగ్స్ పరీక్షల్లో 'పాజిటివ్' అని తేలడం ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసులో ప్రధానంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిల పేర్లు బయటకు రావడం సంచలనం సృష్టిస్తోంది. తెలుగుదేశం పార్టీ, క్రమశిక్షణ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పేరు డ్రగ్స్ కేసులో వినిపించడమే కాకుండా, పరీక్షల్లో పాజిటివ్ అని తేలడంతో టీడీపీ హైకమాండ్ తీవ్రంగా పరిగణించింది. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు గాను టీడీపీ హైకమాండ్ ఎంపీ మహేశ్ కుమార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై స్పందించిన ఎంపీ, తన వివరణను ఒక సీల్డ్ కవర్‌లో పార్టీ కార్యాలయానికి పంపారు. ఈ లేఖను అందుకున్న ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వెంటనే చంద్రబాబు నాయుడుకి పంపించారు. ప్రస్తుతం ఈ లేఖలో ఎంపీ ఏం వివరణ ఇచ్చారనేది రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. డ్రగ్స్ కేసులో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పట్టుబడిన వ్యవహారంపై చంద్రబాబు నాయుడు మొదటి నుంచి గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల తిరుపతిలో జరిగిన ఎమ్మెల్యేల సమావేశంలో కూడా ఎంపీ పేరును ప్రస్తావిస్తూ చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్ ప్రాంతంలో జరిగిన ఒక ప్రైవేట్ పార్టీపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ పార్టీలో డ్రగ్స్ వినియోగం జరిగినట్లు సమాచారం రావడంతో ఈగల్ బృందం రంగంలోకి దిగింది. పార్టీలో పాల్గొన్న పలువురికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌తో పాటు పలువురికి డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది.

## శాసనసభ సోమవారానికి వాయిదా

**బడ్జెట్ ప్రసంగాన్ని బహిష్కరించిన బిఆర్ఎస్**

హైదరాబాద్,మార్చి20 : తెలంగాణ శాసనసభ సోమవారానికి వాయిదా పడింది. శుక్రవారం సభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. రూ.3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.బ్జడెట్ ప్రసంగం పూర్తి అయిన అనంతరం స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు.కాగా... ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క బ్జడెట్ ప్రసంగం కొనసాగతుండగానే సభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. అన్ని వర్గాలను మోసం చేశారంటూ.. చెవిలో పూలు పెట్టుకుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. బ్జడెట్ ప్రతులను చించివేశారు. బ్జడెట్ మొత్తం మోసం.. మోసమంటూ బీఆర్ఎస్ సభలో నిరసనలు తెలిపింది. ఆరు గ్యారంటీలకు బ్జడెట్‌లో కేటాయింపులు లేవంటూ బీఆర్ఎస్ నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు. సభ నుంచి బీఆర్ఎస్ నేతల వాకౌట్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు.

## రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదు

**బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు**
**మంత్రి నాదెళ్ల మనోహర్ హెచ్చరిక**

అమరావతి,మార్చి 20 : రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదని ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాపై ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, జాయింట్ కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. ప్రజల్లో అపోహలు, ఆందోళనలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గృహ అవసరాల కోసం ఉద్దేశించిన వంట గ్యాస్ ఎక్కడా కొరత లేదని మంత్రి తెలిపారు. గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని ఆయిల్ కంపెనీలు కూడా తెలియజేశాయని చెప్పారు. అయితే గ్యాస్‌ను పక్కదారి పట్టించడం, అక్రమంగా వాణిజ్య అవసరాలకు మళ్లించడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించా ల్సిందిగా సూచించారు. జిల్లాల్లో గ్యాస్ ఏజెన్సీలు, డిస్ట్రిబ్యూటర్ల వద్ద బుకింగ్స్, డెలివరీలు, పెండింగ్ అంశాలను నిరంతరం సమీక్షించాలని జాయింట్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అనుమానాస్పద లావాదేవీలు లేదా సరఫరాలో అక్రమాలు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మంత్రి మాట్లాడుతూ.. గ్యాస్ కొరతపై ప్రభుత్వం పూర్తిగా దృష్టి సారించిందన్నారు. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషిస్తున్నామని చెప్పారు. ఈ నెల 21న రావాల్సిన గ్యాస్ నౌక 25న చేరుతుందని కేంద్రం సమాచారం ఇచ్చిందని వెల్లడించారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా అవసరమైనంత మేరకే గ్యాస్ బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికంగా బుకింగ్స్ చేస్తే ఇతరులకు ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించారు. గ్యాస్ బుకింగ్స్ ఆన్‌లైన్ ద్వారానే చేయాలని, ఓటీపీ వచ్చిన తర్వాతే బుకింగ్ ఖరారవుతుందని తెలిపారు. బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే మీడియా కథనాల ఆధారంగా నిఘా పెంచినట్లు చెప్పారు. గృహ అవసరాల గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు మళ్లించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అదేవిధంగా, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అర్బన్ ప్రాంతాల్లో పైప్డ్ గ్యాస్ విధానంపై పని జరుగుతోందని వెల్లడించారు. హోటల్స్, రెస్టారెంట్ల ప్రతినిధులతో త్వరలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా పాఠశాల హాస్టల్స్, ఆసుపత్రులకు గ్యాస్ సరఫరా ప్రాధాన్యను బట్టి ఇస్తామని చెప్పారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం కిరోసిన్ సరఫరాను కూడా అనుమతించిందని, అవసరమైతే రాష్ట్రంలో మళ్లీ వినియోగంలోకి తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు.

## విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త

**ఇంటర్‌లో బ్రేక్‌ఫాస్ట్ పథకం**


హైదరాబాద్,మార్చి20 : విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం తీపికబురు చెప్పింది. రాష్ట్రంలోని ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు అందరికి బ్రేక్ పాస్ట్ పథకాన్ని అందిస్తామని ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. బడ్జెట్‌లో ఈ ప్రతిపాదనలను ఉంచారు. అలాగే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకుని వస్తున్నామన్నారు. ఈ పథకాలను 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు వివరించారు. శుక్రవారం తెలంగాణ అసెంబ్లీలో ఈ ఏడాది వార్షిక బడ్జెను ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. దివ్యాంగ, శారీరక వైకల్య విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల పంపిణీ చేస్తామని తెలిపారు. సంక్షేమ స్కూళ్లలో వసతుల మెరుగుకు చర్యలు చేపడతామన్నారు. అందుకోసం రూ.100 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ÷ూష్ట్రంలోని 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పాలిటెక్నిక్ కాలేజీల్లో 15 కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. అలాగే స్కిల్ యూనివర్సిటీని విద్యా శాఖ పరిధిలోకి తీసుకు వస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.



# మణిరత్నం.. రహమాన్ కాంబో

## సాయిపల్లవి, విజయ్ సేతుపతి మూవీ

దిగ్గజ దర్శకుడు మణిరత్నం తన ఆస్థాన సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్‌తో మరోసారి చేతులు కలుపబోతున్నాడు. 1992లో 'రోజా' సినిమాతో మొదలైన వీరిద్దరి అద్భుత ప్రయాణం, ఇప్పుడు 19వ సారి ఈ కొత్త సినిమాతో కొనసాగబోతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి హీరోగా నటించబోతుండగా.. 'నేచురల్ స్టార్' సాయి పల్లవి మణిరత్నం సినిమాలో హీరోయిన్‌గా నటించబోతుంది. గత కొద్ది రోజులుగా ఈ సినిమాకు యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ పనిచేస్తారనే ప్రచారం జరిగినప్పటికీ, వాటన్నింటికీ చెక్ పెడుతూ మద్రాస్ టాకీస్ సంస్థ రెహమాన్ పేరును అధికారికంగా ప్రకటించింది. ఒక ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం కోసం రెహమాన్ ఇప్పటికే ఒక పాటను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. మద్రాస్ టాకీస్ మరియు లైకా ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది జూలై నాటికి ప్రారంభం కానుంది.




# సర్కే చునార్ తేరి సర్కే' పాట వివాదం

## నోరా ఫతేహిపై ముస్లిం సంస్థ ఫత్వా జారీ

కన్నడ చిత్రం 'కేడీ: ద డెవిల్' లోని 'సర్కే చునార్ తేరి సర్కే' పాట తీవ్ర వివాదాలకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఈ పాటలో నటించిన బాలీవుడ్ నటి నోరా ఫతేహీపై అలీగఢ్‌కు చెందిన ముస్లిం పర్సనల్ దారుల్ ఇఫ్తా అనే మతపరమైన సంస్థ ఫత్వా జారీ చేసింది. ఈ పాటలోని సాహిత్యం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధంగా ఉందని సదరు సంస్థ పేర్కొంది. ఇటువంటి ప్రదర్శనలు సమాజంలో తప్పుడు సందేశాన్ని పంపుతాయని, ముఖ్యంగా ముస్లిం యువతను తప్పుదోవ పట్టిస్తాయని వారు తమ ఫత్వాలో పేర్కొన్నారు. మరోవైపు ఈ పాటకు దేశవ్యాప్తంగా వస్తున్న నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పాటపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ఈ విషయాన్ని ధృవీకరించారు. మరోవైపు ఈ వివాదంపై నోరా ఫతేహీ స్పందిస్తూ.. ఈ పాట హిందీ వెర్షన్‌లో తనకేమీ సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. మూడేళ్ల క్రితం సంజయ్ దత్ వంటి దిగ్గజ నటుడితో కలిసి నటించే అవకాశం రావడం, అలాగే ఇది 'నాయక్ నహి ఖల్ నాయక్ హూ మై' వంటి ఐకానిక్ సాంగ్ రీమేక్ అని భావించి తాను అంగీకరించానని తెలిపారు. తనకు కన్నడ భాష తెలియదని, మేకర్స్ చెప్పిన అనువాదం అప్పట్లో అభ్యంతరకరంగా అనిపించలేదని ఆమె వివరణ ఇచ్చారు. ధ్రువ సర్జా హీరోగా, ప్రేమ్ దర్శకత్వంలో 1970ల నాటి బెంగళూరు నేపథ్యంతో తెరకెక్కిన 'కేడీ: ద డెవిల్' చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది.





# ఉస్తాద్ భగ్ సింగ్ హిట్ టాక్

## దర్శకుడు హరీష్ శంకర్ ఆనందం

ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా బాగుందన్న అభిప్రాయం రావడం ఎంతో ఆనందాన్నిచ్చిందని దర్శకుడు హరీష్‌శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో... పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్.వై సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఉగాది సందర్భంగా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్ అభిమానులు ఫోన్ చేసి 'అన్నా సినిమా చాలా బాగుంది' అంటున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చేలా సినిమాని మలిచాం. తొలి రోజు నుంచీ ఓ కమర్షియల్ సినిమా తీస్తున్నానని, ఒకప్పటిలా హుషారైన పవన్‌కల్యాణ్ ఇందులో కనిపిస్తారని చెబుతూ వచ్చా. సినిమా చూసినవాళ్లు ఈ సినిమాలో ఇన్ని అంశాలు ఉన్నాయని మాకు తెలియదంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇందులోని ప్రతి పాత్ర బాగా పండింది. అందరికృషితోనే ఇంత మంచి సినిమా చేయగలిగాం అన్నారు. నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ థియేటర్ల దగ్గర పండగ వాతావరణం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అమెరికా అనే తేడా లేకుండా అన్ని చోట్లా ప్రేక్షకులు సినిమాని ఆస్వాదిస్తున్నారు. మేం ఊహించిన దానికంటే మంచి స్పందన వచ్చింది. పవన్ కల్యాణ్ వన్ మేన్ షో ఇది. హరీశ్‌శంకర్ ఎంతో బాధ్యతగా 'గబ్బర్‌సింగ్' సినిమాని మించేలా తెరకెక్కించారు. కచ్చితంగా భారీ వసూళ్లు సాధిస్తుందీ చిత్రం' అన్నారు. నిర్మాత రవిశంకర్.వై మాట్లాడుతూ 'పెద్ద హీరో నుంచి వాణిజ్య ప్రధానమైన సినిమా వచ్చి చాలా కాలమైంది. ఇందులో కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలూ ఉన్నాయి. మాకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఈ సినిమా విజయంపై మేం సంతోషంగా ఉన్నాం' అన్నారు. ఈ కార్యక్రమంలో కళా దర్శకుడు ఆనంద్‌సాయి, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.




# అట్టహాసంగా గద్దర్ ఫిల్మ్ అవార్డులు

## ఉగాది రోజు సిఎం రేవంత్ చేతుల మీదుగా ప్రదానం

## తారల రాకతో పులకించిన చిత్రసీమ

ఉగాది సందర్భంగా గద్దర్ తెలంగాణ సినీ అవార్డులు వేడుక అంగరంగ వైభవంగా సాగింది. చిత్రసీమ మొత్తం తరలిరావడంతో సంబరాలు అంబరాన్ని అంటాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సినీ పురస్కారాల్ని ఏర్పాటు చేసి రెండేళ్లుగా ఘనంగా ప్రదానం చేస్తోంది. ఉగాది అనగానే గతంలో తెలుగు ప్రేక్షకులు.. చిత్రసీమ సినీ పురస్కారాల పండగని గుర్తు చేసుకొనేది. పలు కారణాలతో మధ్యలో పద్నాలుగేళ్లపాటు ఈ పురస్కారాలకు నోచుకోలేకపోయింది తెలుగు సినిమా. గతేడాది నుంచి సినిమా రంగంలోని ప్రతిభకు పట్టం కడుతూ... ఉత్తమ చిత్రాల రూపకల్పన కోసం ప్రోత్సాహాన్ని అందించడంలో భాగంగా తెలంగాణ



రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సినీ పురస్కారాల్ని ప్రదానం చేస్తోంది. గత ఆనవాయితీ మేరకే ఈసారి ఉగాది సందర్భంగానే గద్దర్ సినీ పురస్కారోత్సవం – 2025 వేడుకని నిర్వహించడం విశేషం. తెలుగు సంవత్సరాది రోజున... పురస్కారాల్ని చేతపట్టి సినీ తారలు, సాంకేతిక బృందాలు, దర్శక నిర్మాతలు మురిసిపోయారు. దక్షిణాది తారలతోపాటు... హిందీ తారలూ ఈ వేడుకలో పాల్గొని ప్రధాన ఆకర్షణగా నిలిచారు.సాంస్కృతిక కార్యక్రమాలు, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుక ఆద్యంతం సందడిగా సాగింది. అలనాటి తారలు సావిత్రి, శ్రీదేవి, సౌందర్య తదితరుల్ని గుర్తు చేస్తూ... కథానాయిక నిధి అగర్వాల్ వేదికపై చేసిన నృత్యాలు, గాయని మంగ్లీ ఆటాపాట, 'నాగబంధం'లోని నమోరే పాటకు నభా నటేశ్, దక్ష నాగర్కర్ నృత్యాలు, దేవిశ్రీప్రసాద్ హుషారెత్తించేలా పాడిన పాటలు, ఆయన మార్క్ సంగీత ప్రదర్శనలు వేడుకకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలుగుసినీ తారలు, పురస్కార గ్రహీతలతోపాటు హిందీ నుంచి వచ్చిన మాధురీ దీక్షిత్, జెనీలియా, రితేశ్ దేశ్‌ముఖ్ సందడితో వేడుక కళకళలాడింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పర్యటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, ఎఫ్.డి.సి ఎండీ సీహెచ్ ప్రియాంక తదితరులు విజేతలకు పురస్కారాల్ని ప్రదానం చేశారు. సాయిప్రసాద్ (తండ్రి రమేశ్ ప్రసాద్ బదులుగా, రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు), సుద్దాల అశోక్ తేజ (సి.నారాయణరెడ్డి ఫిల్మ్ అవార్డు), అశ్వినీ దత్ (నాగిరెడ్డి చక్రపాణి అవార్డు), కమల్‌హాసన్ (సింగీతం శ్రీనివాసరావుకు బదులుగా, బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు) దక్కించుకున్నారు. సిఎంరేవంత్‌రెడ్డి, రామ్‌చరణ్ చేతుల మీదుగా పురస్కారం స్వీకరిస్తున్న నాగచైతన్య, రష్మిక ఉత్తమ నటి పురస్కారం అందుకోవడానికి వేదికపైకి వచ్చిన రష్మిక మందన్నని 'మా ఊరి కోడలు...' అంటూ యాంకర్ సుమకి పరిచయం చేశారు రేవంత్‌రెడ్డి. పురస్కారం అందుకున్న అనంతరం రష్మిక మాట్లాడుతూ రేవంత్ రెడ్డి చేతులమీదుగా అందుకున్న ఈ పురస్కారం ఎంతో ప్రత్యేకం. రాష్ట్ర ప్రభుత్వం నా నటనని మెచ్చి పురస్కారం ఇచ్చిందని అన్నారు. ఉత్తమ



నటుడిగా పురస్కారం అందుకున్న నాగచైతన్య మాట్లాడుతూ 'పదహారేళ్ల సినీ ప్రయాణంలో ఇదెంతో ప్రత్యేకమైన గుర్తింపు. గద్దర్ గొప్ప వ్యక్తి, విప్లవకారుడు. ఆయన పేరు మీద ఏర్పాటు చేసిన ఈ పురస్కారాన్ని అందుకున్నందుకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, సీనియర్ కథానాయిక మాధురీ దీక్షిత్ నుంచి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్న అనంతరం చిరంజీవి మాట్లాడుతూ 'కళాకారులకు ఎక్కడ గౌరవం దక్కుతుందో ఆ రాష్ట్రం, ఆ దేశం, ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుందని నానుడి. దాని అర్థం పరమార్థం గ్రహించి నిర్లక్ష్యానికి గురైన పురస్కారాల్ని మళ్లీ పునరుద్ధరించి, పునరుజ్జీవం పోసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. మేం కలిసిన ప్రతిసారీ సినిమా గురించి, సినిమా అభివృద్ధి గురించే చర్చ ఉంటుంది. తెలుగు సినిమా, దక్షిణ భారత సినిమా అని కాదు, భారతదేశ సినిమాకు హైదరాబాద్‌ని కేంద్రంగా నిలిపేందుకు, ఆ దిశగా తెలుగు చిత్ర పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు సమాయత్తం అవుతున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ జరిగినప్పుడు సినిమాకి ప్రాధాన్యం కల్పించారు. చిత్ర పరిశ్రమకు చెందిన మంచి చెడులు చర్చించి సదుపాయాలు కల్పించేందుకు ముందుకొచ్చారు. సినిమావాళ్లకు అతి దగ్గరగా ఉన్నటువంటి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గద్దర్ సినీ పురస్కారాల్ని స్ఫూర్తిగా తీసుకొని, ఆ దిశగా ప్రోత్సహిస్తే యువతరం మరిన్ని సినిమాలు చేస్తుంది' అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కథానాయకుడు నాగార్జున చేతులమీదుగా అక్కినేని నాగేశ్వరరావు పురస్కారం అందుకున్న జయసుధ మాట్లాడుతూ 'ఏఎన్నార్‌తో ఎన్నో గొప్ప చిత్రాల్లో నటించాను. ఆయన హృదయానికి చికిత్స జరిగిన అనంతరం తిరిగి సినిమాల్లోకి వచ్చినప్పుడు 'ట్రెండ్ మారిపోయింది కదా, నటనలో ఏమైనా మార్పులు చేసుకోవాలా?' అంటూ అప్పుడప్పుడే పరిశ్రమలోకి వచ్చిన నటుడిలా అడిగేవారు. అంత గొప్ప నటుడు అంత సాధారణంగా ఉండటం మా అందరికీ ఓ గొప్ప పాఠం' అన్నారు. కాంతారావు పురస్కారాన్ని అందుకున్న ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ 'పదమూడేళ్లపాటు సినీ పరిశ్రమ పురస్కారాల కోసం ఎదురు చూసింది. అలాంటిది సూపర్‌స్టార్ కృష్ణ అభిమాని అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతేడాది పురస్కారాల్ని పునః ప్రవేశపెట్టి తెలుగు సినిమా ఉనికిని, కళాకారుల్ని గుర్తించి, గౌరవించినందుకు నా అభినందనలు. గద్దర్ ప్రజా వాగ్గేయకారుడు. ఆయన పేరుపై ఈ పురస్కారాల్ని అందించినందుకు నా సెల్యూట్. ఎన్టీఆర్, ఏఎన్నార్ తర్వాత అంతటి మరో హీరో కాంతారావు. తెలంగాణ గడ్డ బిడ్డ అయిన ఆయన పేరుపై పురస్కారాన్ని నాకు ఇచ్చి జన్మ ధన్యం చేశారు' అన్నారు. బి.ఎన్.రెడ్డి పురస్కారానికి ఎంపికైన సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తరఫున కమల్‌హాసన్ పురస్కారాన్ని స్వీకరించడం విశేషం. పైడి జయరాజ్ పురస్కారాన్ని అందుకున్న కమల్‌హాసన్ మాట్లాడుతూ 'సింగీతం పురస్కారం అందుకున్నప్పుడు నాకు ఆయన 'సొమ్మొకడిది సోకొకడిది' సినిమా గుర్తుకొచ్చింది. గద్దర్‌కు ఉన్న మిలియన్లకొద్దీ అభిమానుల్లో నేను ఒకడిని. నా సినిమా కెరీర్‌లో నేను కలిసిన అత్యంత యువకుడైన సీనియర్ ఆయన. కవి, విప్లవకారుడైన ఆయన్ను గౌరవిస్తూ ఈ పురస్కారం ఏర్పాటు చేయడంతోనే మా అందరికీ గౌరవం దక్కినట్లైంది.'అన్నారు.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056